శుక్రవారం
19-04-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 297
పేజీలు : 10, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

# విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

## జపాన్‌లో భూకంపం

టోక్యో: జపాన్‌లోని నైరుతి ప్రాంతంలో గురువారం బలమైన భూకంపం సంభవించింది. ఈ భూకంపం వల్ల సుమారు 9 మంది స్వల్పంగా గాయపడ్డారు. దాని ధాటికి నీటి పైపులు దెబ్బతిన్నాయి. కొన్ని చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. అయితే సునామీ వచ్చే ప్రమాదం ఏమీ లేదని అధికారులు చెప్పారు. షికోకో దీవికి పశ్చిమ దిక్కున 6.6 తీవ్రతతో భూకంపం నమోదు అయ్యింది. షికోకు, క్యుషు దీవుల మధ్య భూకంప కేంద్రం ఉన్నట్లు భావిస్తున్నారు. సముద్ర ఉపరితలానికి 50 కిలోమీటర్ల లోతులో భూకంపం సంభవించింది. దీంతో షికోకు రైల్వే సర్వీసలను కొన్ని ప్రాంతాల్లో రద్దు చేశారు. ఇకాటా న్యూక్లియర్ కాంప్లెక్స్ వద్ద విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.

# భానుడి భగభగ

- అసాధారణరీతిలో పెరిగిన ఉష్ణోగ్రతలు
- ఉక్కపోతతో అల్లాడుతున్న జనం
- మరో మూడురోజులు వడగాలులు
- వాతావరణశాఖ హెచ్చరిక

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్రంలో భానుడి ప్రతాపం తీవ్ర స్థాయిలో ఉంది. ఏప్రిల్ గడవకుండానే రాష్ట్రం నిప్పుల కొలిమిలా మారింది. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు అందరూ సూర్య తాపానికి విలవిల్లాడిపోతున్నారు. ఇప్పటికే వివిధ ప్రాంతాల్లో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తాజాగా మరో మూడు రోజుల పాటు రాష్ట్రంలో భానుడి ప్రతాపం తీవ్ర స్థాయిలో ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో 40 డిగ్రీలు దాటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని విశాఖ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. రాయలసీమ జిల్లాలైన కర్నూలు, అనంతపురం జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు ఉంటాయని పేర్కొన్నారు. అలానే కోస్తా తీరానికి సమీపంలో ఉండే ప్రాంతాల్లో సాధారణ ఉష్ణోగ్రత నమోదవుతాయని, వడగాల్పులు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ముఖ్యంగా ఈ మూడు రోజుల పాటు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అత్యవసరమైతే తప్ప బయటికి రావద్దని ప్రజలకు వాతావరణశాఖ సూచించింది. బుధవారం వైఎస్సార్ కడప జిల్లా కొంగలవీడులో 45.3 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. విజయవాడలో గురువారం మధ్యాహ్నం ఉష్ణోగ్రత 43 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. ఒంటిపూట బడికి వెళుతున్న విద్యార్థులు నీరసిస్తున్నారు. పాఠశాలల్లో ఫ్యాన్లు లేక... ఉన్నా వేడి గాలికి చిన్నారులు తరగతి గదుల్లో ఉండలేక పోవడంతో పాటు మధ్యాహ్నం వేళ పాఠశాల నుంచి ఇంటికి వెళ్లేసరికి సొమ్మసిల్లిపోతున్నారు. ఇక ఆఫీసులకు వెళ్లే వారు ముఖానికి రుమాళ్లు కట్టుకుని... టోపీలు ధరించి వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్త వహిస్తున్నారు. వృద్ధులు, చిన్నారులు, అనారోగ్యంతో బాధపడే వారు, గర్భిణులు ఎండలకు అల్లాడిపోతున్నారు. నవజాత

- మిగతా 2 లో

# నామినేషన్ల కోలాహలం

నామినేషన్ సమర్పిస్తున్న టీడీపీ ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు

నామినేషన్ దాఖలు చేస్తున్న వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టారేణుక

- మొదటి రోజు 43 సెట్ల నామినేషన్లు దాఖలు
- భారీ ప్రదర్శనలతో సందడి చేసిన అభ్యర్థులు
- తొలి నామినేషన్ పయ్యావులదే

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: తెలుగు రాష్ట్రాల్లో సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. తొలిరోజే అభ్యర్థులు భారీ ప్రదర్శనలతో నామినేషన్లు దాఖలు చేయడంతో ఎన్నికల సందడి నెలకొంది. వివిధ రాజకీయ పార్టీలకు చెందిన కీలక నేతలు భారీ ర్యాలీలతో ఆర్వో కార్యాలయాల వద్దకు చేరుకుని అట్టహాసంగా నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఉదయం 11 గంటల నుంచి నామినేషన్లను రిటర్నింగ్ అధికారులు స్వీకరించారు. రాష్ట్రంలో తొలి నామినేషన్ ఉరవకొండ నియోజకవర్గానికి చెందిన టీడీపీ అభ్యర్థి పయ్యావుల కేశవ్ దాఖలు చేశారు. మంగళగిరి నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి నారా లోకేశ్ తరఫున నామినేషన్ దాఖలైంది. గురువారం మంగళగిరిలోని కార్పొరేషన్ కార్యాలయంలో యువనేత తరఫున కూటమి నేతలు నామినేషన్ దాఖలు చేశారు. రిటర్నింగ్ అధికారి రాజకుమారి గనియాకు రెండు సెట్ల నామినేషన్ పత్రాలు అందజేశారు. టీడీపీ సమన్వయ కర్త నందం అబద్ధయ్య, జనసేన సమన్వయ కర్త చిల్లపల్లి శ్రీనివాసరావు, బీజేపీ సమన్వయకర్త పంచుమర్తి ప్రసాద్ నేతృత్వంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ నాయకులు కలిసి రాగా నామినేషన్ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మంగళగిరిలో భారీ ప్రదర్శన నిర్వహించారు. ముందుగా నిర్ణయించిన ముహూర్తం ప్రకారం మధ్యాహ్నం 2:34 గంటలకు నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు. బీసీవై పార్టీ అధినేత రామచంద్ర యాదవ్ కూడా ర్యాలీగా తరలివెళ్లి మంగళగిరి అసెంబ్లీకి నామినేషన్ వేశారు. ఒంగోలు లోక్‌సభ స్థానానికి టీడీపీ అభ్యర్థిగా మాగుంట శ్రీనివాసులు రెడ్డి, కర్నూలు ఎంపీ అభ్యర్థిగా బస్తిపాడు నాగరాజు, విజయవాడ పశ్చిమ శాసనసభ స్థానానికి బీజేపీ తరఫున కేంద్ర మాజీ మంత్రి సుజనాచౌదరి నామినేషన్లు వేశారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి (టీడీపీ), బుట్టా రేణుక (వైసీపీ), శ్రీశైలం అభ్యర్థిగా శిల్పా చక్రపాణిరెడ్డి (వైసీపీ), శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరు అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి (టీడీపీ), ఎన్టీఆర్ జిల్లా గన్నవరం అభ్యర్థిగా యార్లగడ్డ వెంకట్రావు నామినేషన్ పత్రాలను ఆర్వోకి సమర్పించారు. నూజివీడులో టీడీపీ రెబల్ అభ్యర్థి ముద్రబోయిన వెంకటేశ్వరరావు స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. రాప్తాడు నియోజకవర్గంలో ఇండిపెండెంట్‌గా టీడీపీ రెబల్ రాజేశ్ నామినేషన్ దాఖలు చేశారు. రామచంద్రాపురం ఆర్డీఒ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పిల్లి సూర్య ప్రకాశ్ రెండు సెట్లు నామినేషన్లు దాఖలు చేశారు. అనంతపురం ఆర్డీవో కార్యాలయంలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తరఫున వైసీపీ నేతలు ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. పుట్టపర్తి కలెక్టర్ కార్యాలయంలో హిందూపురం పార్లమెంటు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బోయ శాంత తరఫున ఒక సెట్ నామినేషన్ దాఖలైంది. రాజంపేటంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఆకేపాటి అమరనాథ్ రెడ్డి అట్టహాసంగా నామినేషన్ వేశారు. సూళ్లూరుపేట రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కిలివేటి సంజీవయ్య, తిరువూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు భారీ ప్రదర్శనతో వెళ్లి నామినేషన్లు దాఖలు చేశారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు నామినేషన్ దాఖలు చేశారు. కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి నామినేషన్ వేశారు. మైదుకూరు తహసీల్దార్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రఘురామి రెడ్డి, తిరుపతి నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా భూమన అభినయ్ రెడ్డి, అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లిలో వైసీపీ అభ్యర్థి పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి, చిత్తూరులో ఎంసీ విజయానందరెడ్డి, కావలి ఎమ్మెల్యే అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి భారీ ప్రదర్శనలతో అట్టహాసంగా నామినేషన్‌లు దాఖలు చేశారు. విశాఖ పార్లమెంటు నియోజకవర్గానికి ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్, భీమునిపట్నం

- మిగతా 2 లో

# రాయిదాడి కేసులో నిందితుడి అరెస్టు

- 14 రోజుల రిమాండ్
- సీఎం జగన్‌పై హత్యకు కుట్ర జరిగిందన్న పోలీసులు

విశాలాంధ్రబ్యూరో-అమరావతి: వైసీపీ అధినేత, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై రాయి దాడి కేసులో ప్రధాన నిందితుడిగా భావిస్తున్న సతీశ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో సతీశ్ ఏ1గా ఉన్నాడు. విజయవాడ అజిత్‌సింగ్‌నగర్ వడ్డెకాలనీకి చెందిన సతీశ్‌ను గురువారం పోలీసులు అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. ఇరుపక్షాల వాదోపవాదనల అనంతరం సతీశ్ కు కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. అంతకుముందు సతీశ్‌కు విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో పోలీసులు వైద్యపరీక్షలు నిర్వహించారు. అక్కడి నుంచి కట్టుదిట్ట భద్రత నడుమ కోర్టులో న్యాయవాది ముందు ప్రవేశపెట్టారు. ఇదే కేసులో కొందరు యువకులను పోలీసులు విచారించారు. ఇందులో టీడీపీ సానుభూతి పరుడైన దుర్గారావును పోలీసులు ప్రశ్నిస్తున్నారు. నిందితుడు సతీశ్‌కు ఈయన సహకరించినట్లుగా అనుమానిస్తున్నారు. ఆ దిశగా దర్యాప్తు ముమ్మరం చేశారు. దుర్గారావు వెనకున్న రాజకీయ నేపథ్యంపైనా పోలీసులు దృష్టి పెట్టారు. అన్ని ఆధారాలు, కాల్ డేటా ఆధారంగా సతీశ్‌ను ఏ-1 నిందితుడిగా చేర్చినట్లు రిమాండ్ రిపోర్టులో పోలీసులు పేర్కొన్నారు. సీఎం జగన్ ను హత్య చేసేందుకు కుట్ర పన్నారని...అందుకే సున్నిత ప్రాంతమైన సీఎం కణితిని లక్ష్యంగా చేసుకుని పక్కా వ్యూహంతో దాడి చేశారంటూ రిమాండ్ రిపోర్ట్ లో తెలిపారు. లభ్యమైన ఆధారాలతో ఏ-1గా సతీశ్ పై కేసు పెట్టి... 12 మంది సాక్షుల వాంగ్మూలం రికార్డు చేశామని వివరించారు. ఈ నెల 13వ తేదీన విజయవాడ అజిత్‌సింగ్‌నగర్ వివేకానంద స్కూల్ దగ్గర బస్సు యాత్రలో ఉన్న సీఎం జగన్‌పై గుర్తు తెలియని వ్యక్తులు రాయి విసరడంతో ఆయనకు కణితి వద్ద గాయమైంది. ఆ పక్కనే ఉన్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్ కంటికి సైతం గాయమైంది. దీంతో వెలంపల్లి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో సీఎం జగన్‌పై హత్యాయత్నం జరిగినట్లు కేసు నమోదైంది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ కేసులో సమగ్ర దర్యాప్తు

- మిగతా 2 లో

## జైల్లో కేజ్రీవాల్ అంతానికి కుట్ర

- దిల్లీ మంత్రి అతిశి ఆందోళన
- ఈడీ ఆరోపణలకు కౌంటర్

న్యూదిల్లీ: దిల్లీ మద్యం కుంభకోణం కేసులో దిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ బెయిల్ కోసం కావాలనే మామిడిపండ్లు, స్వీట్లు వంటి తియ్యటి పదార్థాలు తింటున్నారంటూ ఈడీ చేసిన ఆరోపణలపై ఆమ్ ఆద్మీ పార్టీ తీవ్రంగా స్పందించింది. ఈడీ తప్పుడు ఆరోపణలు చేస్తోందని దుయ్యబట్టింది. సీఎం కేజ్రీవాల్‌ను జైల్లోనే అంతం చేసేందుకు కుట్ర జరుగుతోందని ఆప్ నేత, దిల్లీ మంత్రి అతిశి ఆరోపించారు. కేజ్రీవాల్ టైప్-2 డయాబెటిస్ పేషెంట్ అని... పదేపదే అభ్యర్థించినప్పటికీ ఇన్సులిన్ ఇవ్వడం లేదని ఆమె

- మిగతా 2 లో

## ఎన్డీయే కూటమికి రెబల్స్ బెడద!

- నూజివీడు, రాప్తాడులో స్వతంత్ర అభ్యర్థుల నామినేషన్లు
- మరికొందరు టీడీపీ అసంతృప్త నేతలు సిద్ధం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీయే కూటమికి నామినేషన్ల సమయంలోనూ ఎదురు దెబ్బ తగిలింది. ఎన్డీయే కూటమి భాగస్వామి పార్టీ అయిన టీడీపీ రెబల్ అభ్యర్థులుగా కొందరు అసంతృప్త నేతలు, పార్టీకి దూరంగా ఉన్న వారు... స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్

- మిగతా 2 లో

# సర్వం సిద్ధం

- మొదటి దశ పోలింగ్ నేడే
- భారీ భద్రతా ఏర్పాట్లు
- అందుబాటులో హెలికాప్టర్లు: ఈసీ

6లో

సార్వత్రిక ఎన్నికల తొలిదశ పోలింగ్ శుక్రవారం ప్రారంభం కానుంది. అందుకు కేంద్ర ఎన్నికల సంఘం సర్వం సిద్ధం చేసినట్లు ప్రకటించింది. ఈ తొలి దశ పోలింగ్‌లో 16.63 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారని తెలిపింది.

## ఇదీ లోకం!

మిమ్మల్ని ఎక్కడో చూసినట్లుందే!

# ఎన్నికలు నిష్పక్షపాతంగా జరగాలి

- ఏం చర్యలు తీసుకోవచ్చో వివరించండి
- ఈసీని ఆదేశించిన సుప్రీంకోర్టు
- వీవీప్యాట్‌ల లెక్కింపు అంశంపై ఈసీతో సుదీర్ఘ వాదనలు
- ఓటర్లు వీవీప్యాట్ స్లిప్‌లు పొందవచ్చా? అని ప్రశ్న
- ఓటు గోప్యతకు భంగం కలుగుతుందన్న ఈసీ
- తీర్పు రిజర్వుచేసిన అత్యున్నత న్యాయస్థానం

న్యూదిల్లీ: దేశంలో సార్వత్రిక ఎన్నికలవేళ సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఎన్నికల ప్రక్రియలో స్వచ్ఛత ఉండాలని కేంద్ర ఎన్నికల సంఘాని (ఈసీ)కి సూచించింది. దేశంలో ఎన్నికలు సజావుగా, నిష్పక్షపాతంగా జరిగేలా అనుసరిం చాల్సిన చర్యలను వివరించాలని ఈసీని ఆదేశించింది. 'ఇది ఎన్నికల ప్రక్రియ. పవిత్రంగా ఉండాలి. ఓటర్లు ఆశించినది జరగడం లేదని ఎవరూ భయాందోళన చెందకుండా చూసుకోవాలి' అని న్యాయమూర్తులు సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. ఓట్ల లెక్కింపు సమయంలో

- మిగతా 2 లో

# విశాఖ స్టీల్‌ప్లాంట్ మూసివేతకు కుట్ర

- సీఎండీ వల్లే కోకింగ్ కోల్ కొరత
- బకాయిల కోసం విద్యుత్‌శాఖ నోటీసులు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: విశాఖ ఉక్కు పరిశ్రమ మూసివేతకు మోదీ సర్కారు కంకణం కట్టుకున్నట్లు స్పష్టమవుతోంది. ఓ పక్క బొగ్గు సరఫరా లేదు. అదానీ గంగవరం పోర్టు కార్మికుల ఆందోళనతో బొగ్గు అందుబాటులో లేదు. ఆ కార్మికుల సమస్యను పోర్టు యాజమాన్యం పట్టించుకోవడం లేదు. మరోవైపు మూలిగేనక్కపై తాటికాయ పడినట్లు విద్యుత్ బకాయిలు చెల్లించాలని విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు విద్యుత్ శాఖ నోటీసులు పంపింది. ఇది మరింత ఆందోళనకరంగా మారింది. బొగ్గు లేక కొట్టుమిట్టాడుతున్న స్టీల్‌ప్లాంట్‌కు విద్యుత్ బకాయిలు మరింత భారంగా మారాయి. దాదాపు రూ.100 కోట్ల బకాయి తక్షణమే చెల్లించకపోతే శుక్రవారం నుండి విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని విద్యుత్ శాఖ అధికారులు నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలుగజేసుకోకుండా ఎన్నికల సమయంలో స్టీల్‌ప్లాంట్ మూతకు కుట్ర చేస్తున్నట్లు అర్థమవుతోంది.

గంగవరం పోర్టు కార్మికులు, విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికుల మధ్య చిచ్చుపెట్టి స్టీల్‌ప్లాంట్‌ను మూసివేయాలని అదానీ కుట్ర పన్నినట్లు ప్రచారం జరుగుతోంది. జిల్లా అధికారులు కూడా జోక్యం చేసుకోవడం లేదు. గంగవరం పోర్టు కార్మికుల ఆందోళనపై ఉక్కుపాదం మోపుతున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి ప్రారంభించిన గత 33 ఏళ్లలో ఎన్నడూలేని విధంగా ప్లాంట్‌లోని మొదటి విభాగం కోక్‌ఓవెన్‌కు అవసరమైన కోకింగ్ కోల్ కొరతను స్వయానా యాజమాన్యం సృష్టించింది. దీనికి బాధ్యులైన విశాఖ స్టీల్‌ప్లాంట్ సీఎండీని వెంటనే తొలగించాలని కార్మికసంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఈనెల 21వ తేదీ ఆదివారం స్టీల్‌ప్లాంట్ వద్ద జరిపే కార్మిక గర్జనను విజయవంతం చేయాలని ఉక్కు ఉద్యోగులకు

- మిగతా 2 లో

# ఇండోనేసియాలో పేలిన అగ్నిపర్వతం

### సునామీ హెచ్చరికలు జారీ

### 11 వేలమంది సురక్షిత ప్రాంతాలకు తరలింపు

**జకర్తా:** ఇండోనేసియాలో అగ్నిపర్వతం బద్ధలైంది సులవేసి ద్వీపానికి ఉత్తరం వైపున ఉన్న స్టాటోవోల్కానో మౌంట్ రువాంగ్ అగ్నిపర్వతం విస్ఫోటనం చెందింది. మంగళవారం రాత్రి నుంచి 24 గంటల వ్యవధిలోనే సుమారు 5 సార్లు విస్ఫోటనం చెందినట్లు ఆ దేశ భౌగోళిక సంస్థ తెలిపింది. దీంతో కిలోమీటర్ల మేర లావా ఏరులై పారుతున్నట్లు వెల్లడించింది. ఈ నేపథ్యంలో అక్కడ సునామీ హెచ్చరికలు జారీ చేసింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. అగ్నిపర్వతం నుంచి విరజిమ్ముతున్న పొగ, బూడిద సమీప ప్రాంతాలను కమ్మేసినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. లావా పెద్ద ఎత్తున సమీప ప్రాంతాలకు చేరుతుండటంతో అధికారులు రెడ్ అలర్ట్ జారీ చేశారు. 725 మీటర్ల (2,378 అడుగులు) రువాంగ్ అగ్నిపర్వతం నుంచి సుమారు 6 కిలోమీటర్ల (3.7 మైళ్లు) మేర దూరంగా ఉండాల్సిందిగా స్థానికులను అధికారులు కోరారు. మరోవైపు విస్ఫోటనం చెందిన అగ్నిపర్వతంలోని కొంత భాగం సముద్రంలోకి కూలిపోయి సునామీ వచ్చే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు స్థానికులకు పలు సూచనలు చేశారు. వెంటనే ఆ ప్రాంతాన్ని విడిచి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని హెచ్చరించారు. మరోవైపు ఆ ప్రాంతంలోని దాదాపు 11 వేల మంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. వారందరినీ సులవేసి ద్వీపంలోని మనాడోకు సమీప నగరానికి పడవల ద్వారా పంపుతున్నారు. కాగా, ఇండోనేసియాలో అగ్నిపర్వతాల విస్ఫోటనాలు సర్వసాధారణమే. 2018లో అనక్ క్రకటౌ అగ్నిపర్వతం విస్ఫోటనం చెందడం వల్ల సుమత్రా, జావా తీరాల వెంబడి సునామీ వచ్చింది. అగ్నిపర్వతంలోని భాగాలు సముద్రంలోపడిపోయాయి. ఈ ఘటనలో సుమారు 500 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు.

# 'తోషిబా'లో 5 వేల మంది తొలగింపునకు రంగం సిద్ధం

**టోక్యో:** ప్రపంచ వ్యాప్తంగా అనేక ప్రైవేటు సంస్థల్లో సిబ్బంది తొలగింపుల పర్వం కొనసాగుతోంది. ఆర్థిక మాంద్యం భయాందోళనల కారణంగా ఖర్చు తగ్గింపులో భాగంగా వివిధ సంస్థలు ఎడాపెడా ఉద్యోగులను తొలగించేస్తున్నాయి. తాజాగా జపాన్‌కు చెందిన అతిపెద్ద ఎలక్ట్రానిక్స్ సంస్థ తోషిబా తాజాగా ఉద్యోగుల తొలగింపునకు సిద్ధమైంది. సుమారు 5,000 మందికి తొలగించాలని యోచిస్తున్నట్లు నిక్కీ నివేదించింది. ఇది సంస్థలోని మొత్తం ఉద్యోగుల్లో పది శాతానికి సమానం. టోక్యోకు చెందిన ఈ సంస్థ నాన్‌కోర్ వ్యాపారాలను తగ్గించడం ద్వారా తన కార్యకలాపాలను క్రమబద్ధీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు నిక్కీ నివేదించింది. కాగా, జపాన్‌లో ఉద్యోగుల తొలగింపులు చాలా అరుదు. కానీ, ఈ మధ్య కాలంలో వివిధ సంస్థలు పెద్ద ఎత్తున ఉద్యోగులను తొలగించాయి.

# తాగునీటికి సాగర్ జలాలు

### కేఆర్ఎంబీ ఉత్తర్వులు జారీ

**విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వేసవి తాగునీటి అవసరాల కోసం కృష్ణానది యాజమాన్య బోర్డు నీటి విడుదల ఉత్తర్వులు జారీ చేసింది. ఏప్రిల్ 12న హైదరాబాద్‌లో జరిగిన త్రిసభ్య కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా బోర్డు ఉత్తర్వులు ఇచ్చింది. నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకొని నాగార్జునసాగర్‌లో 500 అడుగుల వరకు నీటిని వినియోగించుకోవాలని సమావేశంలో నిర్ణయించారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టులో 14.195 టీఎంసీల వరకు నీటి లభ్యత ఉంది. అందులో ఏపీకి 5.5 టీఎంసీలు కేటాయించారు. మిగిలిన 8.5 టీఎంసీలకు పైగా ఉన్న నీటిని హైదరాబాద్ సహా ఇతర జిల్లాల తాగునీటి అవసరాల కోసం వినియోగానికి తెలంగాణకు అనుమతిచ్చారు.

నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకొని పూర్తిగా తాగునీటి అవసరాల కోసమే ఈ నీటిని వినియోగించుకోవాలని కేఆర్ఎంబీ స్పష్టం చేసింది. మంచినీటి చెరువులన్నీ నింపాలని, నీటి దుర్వినియోగం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించింది.

# ఎన్డీయే కూటమికి రెబల్స్ బెడద!

(మొదటిపేజీ తరువాయి)

వేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. తొలి రోజు ఏలూరు జిల్లా నూజివీడు అసెంబ్లీకి స్వతంత్ర అభ్యర్థిగా ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అక్కడి సబ్ కలెక్టరేట్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. అనంతపురం జిల్లా రాప్తాడు నియోజకవర్గం నుంచి టీడీపీ నేత, ప్రొఫెసర్ రాజేశ్ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలోనూ కొందరు అసంతృప్త టీడీపీ నేతలు స్వతంత్ర అభ్యర్థులుగా బరిలోకి దిగేందుకు ప్రయత్నిస్తున్నారు. ఎన్డీయే కూటమి తరపున టీడీపీ బీజేపీ, జనసేన ఉమ్మడిగా పోటీ చేస్తున్నాయి. దీంతో సీట్ల సర్దుబాటు దగ్గర చాలామంది టీడీపీ, జనసేన నేతలకు టికెట్లు దక్కలేదు. ఇప్పటికే చాలామంది జనసేన నేతలు వైసీపీలో చేరారు. టీడీపీ నుంచి కూడా చివరి దశ వరకు టికెట్టు వస్తుందని ఆశించి ఆ పార్టీ నేతల భంగపాటుకు గురయ్యారు. దీంతో వారిలో కొందరు వైసీపీని ఆశ్రయించగా, మరికొందరు స్వతంత్రులుగా పోటీ చేసేందుకు సిద్ధమయ్యారు. రాప్తాడులో టీడీపీ టికెట్ ను ప్రొఫెసర్ రాజేశ్ ఆశించగా, అధిష్టానం మాజీ మంత్రి పరిటాల సునీతకు టికెట్‌ను ఖరారు చేసింది. దీంతో రాజేశ్ అసంతృప్తికి గురై స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు.

నూజివీడుకు చెందిన ముద్దరబోయిన చాలాకాలం నుంచి టీడీపీలో కొనసాగుతున్నారు. ఈ ఎన్నికల్లో ఆయనకు టికెట్ ఇవ్వకుండా, వైసీపీ నుంచి వలస వచ్చిన ఎమ్మెల్యే కొలుసు పార్థసారథికి నూజివీడు టికెట్ ఖరారు చేశారు. దీంతో ముద్దరబోయిన అసంతృప్తికి గురై టీడీపీకి దూరంగా ఉన్నారు. ఒకానొక దశలో ఆయన వైసీపీలో చేరేందుకు ప్రయత్నించినప్పటికీ, అక్కడ టికెట్‌పై స్పష్టత రాకపోవడంతో వెనక్కి తగ్గారు. ఇక చేసేదేమీ లేక స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగేందుకు నిర్ణయించుకున్నారు. దీంతో ఆయన నూజివీడు అసెంబ్లీ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేయడం టీడీపీకి పెద్ద షాక్ గా మారింది. బీసీ యాదవ సామాజిక వర్గానికి చెందిన ముద్రబోయిన స్వతంత్ర అభ్యర్థిగా వేయడంతో, టీడీపీ ఓట్లకు గండి పడే అవకాశముంది. గతంలో గన్నవరం నియోజవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా ముద్దరబోయిన వెంకటేశ్వరరావు గెలుపొందిన అనుభవముంది. దాని స్ఫూర్తితోనే అనుచరులు ఆయనను స్వతంత్ర అభ్యర్థిగా పోటీలోకి దించారు. రాబోయే రోజుల్లో కృష్ణాజిల్లా పెడన నియోజవర్గం నుంచి టీడీపీ టికెట్ దక్కని బూరగడ్డ వేదవ్యాస్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసేందుకు ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. అరకు, పోలవరం తదితర నియోజవర్గాల నుంచి కూడా టీడీపీ టికెట్లు దక్కని వారంతా రెబల్ అభ్యర్థులుగా నామినేషన్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. భీమవరం జిల్లా ఉండి నియోజకవర్గంలోను ఇదే పరిస్థితి ఏర్పడింది. ఈ పరిణామాలతో ఎన్డీయే కూటమి భాగస్వామ్య పార్టీల్లో ఆందోళన నెలకొంది.

# భానుడి భగభగ

(మొదటిపేజీ తరువాయి)

శిశువుల సంరక్షణ క్లిష్టంగా మారింది. ప్రభుత్వ ఆసుపత్రి జనరల్ వార్డులో రోగుల పరిస్థితి దయనీయంగా ఉంది. బీపీ, సుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారు నోరు తడారి పోవటంతో ఎక్కువ ఇబ్బందులు పడుతున్నారు. ఏప్రిల్‌లోనే ఎండల తీవ్రత ఇంతలా ఉంటే మేలో పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళన చెందున్నారు. ఎండల కారణంగా మజ్జిగ, చెరుకు రసం, పండ్ల రసాలు, , కొబ్బరి బొండాలు, ఐస్‌క్రీమ్‌లు, ఇతర శీతల పానియాలకు గిరాకీ పెరిగింది. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన వేడిగాలి సాయంత్రం 6 గంటల వరకు కొనసాగింది. ఆరు గంటల తరువాత పిల్లల్ని బయటకు తీసుకువచ్చి సోడాలతో ముఖం కడిగి, శీతల పానీయాలు తాగిస్తున్నారు. ఎండలకు అన్ని వ్యాపారాలు అంతంతమాత్రంగానే నడుస్తున్నారు. ఎండలకు కూరలు పాడైపోతాయని తక్కువ మొత్తంలో తయారు చేస్తున్న కారణంగా కర్రీపాయింట్‌లు మధ్యాహ్నం ఒంటి గంటకే మూసేస్తున్నారు. కోడిగుడ్లు, పాలు, ఇంధనాలు రవాణా చేసే వాహనాలు మధ్యాహ్నం వేళ రోడ్లపైకి రావడంలేదు. గ్రామీణ ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు ఎండకి తట్టుకోలేకపోతున్నారు. కంపెనీల్లో మధ్యాహ్నం షిఫ్టుల్లో విధులకు వెళ్లే కార్మికులు నానా అవస్థలు పడుతున్నారు. ఎండ వేడిమితో అధిక విద్యుత్ వినియోగం కారణంగా షార్ట్‌సర్క్యూట్ ఏర్పడి తరుచు అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయి. ఇళ్లల్లో ఏసీలు వేసుకున్న వారు విద్యుత్ లోడ్ పెరిగి తరచూ ట్రిప్ కావటంతో ఇబ్బందులు పడుతున్నారు. ఎండల కారణంగా ఏదైనా అనారోగ్యం సంభవిస్తే తాత్కాలిక ఉపశమం కోసం చిట్కాలు పాటించినా... వైద్యుల సలహామేరకు నడుచుకుంటే మంచిదని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. కాగా ఎన్నికల ప్రచారంపై ఎండల ప్రభావం అధికంగా ఉంది. ఉదయం 7 గంటలకు ప్రారంభించి పది గంటలకు ప్రచారం ముగిస్తున్నారు. ప్రచారంలో పాల్గొంటున్న కార్యకర్తలు ఎక్కడ నీడ కనబడితే అక్కడ కాసేపు ఆగుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళ్లల్లో అభ్యర్థులు ప్రచారం చేస్తున్నప్పటికీ ఇళ్లల్లో పనులు చేసుకునే సమయం, తాగునీరు సరఫరా అయ్యే సమయం కావటంతో ప్రజలు అభ్యర్థులకు ముక్తసరిగా సమాధానం ఇస్తున్నారు. టీవీగా ఖద్దరు దుస్తులు ధరించి ప్రచారంలో పాల్గొంటున్న నాయకులు ఎండలో చెమటోడ్చాల్సి వస్తోంది. రోడ్లపైకొచ్చిన కొద్దిసేపటికే ఎండ వేడికి వీరి రూపురేఖలు మారిపోతున్నాయి.

# నామినేషన్ల కోలాహలం

(మొదటిపేజీ తరువాయి)

నియోజకవర్గానికి టీడీపీ అభ్యర్థిగా మాజీమంత్రి గంటా శ్రీనివాసరావు నామినేషన్ దాఖలు చేశారు. నరసనరావుపేట టీడీపీ ఎంపీ అభ్యర్థిగా లావు శ్రీకృష్ణదేవరాయులు...ఇలా రాష్ట్రవ్యాప్తంగా ఆయా నియోజకవర్గాల్లో వివిధ రాజకీయపార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు మొత్తం 43 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# విశాఖ స్టీల్‌ప్లాంట్ మూసివేతకు కుట్ర

(మొదటిపేజీ తరువాయి)

పిలుపునిచ్చారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కోక్‌ఓవెన్ డిపార్ట్‌మెంట్ జీవనాడి వంటిది. స్టీల్‌ప్లాంట్ బ్యాటరీల నుండి ఉత్పత్తి అయ్యే కోక్ ద్వారా స్టీల్ ఉత్పత్తి అవుతుంది. కోక్‌ఓవెన్ నుండి ఉత్పత్తి అయ్యే గ్యాస్ ద్వారా విశాఖ స్టీల్‌ప్లాంట్ అంతా నడుస్తుంది. కోక్ ఓవెన్‌లో ముడిసరుకు అయిన కోకింగ్ కోల్‌ను విదేశాల నుండి దిగుమతి చేసుకుంటారు. ఆ విధంగా దిగుమతి అయిన 30 వేల టన్నుల కోకింగ్‌కోల్ గంగవరం స్టాక్ యార్డ్‌లో ఉంది. ఆస్ట్రేలియా నుంచి 2 షిప్‌లలో వచ్చిన 1.5 లక్షల టన్నుల కోకింగ్ కోల్ గంగవరం పోర్టులో ఉంది. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు, గంగవరం పోర్టుకు మధ్య గోడే అడ్డు. గంగవరం పోర్టులో ఉన్న కోకింగ్ కోల్‌ను విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ఎందుకు రప్పించలేకపోయారు? దీనికి బాధ్యత యాజమాన్యం వహించాలి. సకాలంలో ముడిఖనిజం తెప్పించలేని అసమర్ధ సీఎండీని తొలగించాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. గత ఆరు రోజుల్లో కోక్‌ఓవెన్ ఉత్పత్తి 320 పుస్సింగ్‌ల నుంచి నేటికి 140 పుస్సింగ్‌లకు పడిపోయింది. మొత్తం స్టీల్‌ప్లాంట్‌లో ఐదు బ్యాటరీల్లో 1,3 బ్యాటరీలు కోకింగ్ కోల్ లేనందువల్ల ఉత్పతి నిలిపివేశాయి. దీని ప్రభావంతో ప్లాంట్ ఉత్పత్తి 80 శాతం పడిపోతుంది. అన్నింటికంటే విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో కోక్‌ఓవెన్ విభాగం కోమాలోకి వెళ్లింది. ఈ విభాగాల మరమ్మతుకు కనీసం 60 రోజులకు పైగా పడుతుంది. ఈ కాలంలో ఉత్పత్తి పూర్తిగా పడిపోతుంది. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను పూర్తిగా దెబ్బతియ్యడానికి మోదీ ప్రభుత్వం, గంగవరం పోర్టు యాజమాన్యం కలిసి చేసిన కుట్ర అని కార్మిక సంఘాల నేతలు మండిపడుతున్నారు.

అదానీ యాజమాన్యం ఉద్దేశపూర్వకంగానే గంగవరం పోర్టు కార్మికులకు సమస్యలు సృష్టించింది. నిర్వాసితులతో 2006లో జరిగిన ఒప్పందం ప్రకారం కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలి. కానీ 15 ఏళ్లు దాటినా గంగవరం దిబ్బపాలెం నిర్వాసితులను పట్టించుకోలేదు. గంగవరం పోర్టులో బెర్త్‌ల వద్ద పనిచేసే 15 మంది కంపెనీ ఆపరేటర్లకు నెలకు లక్ష రూపాయల జీతం చెల్లిస్తున్నారు. 200 మంది స్టాక్‌యార్డ్‌లో అదే పనిచేస్తున్న స్థానిక ఆపరేటర్లకు నెలకు రూ.15 వేలు మాత్రమే ఇస్తున్నారు. సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. గంగవరం పోర్టు కార్మికులు ఇప్పటి వరకు రోజుకు 8 గంటలు పనిచేస్తున్నారు. వారిని రోజుకు 12 గంటలు పనిచేయించాలని పోర్టు యాజమన్యాం కుట్ర పన్నుతోంది. ఇప్పటికే రైల్వే, వేయింగ్ డిపార్ట్‌మెంట్‌లలో రోజుకు 12 గంటల పని ప్రవేశపెట్టింది. గంగవరం యాజమాన్యం కావాలనే సమస్యలు సృష్టించి పోర్టులోని ముడిఖనిజం స్టీల్‌ప్లాంట్‌కు రాకుండా అడ్డుకుంటున్నదని కార్మికసంఘాల నేతలు మండిపడుతున్నారు. గంగవరం పోర్టు యాజమాన్యం చిత్తశుద్ధితో సమస్య పరిష్కరించాలనుకుంటే...ఒక్క రోజులో కార్మికుల సమస్యలు పరిష్కారమవుతాయని అంటున్నారు. యాజమాన్యాల నిర్లక్ష్య వైఖరికి నిరసగా ఈ నెల 21న జరిగే కార్మిక గర్జనకు మద్దతివ్వాలని కోరారు.

# ఎన్నికలు నిష్పక్షపాతంగా జరగాలి

(మొదటిపేజీ తరువాయి)

ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (ఈవీఎం)లో పోలైన ఓట్లతోపాటు వీవీప్యాట్ సిస్టమ్ ద్వారా వచ్చే పేపర్ స్లిప్‌లను కూడా లెక్కించి సరిపోల్చాలంటూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు గురువారం విచారణ జరిపింది. ఈసీ తరపున సీనియర్ న్యాయవాది మణిందర్‌సింగ్, ఎన్నిక సంఘం అధికారులు కోర్టుకు హాజరయ్యారు. పిటిషనర్లలో ఒకరి తరపున అడ్వకేట్ నిజాంపాషా మాట్లాడుతూ... ఓటరు ఓటు వేసిన తర్వాత వీవీప్యాట్ స్లిప్‌ను తీసుకొని బ్యాలెట్ బాక్స్‌లో జమచేయడానికి అనుమతించాలని కోరారు. అయితే అలాంటి ప్రక్రియ ఓటరు గోప్యతను ప్రభావితం చేయదా అని జస్టిస్ ఖన్నా ప్రశ్నించారు. ఇది ఓటనే గోప్యతను, ఓటరు హక్కులకు భంగం కలిగించదని పాషా బదులిచ్చారు. పిటిషనర్ల తరపు సీనియర్ న్యాయవాది సంజయ్ హెగ్డే మాట్లాడుతూ... లెక్కింపు ప్రక్రియకు ఎక్కువ విశ్వసనీయతను జోడించడానికి ప్రత్యేక ఆడిట్ ఉండాలని అన్నారు. మరో పిటిషనర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ మాట్లాడుతూ.. ఈవీఎం లోని లైట్ ఎల్లప్పుడూ ఆన్‌లో ఉండాలని కోరారు. ప్రస్తుతం ఈ లైట్ ఏడు సెకన్ల పాటు ఆన్‌లో ఉంటుందని తెలిపారు. ఈ సమయంలో ఒకవేళ పేపర్ స్లిప్ అందించడం వీలు కాకపోతే కనీసం ఎల్లవేళలా లైట్ వెలుగుతూనే ఉండేలా చూడాలని కోరారు. దీనివల్ల ఓటర్ స్లిప్ కటింగ్, బాక్స్‌లో పడిపోవడం ఓటు వేసినవారు చూడగలుగుతారని చెప్పారు. ఇది వారి గోప్యతకు అడ్డు రాదని వివరించారు. ఈ సందర్భంగా ఇటీవల కేరళలో జరిగిన మాక్ పోల్ గురించి కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. కాసర్‌గోడ్‌లో జరిగిన మాక్ ఓటింగ్‌లో బీజేపీకి అదనంగా ఓట్లు వచ్చాయని కోర్టుకు తెలిపారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ ఈ వ్యవహారాన్ని పరిశీలించాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. అనంతరం ఆ నివేదిక పూర్తి అవాస్తవమని ఈసీ వెల్లడించింది. ఈవీఎం కంట్రోల్ యూనిట్ దాని పేపర్ స్లిప్‌ను ప్రింట్ చేసేలా వీవీ ప్యాట్ యూనిట్‌కు ఆదేశం పంపుతుందని తెలిపింది. ఈ స్లిప్ సీల్డ్ బాక్స్‌లో పడే ముందు ఓటరుకు ఏడు సెకన్ల పాటు కనిపిస్తుందని ఈసీ తరపు సీనియర్ న్యాయవాది మణీందర్‌సింగ్ చెప్పారు. ఇంజినీర్ల సమక్షంలో పోలింగ్‌కు ముందు యంత్రాలను తనిఖీ చేస్తారన్నారు. పారదర్శక ఓటింగ్ నిర్వహణ కోసం ఎలాంటి విధానాలను పాటిస్తున్నారని ఈసీని ధర్మాసనం ప్రశ్నించింది. దీంతో ఎన్నికల సంఘం తమ ప్రక్రియను న్యాయస్థానానికి వివరించింది. వీవీప్యాట్ ప్రింటర్‌లో ఏదైనా సాఫ్ట్‌వేర్ ఉందా అని కోర్టు ప్రశ్నించగా, ఈసీ ప్రతికూలంగా సమాధానం ఇచ్చింది. 'ప్రతి ప్యాట్‌లో చిహ్నాలను నిల్వ చేసే 4 మెగాబైట్ ఫ్లాష్ మెమరీ ఉంది. రిటర్నింగ్ అధికారి ఎలక్ట్రానిక్ బ్యాలెట్‌ను సిద్ధం చేస్తారు. దీంతో గుర్తు లోడింగ్ యూనిట్‌లోకి లోడ్ చేయబడుతుంది. ఇది క్రమ సంఖ్య, అభ్యర్థి పేరు, గుర్తును ఇస్తుంది. ఏదీ ముందుగా లోడ్ చేయబడలేదు. ఇది డేటా కాదు, ఇది ఇమేజ్ ఫార్మాట్' అని ఈసీ పేర్కొంది. పోలింగ్ కోసం ఎన్ని సింబల్ లోడింగ్ యూనిట్‌లు క్రియేట్ చేస్తారని కోర్టు ప్రశ్నించగా... ఓ ఈసీ అధికారి స్పందిస్తూ... 'సాధారణంగా ఒక నియోజకవర్గంలో ఒకటి ఉంటుంది. అది పోలింగ్ ముగిసే వరకు రిటర్నింగ్ అధికారి కస్టడీలో ఉంటుంది' అని బదులిచ్చారు. ఎలాంటి అవకతవకలు జరగకుండా చూసేందుకు ఈ యూనిట్‌ను సీల్ చేశారా అని కోర్టు ప్రశ్నించగా... ప్రస్తుతం అలాంటి ప్రక్రియ ఏదీ అమలులో లేదని ఎన్నికల సంఘం బదులిచ్చింది. అన్ని ఓటింగ్ యంత్రాలు మాక్ పోల్ ప్రక్రియ ద్వారానే ఓటింగ్‌కు వెళతాయని ఈసీ కోర్టుకు తెలిపింది. 'అభ్యర్థులు ర్యాండమ్‌గా 5 శాతం యంత్రాలను తీయడానికి అనుమతించబడతారు. పోలింగ్ రోజున ప్రక్రియ పునరావృతమవుతుంది. వీవీప్యాట్ స్లిప్‌లను తీసి లెక్కించి సరిపోల్చుతారు. అన్ని యంత్రాలకు వివిధ రకాల పేపర్ సీల్స్ ఉంటాయి. ఒక యంత్రం కౌంటింగ్ కోసం వచ్చిన సమయంలో, సీల్ నంబర్ తనిఖీ చేయవచ్చు' అని ఒక అధికారి తెలిపారు. ఓటరు తన ఓటు వేయబడిందో లేదో ఎలా తనిఖీ చేయవచ్చు అని కోర్టు ప్రశ్నించగా... ఎన్నికల సంఘం దీని కోసం ప్రదర్శనలు, అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోందని ఆయన బదులిచ్చారు. ఓటింగ్ యంత్రాలను యాదృచ్ఛికంగానే నియోజకవర్గాలకు కేటాయిస్తున్నట్లు ఎన్నికల సంఘం తెలిపింది. ఏ నకిలీ యూనిట్ (వాటికి) కనెక్ట్ చేయబడవని స్పష్టం చేశారు. ఈవీఎంలు యంత్రాలు కచ్చితత్వంతో పనిచేస్తాయని, ప్రోగ్రామ్‌ను మార్చలేమని ఎన్నికల సంఘం కోర్టుకు తెలిపింది. ఈవీఎంలను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తాళం వేసి ఉన్న స్ట్రాంగ్‌రూమ్‌లలో ఉంచుతారని, పోలింగ్ ముగియగానే ఈవీఎంలను అభ్యర్థుల సమక్షంలో సీల్ చేసి స్ట్రాంగ్ రూమ్‌లకు తీసుకెళ్తామని ఎన్నికల సంఘం తెలిపింది. కౌంటింగ్ రోజు అభ్యర్థుల సమక్షంలో స్ట్రాంగ్‌రూమ్‌లు తెరుస్తారని వెల్లడించింది. ఓటు వేసిన తర్వాత ఓటరు స్లిప్ పొందడం సాధ్యమేనా అని కోర్టు ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించగా... ఇది ఓటు గోప్యతకు భంగం కలిగిస్తుందని, బూత్ వెలుపల దుర్వినియోగం చేయబడవచ్చని ఈసీ సమాధానం ఇచ్చింది. ఇది ఇతరులు ఎలా ఉపయోగించవచ్చో మనం చెప్పలేమని పేర్కొంది. వీవీప్యాట్ పేపర్ స్లిప్పుల లెక్కింపునకు ఎక్కువ సమయం ఎందుకు పడుతుందని, మెషిన్‌లను ఉపయోగించవచ్చా అని కోర్టు ప్రశ్నించగా... పేపర్ సన్నగా, జిగటగా ఉంటుందని... నిజానికి అది లెక్కింపు కోసం ఉన్నది కాదని ఈసీ తెలిపింది. అయితే 'మీరు మాకు చెబుతున్న దానికి, పబ్లిక్ డొమైన్‌లో అందుబాటులో ఉన్న అంశాల మధ్య కొంత వ్యత్యాసం ఉన్నట్లు కనిపిస్తోంది. దానిని తగ్గించాల్సిన అవసరం ఉంది' అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించగా... తమవద్ద దాచడానికి ఏమీలేదంటూ ఈసీ అధికారి బదులిచ్చారు. 'ఓటరు విశ్వాసాన్ని మీరు కాపాడాలి. మొత్తం యంత్రాంగం సమగ్రతను మేము ఎలా నిర్ధారిస్తాము?' అని కోర్టు ప్రశ్నించింది. దీనికి 'మేము తరచుగా ప్రజలు అడిగే ప్రశ్నలపై సమాచారం తాజాపరుస్తామని ఈసీ బదులిచ్చింది. కాగా బ్యాలెట్ పేపర్ ఓటింగ్ విధానానికి తిరిగి రావాలన్న పిటిషనర్ల అభ్యర్థన 'తిరోగమన సూచన' అని ఎన్నికల కమిషన్ తరపు న్యాయవాది పేర్కొన్నారు. ఈసీ వాదన విన్న తర్వాత సుప్రీంకోర్టు పిటిషనర్లకు సూచనలు చేసింది. 'మీరు సాంకేతిక అంశాలను అర్థం చేసుకోవలసిన అవసరం లేదు. ఎన్నికల సంఘం ఇచ్చిన వివరణతో ఓటరు సంతృప్తి చెందాలి. అధికారిక చర్యలు సాధారణంగా చెల్లుబాటు అయ్యేవిగా భావించబడతాయని సాక్ష్యాధారాల చట్టం కూడా చెబుతోంది' అని వ్యాఖ్యానించింది. చాలా అభివృద్ధి చెందిన దేశాలు ఈవీఎంల ద్వారా ఓటింగ్ విడిచిపెట్టాయని పిటిషనర్ తరపు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ఎత్తిచూపగా... 'విదేశాలు భారత్ కంటే ముందున్నాయని అనుకోవద్దు' అని సుప్రీంకోర్టు పేర్కొంది. 'ఇప్పుడు మీరు చాలా దూరం వెళ్తున్నారు. ప్రతిదానిని అనుమానించలేరు. దయచేసి వారు ఏదైనా మంచి చేసి ఉంటే అభినందించండి. మేము కూడా ఆందోళన చెందుతున్నాము కాబట్టి మేము మీ మాటలు విన్నాము' అని ధర్మాసనం పేర్కొంది. ఇరుపక్షాల వాదనలు విన్న తర్వాత కోర్టు తీర్పును రిజర్వు చేసింది.

# మీరే దాడి చేసి మాపై ఆరోపణలా?

### బీజేపీ నేతలపై మమత ఆగ్రహం



**కోల్‌కతా:** ముర్షిదాబాద్ ఘటన ముందస్తు ప్రణాళికతో జరిగిందని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మండిపడ్డారు. ఈ ఘటనకు బీజేపీ నేతలే కారణమని ఆరోపించారు. రాయ్‌గంజ్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆమె సంచలన ఆరోపణలు చేశారు. రామనవమి ఊరేగింపుపై బీజేపీ నేతలే దాడి చేశారని అన్నారు.

ఆయుధాలతో రామనవమి ఊరేగింపు చేసే అనుమతి ఎవరిచ్చారని నిలదీశారు. ఈ ఘటనలో 19 మంది గాయపడ్డారన్నారు. ఘటనకు ముందురోజే ముర్షిదాబాద్ డీఐజీను ఎందుకు తొలగించారని ప్రశ్నించారు. ఆయన స్థానంలో కమిషన్ జాయింట్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న సయ్యద్ వకార్ రజాను నియమించారని వివరించారు. బీజేపీ హింసను ప్రేరేపించిందని సీఎం మమతా బెనర్జీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "రామనవమి సందర్భంగా జరిగిన దాడి అందరికీ తెలిసిందే. ఈ ఘటనలో పోలీసులకూ గాయాలయ్యాయి. ఒక మతానికి చెందిన వ్యక్తులపై దాడి జరిగింది. కానీ టీఎంసీనే హింసకు పాల్పడిందని బీజేపీ ఆరోపించింది." అని మమతా బెనర్జీ చెప్పుకొచ్చారు. బీజేపీ పశ్చిమ బెంగాల్ రాష్ట్ర అధ్యక్షుడు సుకాంత్ మజుందార్... రామనవమి ఊరేగింపుపై టీఎంసీ వ్యక్తులు దాడి చేశారని ఆరోపించారు. ప్రజలను రెచ్చగొట్టేందుకు సీఎం మమతా బెనర్జీ ప్రయత్నించారని నిప్పులు చెరిగారు. దీనిపై ఎన్ఐఏ దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు.

ముర్షిదాబాద్ జిల్లాలో రామ నవమి ఊరేగింపుపై జరిగిన దాడిలో నలుగురికి గాయాలయ్యాయి. శక్తిపూర్ రామ్ నవమి ఉత్సవ్ కమిటీ నిర్వహించిన ఊరేగింపు ముర్షిదాబాద్‌లోని శక్తిపూర్ హైస్కూల్ వద్ద నుంచి వెళ్తున్న సమయంలో దాడి జరిగింది. ఆందోళనకారులు రాళ్లు రువ్వినట్లు బాధితులు తెలిపారు. ఈ ఘటనపై బెంగాల్ వ్యాప్తంగా ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. సీఎం మమత అండతో హిందువులపై దాడులు జరుగుతున్నాయని మండిపడుతున్నారు.

### ఐపీఎల్ టికెట్ల కుంభకోణంపై

# విచారణ జరపండి

### ఏఐవైఎఫ్ డిమాండ్

**విశాలాంధ్ర-హైదరాబాద్:** ఐపీఎల్ టికెట్ల విక్రయాల్లో జరుగుతున్న కుంభకోణాలపై ప్రభుత్వం విచారణ జరిపి, దోషులపై చర్యలు తీసుకోవాలని, హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అవినీతి, అక్రమాలపై ఉన్నత స్థాయి కమిటీవేసి విచారణ జరపాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కె.ధర్మేంద్ర డిమాండ్ చేశారు. హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో జరిగిన రెండు ఐపీఎల్ మ్యాచ్‌లకు టికెట్లు లభించని క్రికెట్ ప్రేమికులు చాలా నిరాశకు గురయ్యారన్నారు. హెచ్‌సీఏ, సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్‌ఓ) నిర్వాహకులు, టికెటింగ్ ఏజెన్సీ... పేటీఎం అమ్మకాలు, పంపిణీలో పారదర్శకత పాటించలేదని ఆరోపించారు. ఉప్పల్ స్టేడియంలో ఈ నెల 25న సన్‌రైజర్స్ హైదరాబాద్-రాయల్ ఛాలెంజర్స్ జట్ల మధ్య ఐపీఎల్ మ్యాచ్ జరగాల్సి ఉందని, ఈమ్యాచ్ టికెట్లను గత శుక్రవారం విక్రయానికి పెట్టారని, అయితే టికెట్లను పేటీఎంలో అమ్మకానికి పెట్టిన క్షణాల్లోనే అమ్ముడు పోయాయంటూ బోర్డ్ ప్రకటించిందని, దాదాపు 36 వేలకు పైగా టికెట్లను అమ్మకానికి పెట్టిన అరగంట గంటలోపే ఏవిధంగా అమ్ముడుపోతాయో హెచ్‌సీఏ, సన్‌రైజర్స్ యాజమాన్యాలు ప్రజలకు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

# జైల్లో కేజ్రీవాల్ అంతానికి కుట్ర

(మొదటిపేజీ తరువాయి)

విమర్శించారు. 'సీఎం కేజ్రీవాల్ తీవ్రంగా మధుమేహం ఉందని అందరికీ తెలుసు... ఆయన గత 30 ఏళ్లుగా ఈ వ్యాధితో బాధపడుతున్నారు. తన సుగర్ స్థాయిని అదుపులో ఉంచుకోవడానికి రోజూ 54 యూనిట్ల ఇన్సులిన్ తీసుకుంటారు. అందుకే కోర్టు అరవింద్ కేజ్రీవాల్ ఇంట్లో వండిన ఆహారాన్ని తినడానికి, డాక్టర్ సూచించిన ఆహారాన్ని తినడానికి అనుమతించింది. కానీ బీజేపీ తన జేబు సంస్థ ఈడీ సాయంతో అరవింద్ కేజ్రీవాల్ ఆరోగ్యాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తోంది' అని అతిశి మండిపడ్డారు. కేజ్రీవాల్ స్వీట్ టీ తాగుతున్నారని, స్వీట్లు తింటున్నారని ఈడీ చెప్పిందాంట్లో నిజం లేదన్నారు. కేజ్రీవాల్‌జీకి డాక్టర్ సూచించిన స్వీటెనర్‌తో టీ,స్వీట్‌లకు అనుమతి ఉందని... ఇది డయాబెటిక్ రోగులకు ఇవ్వబడే తక్కువ కేలరీల స్వీటెనర్ అని తెలిపారు. కేజ్రీవాల్ తన బ్లడ్ సుగర్ స్థాయిని పెంచుకోవడానికి అరటిపండ్లు తింటున్నాడన్న ఈడీ ఆరోపణలు అతిశి తప్పుబట్టారు. 'నేను ఈడీకి చెప్పాలనుకుంటున్నాను. ఎవరైనా మధుమేహ వైద్యుడితో మాట్లాడండి. రోగులకు అరటిపండు, కొన్ని రకాల టోఫీ లేదా చాక్లెట్ ఎల్లప్పుడూ వారితో ఉంచుకోమని చెబుతారు. కేజ్రీవాల్ ఈడీ కస్టడీలో ఉన్నప్పుడు లేదా జైలులో ఉన్నప్పుడు అతను ఎప్పుడూ ఏదో ఒక రకమైన టోఫీ, అరటిపండు అతనితో కలిగి ఉండాలని కోర్టు ఉత్తర్వులో స్పష్టంగా రాసి ఉంది' అని తెలిపారు. సుగర్ స్థాయిల్లో తీవ్ర హెచ్చుతగ్గులు ఉన్న నేపథ్యంలో తన రెగ్యులర్ డాక్టర్‌ను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంప్రదించేందుకు అనుమతించాలని కోరుతూ కేజ్రీవాల్ ఇటీవల ప్రత్యేక కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై న్యాయస్థానం గురువారం విచారణ జరిపింది. కాగా ఢిల్లీ సీఎం అభ్యర్థనను ఈడీ వ్యతిరేకించింది. కేజ్రీవాల్‌కు ఇంటి భోజనానికి అనుమతి ఉండటంతో ఆయన నచ్చిన ఆహారం తీసుకుంటున్నారని తెలిపింది. టైప్-2 దయాబెటీస్‌తో బాధ పడుతున్నప్పటికీ చక్కెర స్థాయిలు ఎక్కువగా ఉండే అరటిపండు, మామిడి పండ్లు, స్వీట్లు, ఆలూ పూరీ వంటివి తింటున్నారని తెలిపింది. దీనిపై ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం జైల్లో కేజ్రీవాల్ తీసుకుంటున్న భోజనంతో పాటు ఆయన డైట్ చార్ట్‌పై శుక్రవారం లోపు నివేదిక ఇవ్వాలని తీహార్ జైలు అధికారులను ఆదేశించింది. అనంతరం పిటిషన్‌పై తదుపరి విచారణను రేపటికి వాయిదా వేసింది.

# రాయిదాడి కేసులో నిందితుడి అరెస్టు

(మొదటిపేజీ తరువాయి)

చేసేందుకు ఎస్పీతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను విజయవాడ నగర పోలీస్ కమిషనర్ క్రాంతి రాణా ఏర్పాటు చేశారు. సీఎంపై దాడి జరిగిన ప్రాంత సమీపంలోని వివేకానంద స్కూల్, గంగానమ్మ గుడి దగ్గర నుంచి నమోదైన ఫోన్ కాల్ డేటాను సేకరించి అధ్యయనం చేశారు. అంతకుముందు 15 రోజుల కాల్‌డేటాను కూడా పరిశీలించారు. సీసీ ఫుటేజీల ఆధారంగా వీడియో దృశ్యాలను తిలకించారు. ఆ ప్రాంతంలో ప్రత్యేకంగా డ్రోన్లను ఎగురవేసి అధ్యయనం చేశారు. అనంతరం 50 మందికిపైగా స్థానికులను అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి, వారి నుంచి సమగ్ర సమాచారం సేకరించారు. కొందరు ప్రత్యక్ష సాక్ష్యులు ఇచ్చిన సమాచారాన్ని దర్యాప్తులో క్రోడీకరించారు. దీంతోపాటు సీఎం దాడి కేసులో తగిన సమాచారం, ఆధారాలతో కూడిన వీడియోలు పంపిన వారికి రూ.2లక్షల బహుమతిని కూడా ఎన్టీఆర్‌జిల్లా పోలీసులు ప్రకటించారు. ఈ ఘటనపై దర్యాప్తునకు సంబంధించిన ప్రాథమిక సమాచారాన్ని కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘానికి విజయవాడ సీపీ క్రాంతి రాణా నివేదించారు.

**కోర్టును ఆశ్రయించిన కుటుంబ సభ్యులు**

తొలుత పోలీసుల అదుపులో ఉన్న యువకుల తరఫున వారి కుటుంబ సభ్యులు విజయవాడ కోర్టులో సెర్చ్ వారెంట్ పిటిషన్ వేశారు. తమ కుమారుల ఆచూకీ తెలపాలని కోరారు. సీఎం జగన్‌పై రాయిదాడి కేసు దర్యాప్తులో భాగంగా విచారణ నిమిత్తం మూడు రోజుల క్రితం అజిత్‌సింగ్‌నగర్ వడ్డెర కాలనీకి చెందిన ఈ యువకులను పోలీసులు తీసుకెళ్లారు. ఇంతవరకు వారిని ఇంటికి పంపకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. తమ పిల్లలను పోలీసులు తీసుకెళ్లడాన్ని నిరసిస్తూ స్థానికులతో కలిసి నిరసనకు దిగారు.వివిధ పోలీస్‌స్టేషన్లకు వెళ్లినప్పటికీ, ఎక్కడా వారి ఆచూకీ తెలియకపోవడంతో తమ పిల్లల ఆచూకీ తెలపాలంటూ కోర్టును ఆశ్రయించారు. ఇదే సమయానికి సతీశ్‌ను పోలీసులు అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. ఇప్పటికే సతీశ్, దుర్గారావుపై పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా ఈ కేసులో సీఎంపై రాయి దాడిని సతీశ్ చేయలేదని వారు చెబుతున్నారు.

# ఒకే రోజు రూ.400 కోట్ల మద్యం విక్రయాలు

### ఇళ్లలో నిల్వచేసుకున్న మందుబాబులు

**చెన్నై:** రాష్ట్రవ్యాప్తంగా టాస్మాక్ దుకాణాల్లో మద్యం విక్రయాలు ఒక్కసారిగా ఊపందుకున్నాయి. ఒకే రోజు రాష్ట్రమంతా రూ.400 కోట్ల మేర మద్యం విక్రయించినట్లు టాస్మాక్ ఉన్నతాధికారులు ప్రకటించారు. రాష్ట్రంలో ఈ నెల 19న లోక్‌సభ ఎన్నికల పోలింగ్ నిర్వహించడం కోసం బుధవారం నుంచి శనివారం వరకు టాస్మాక్ దుకాణాలకు సెలవు ప్రకటించారు. దీంతో మద్యంప్రియులు రెండు రోజు క్రితమే టాస్మాక్ దుకాణాలకు పోటెత్తి మూడు రోజులకు సరిపడా మద్యం కొనుగోలు చేశారు. టాస్మాక్ నిబంధనల ప్రకారం ఒక్కో వ్యక్తికి ఓ బీరు, మూడు క్వార్టర్ బాటిల్స్ మద్యం విక్రయించాల్సి ఉంది. అయితే మందుబాబులు విడతల వారీకా బీర్లు, మద్యం సీసాలు కొని ఇళ్లకు తీసుకెళ్లారు. కొంతమంది మద్యపాన ప్రియులు షాపుల వద్దే మద్యం తాగి, మూడు రోజులకు సరిపడా మద్యం, బీర్ కొనుగోలు చేసి ఇళ్లకు చేరారు. సాధారణంగా రాష్ట్ర వ్యాప్తంగా మద్యం దుకాణాలలో రోజూ రూ.150 కోట్ల మేరకు మద్యం విక్రయాలు జరుగుతాయి. అయితే మంగళవారం రెండున్నర రెట్లు అమ్మకాలు పెరిగి సుమారు రూ.400 కోట్ల మేర మద్యాన్ని విక్రయించినట్లు టాస్మాక్ అధికారులు వెల్లడించారు.

# ఒప్పందాన్ని తుంగలో తొక్కారు

**పోర్టు కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలి**

**సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీఎస్ మూర్తి**

**విశాలాంధ్ర-విశాఖ:** అదానీ గంగవరం పోర్టు కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, విశాఖ స్టీల్ ప్లాంట్‌కి కోకింగ్ కోల్ సరఫరాకు తగిన చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి డిమాండ్ చేశారు. విశాఖలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... అదానీ గంగవరం పోర్టులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక చట్టాలు ఏవీ అమలు కావడం లేదని అన్నారు. గంగవరం పోర్టును అదానీ కొనుగోలు చేసిన తరువాత కార్మికులు రెండోసారి ఆందోళన చేస్తున్నారని చెప్పారు. మొదటిసారి ఆందోళన చేసినప్పుడు కలెక్టర్ సమక్షంలో కుదిరిన ఒప్పందాన్ని పోర్టు యాజమాన్యం తుంగలోకి తొక్కిందని విమర్శించారు. పోర్టు వల్ల సర్వస్వం కోల్పోయి నిర్వాసితులైన గంగవరం, దిబ్బపాలెం గ్రామాలకు చెందిన 600 కుటుంబాలకు పోర్టులో కాంట్రాక్టు ఉద్యోగాలు ఇచ్చారని చెప్పారు. పోర్టు యాజమాన్యం నేరుగా నియమించిన ఉద్యోగులకు ఎక్కువ వేతనం ఇస్తూ అదే పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు అతి తక్కువ వేతనాలు ఇస్తున్నారని చెప్పారు. పదేళ్లుగా ఉద్యోగం చేస్తున్నా పది నుంచి 15 వేల రూపాయల వేతనం మాత్రమే కార్మికులకు వస్తోందన్నారు. పోర్టులో లోకో వ్యవస్థను గతంలో రైట్స్ సంస్థ నిర్వహించేదని, లోకో పైలట్లకు రూ.40 వేల వేతనం ఇచ్చేదని చెప్పారు. అదానీ యాజమాన్యం రైట్స్ సంస్థను తప్పించి, కొంతమందికి శిక్షణ ఇచ్చి లోకో పైలట్లుగా ఉద్యోగాలు ఇచ్చి అతి తక్కువ వేతనాలు ఇస్తున్నారన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ వెనుకనే ఉన్న గంగవరం పోర్టు వల్ల విశాఖ స్టీల్ ప్లాంట్ కి సరుకు రవాణా చార్జీలు తగ్గి, మేలు జరుగుతుందని భావించగా... దానికి విరుద్ధంగా దూరంగా ఉన్న విశాఖ పోర్టుకు చెల్లించిన చార్జీలే తమకు చెల్లించాలని మొండిగా వ్యవహరించి ప్రభుత్వ పెద్దలతో ఒప్పందం చేయించిందని విమర్శించారు. ఆ తరువాత కార్గో హ్యాండ్లింగ్ చార్జీలు పెంచిందని, బకాయిలు ఉన్నాయని చెబుతూ స్టీల్ ప్లాంట్ కి సరుకులు రవాణా చేయకుండా నిలిపివేసిందని గుర్తు చేశారు. పోర్టు కార్మికుల ఆందోళన వల్ల స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో పడుతుందని... ఆందోళన విరమించాలని కార్మికులకు చెబుతున్న బీజేపీ నాయకులు... అదాని పోర్టు యాజమాన్యానికి వేతనాలు పెంచాలని ఎందుకు చెప్పరని నిలదీశారు. దేశంలో కీలక రంగాలు ప్రైవేటు సంస్థల చేతుల్లో ఉండడం వల్ల నష్టం జరుగుతుందనడానికి ఇది నిదర్శనమన్నారు. అదానీ గంగవరం పోర్టు కార్మికులు ఆందోళన చేస్తుంటే సెంట్రల్ లేబర్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన ప్రాంతీయ లేబర్ కమిషనర్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. గతంలో జరిగిన ఒప్పందం అమలు కాలేదంటే కలెక్టర్ మాటే చెల్లే పరిస్థితి నెలకొందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ లోని కోక్ ఓవెన్ బ్యాటరీలకు కోకింగ్ కోల్ సరఫరా తగ్గడం వల్ల విశాఖకు ప్రమాదం పొంచి ఉందని తెలిపారు. వీటికి నష్టం జరిగితే ప్రమాదకరమైన కార్బన్ మోనాక్సైడ్ విషవాయువు విలువడే ప్రమాదం ఉందని చెప్పారు. ఎల్జీ పాలిమర్స్ విషవాయువు విడుదలై పదిమంది మృత్యువాత పడిన ఘటన గుర్తు చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై కేంద్ర కేబినెట్లో తీర్మానం చేయలేదంటూ ఎన్నికల సమయంలో ఓటర్లను మభ్యపెట్టేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని విమర్శించారు. పార్లమెం ట్‌లో స్వయంగా ఉక్కు శాఖామంత్రి విశాఖ స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటుపరం చేయనునట్టు ప్రకటించారని... అమ్మకపు ప్రక్రియను కూడా ప్రారంభించారని గుర్తు చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటుపరం కానివ్వబోమని చెప్పిన తెలుగుదేశం, జనసేన పార్టీలు ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతాయని ప్రశ్నించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ కి సెయిల్ నుంచి కోకింగ్ కోల్ రానుందని, ఈ నిర్ణయం తీసుకున్నందుకు సెయిల్ యాజమాన్యాన్ని అభినందించారు. గంగవరం పోర్టుకు వెళ్లాల్సిన రెండు నౌకలను విశాఖ పోర్టుకు పంపించి, విశాఖ స్టీల్ ప్లాంట్ కి సరుకులను పంపేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఈ విషయంలో పోర్టు చైర్మన్ చొరవ తీసుకోవాలని కోరారు. విలేకరుల సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు మన్మధరావు, ప్రధాన కార్యదర్శి అచ్యుతరావు, ఉపాధ్యక్షుడు కసిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

---

## ఆర్థిక పరిస్థితి దృష్ట్యానే సీపీఎస్ అమలు రద్దు: మంత్రి బొత్స

**విశాలాంధ్ర-విశాఖ సిటీ:** గత ఎన్నికల ప్రచారంలో సీపీఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా సాధ్యం కాలేదని, దానికి ప్రత్యామ్నాయంగా ఉద్యోగులకు మేలు చేసే స్కీమ్ తీసుకువచ్చామని మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వంలో పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేపట్టామని, ప్రతిపక్షాలు అసత్యాలు చెబుతుండడంతో ప్రజలకు వాస్తవాలు చెప్పాల్సి అవసరం ఏర్పడిందన్నారు. ఉత్తరాంధ్ర సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రచించామన్నారు. గ్లోబల్ సమిట్ ద్వారా వేల కోట్లు పెట్టుబడులు రానున్నాయని, వివిధ దశలలో ఆయా పనులు జరుగుతున్నాయన్నారు. విశాఖ మెట్రో రైల్ ప్రాజెక్టు సహా, భోగాపురం ఎయిర్ పోర్టు, భీమిలిలో ఫిషింగ్ హార్బర్ రూపుదిద్దుకుంటున్నాయన్నారు. మద్యపాన నిషేధం దశలవారీగా అమలు చేస్తామన్నారు. వెనుకబడిన ప్రాంతంగా గుర్తింపు పొందిన ఉత్తరాంధ్రను గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మరింత వెనుకబాటుకు గురైందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 18,200 మంది ఉపాధ్యాయులను నియమించామని వివరించారు. సీఎంపై రాయి దాడి విషయంలో తప్పు చేయకుంటే భయం ఎందుకని ప్రశ్నించారు. దమ్ముంటే స్టీల్ ప్లాంట్‌పై తమ స్టాండ్ ఏంటో చెప్పాలని చంద్రబాబుకు సవాల్ విసిరారు.

---

## జూన్ 4 తర్వాత టీడీపీ, జనసేన చిరునామా గల్లంతు: మంత్రి జోగి రమేశ్

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** టీడీపీ, జనసేన చిరునామా జూన్ నాలుగు తర్వాత గల్లంతు కావడం ఖాయమని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేశ్ జోస్యం చెప్పారు. ఓడిపోయాక, బాబు అండ్ కో హైదరాబాద్‌కు పారిపోతారని చెప్పారు. వైసీపీ తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో గురువారం మంత్రి జోగితోపాటు మాజీ మంత్రి పేర్ని నాని, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (సామాజిక) జూపూడి ప్రభాకర్‌రావు వేర్వేరుగా విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. జోగి రమేశ్ మాట్లాడుతూ, సీఎంపై దాడి జరిగితే అవహేళనగా మాట్లాడటానికి టీడీపీ నేతలకు సిగ్గు లేదా అని మండిపడ్డారు. చంద్రబాబు, పవన్, విలువలు, విశ్వసనీయత లేని రాజకీయ అజ్ఞానులు అని విమర్శించారు. చంద్రగిరి నుంచి బాబు, భీమవరం నుంచి పవన్ ఎందుకు పారిపోయారు అని నిలదీశారు. విజయవాడ నడిబొడ్డున సీఎంపై దాడి జరిగితే, ఆ దాడి ఒక డ్రామా అని, పథకం ప్రకారం చేశారని చంద్రబాబు, లోకేశ్ సిగ్గు లేకుండా మాట్లాడతారా అని ధ్వజమెత్తారు.

**చంద్రబాబు ప్రతి మాట అబద్ధమే: పేర్ని నాని**

మచిలీపట్నం ఎన్నికల సభలో చంద్రబాబు మాట్లాడిన ప్రతిమాట అబద్ధమని, జడ్జితో మాట్లాడి తోట త్రిమూర్తులుకు బెయిల్ ఇప్పించారని వ్యాఖ్యానించడాన్ని మాజీ మంత్రి పేర్ని నాని తప్పుపట్టారు. 1996లోనే శిరోముండనం కేసు బయటపడిందని, ఆ ఘటన జరిగినప్పుడు తోట త్రిమూర్తులు టీడీపీలోనే ఉన్నారు కదా ... నిందితుడిగా ఉన్నప్పుడు త్రిమూర్తులు టీడీపీ నుంచే పోటీ చేశారని గుర్తుచేశారు. చంద్రబాబు, పవన్ దిగజారి తన కుమారుడు పేర్ని కిట్టుపై వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రానికి చంద్రబాబు, పవన్‌తోపాటు బీజేపీ నేతలు ఏం చేశారో చెప్పాలని నిలదీశారు. జన్మభూమి కమిటీలను మళ్లీ తెస్తామనే దమ్ము చంద్రబాబుకు ఉందా అని నిలదీశారు.

**దళితులను విడగొట్టింది చంద్రబాబే: జూపూడి**

దళితులను అడ్డంగా విడగొట్టిన వ్యక్తి చంద్రబాబు అని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (సామాజిక) జూపూడి ప్రభాకర్‌రావు మండి పడ్డారు. నాడు కారంచేడులో దళితులను ఊచకోత కోసింది మీరు కదా, మాదిగ పల్లెలపై దాడి చేయించి, చంపింది టీడీపీ కాదా అని నిలదీశారు. ట్యాంక్‌బండ కింద దళితులను గుర్రాలతో తొక్కించి చంపించిందీ చంద్రబాబు కాదా అని ప్రశ్నించారు. దళితులు మురికిగా ఉంటారంటూ నాడు చంద్రబాబు కేబినెట్‌లోని మంత్రులు అనలేదా అని గుర్తుచేశారు. విజయవాడలో అంబేద్కర్ విగ్రహాన్ని చూడలేని దళిత వ్యతిరేక భావం చంద్రబాబుది అని మండిపడ్డారు.

---

## జగన్ బస్సుయాత్రకు భారీ స్పందన

**విశాలాంధ్ర-రావులపాలెం/ఆలమూరు:** ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర 17వ రోజు గురువారం మధ్యాహ్నం కోనసీమ ముఖద్వారం రావులపాలెం చేరుకుంది. మార్గమధ్యంలో పెరవలి, ఖండవల్లి, అన్నవరప్పాడు, సిద్ధాంతం తదితర గ్రామాలలో రోడ్డు వెంబడి పెద్ద ఎత్తున కార్యకర్తలు, నాయకులు జై జగన్ అంటూ నినాదాలు చేశారు. సీఎం జగన్ వారికి అభివాదం చేస్తూ ముందుకు సాగారు. ఉదయం పశ్చిమ గోదావరి జిల్లా తణుకు నుంచి రాజమండ్రి బయలుదేరిన బస్సు యాత్ర మధ్యాహ్నం 1 గంటకు రావులపాలెం కళా వెంకట్రావు సెంటర్‌కి చేరింది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున తరలి వచ్చిన వైసీపీ శ్రేణులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. కొత్తపేట అసెంబ్లీ వైసీపీ అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి, అమలాపురం పార్లమెంటు అభ్యర్థి రాపాక వరప్రసాద్ అధ్వర్యంలో గోపాలపురం నుంచి నాయకులు, కార్యకర్తలు బస్సు యాత్ర వెంట మోటార్ సైకిళ్లు, కార్లతో ర్యాలీగా తరలివచ్చారు. మండుటెండను లెక్కచేయకుండా అధిక సంఖ్యలో ప్రజలు, మహిళలు జాతీయ రహదారి వెంబడి నిలబడి పార్టీ జెండాలు ఎగుర వేస్తూ జగన్‌కు ఘన స్వాగతం పలికారు. రావులపాలెం సెంటర్లో జగన్ ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారని భావించారు. అయితే జగన్ ఎలాంటి ప్రసంగం చేయకుండానే బస్సుపై నుంచి ప్రజలకు అభివాదం చేశారు. అనంతరం బస్సు యాత్ర ఆలమూరు మండలం మీదుగా రాజమండ్రి వైపు సాగింది. జాతీయ రహదారిపై జొన్నాడ, మూలస్థాన అగ్రహారం, చొప్పెల్ల, చెముడులంక, మడికి గ్రామాల మీదుగా యాత్ర కొనసాగింది.జొన్నాడ సెంటర్‌లో సీఎం జగన్‌కు ఘన స్వాగతం లభించింది. భారీగా జనం రావడంతో జాతీయ రహదారి కిక్కిరిసింది. ట్రాఫిక్ నిలిచిపోవడంతో ఎండలో ప్రయాణికులు ఇక్కట్లపాలయ్యారు.

---

## వైసీపీలోకి జనసేన, టీడీపీ నేతలు

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** జనసేన, టీడీపీకి చెందిన వివిధ నియోజకవర్గాల కీలక నేతలు వైసీపీలో చేరారు. సీఎం జగన్ సమక్షంలో వారంతా పార్టీ కండువాలను కప్పుకున్నారు. సీఎం బస చేసిన తేతలి నైట్ పాయింట్ వద్ద గురువారం రాజోలు నియోజకవర్గ జనసేన కీలక నేత, మాజీ ఎమ్మెల్యే బొంతు రాజేశ్వరరావు, పీఏసీ మాజీ చైర్మన్ మేకల వీర వెంకట సత్యనారాయణ, పి.గన్నవరం నియోజకవర్గం నుంచి టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఎన్.గణపతిరావు, ఎన్.గణేశ్‌బాబు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఏపీ కన్వీనర్ గమ్మిని సుబ్బారావు, టీడీపీ నేత వల్లమూడి గంగరాజు వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరందరికి జగన్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

---

## త్రిమూర్తులు, అనంతబాబును రీకాల్ చేయాలి

**డీహెచ్‌పీఎస్ డిమాండ్**

**విశాలాంధ్ర-ఒంగోలు:** దళితులపై విచక్షణా రహితంగా ప్రవర్తిస్తున్న ఎమ్మెల్సీలు తోట త్రిమూర్తులు, అనంతబాబును ప్రభుత్వం రీకాల్ చేయాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దళిత యువకులకు శిరోముండనం చేసిన కేసులో శిక్ష పడిన తోట త్రిమూర్తులు, అలాగే తన డ్రైవర్ ను హత్య చేసి ఇంటికి బాడీని డోర్‌డెలివరీ చేసిన అనంతబాబుపై రాజకీయ వేటు వేయాలన్నారు. వారు ఎటువంటి ఎన్నికలలో పాల్గొనకుండా రాజకీయ పార్టీలు వారికి సీట్లు నిరాకరించాలన్నారు. వారిపై జీవిత కాలం నిషేధం విధించాలని డిమాండ్ చేశారు. అధికార వైసీపీ వారి రాజకీయ అవకాశాల కోసం వీరిరువురు ఎన్ని తప్పులు చేసినా వారిని వెం టేసుకుని తిరగటం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. దళిత యువకులపై నీచంగా ప్రవర్తించిన వీరిరువురిపై ఎస్టీ,ఎస్సీ అట్రాసిటీ చట్టం అమలు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

---

## గులకరాయితో మరో జగన్నాటకం: వర్ల రామయ్య

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** గులక రాయితో జగన్ మరో జగన్నాటకానికి దిగారని, బీసీ బిడ్డలను బలిచేసి అధికారంలోకి వచ్చేందుకు కుట్ర పన్నారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య మండిపడ్డారు. టీడీపీ మంగళగిరి జాతీయ ప్రధాన కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వర్ల మాట్లాడుతూ టీడీపీ నేతలపై అక్రమ కేసులు పెట్టి ఇరికించేందుకు ప్రయత్నిస్తున్నారని, జగన్ మెప్పుకోసం పోలీసులు పనిచేస్తే మూల్యం చెల్లించుకుంటారని హెచ్చరించారు. నాడు కోడి కత్తి నాటకం, నేడు గులకరాయి డ్రామాతో జగన్ అధికారం కోసం మరో జగన్నాటకానికి తెరలేపారని ఎద్దేవా చేశారు. సానుభూతి కోసర్ నాటకాలు ఆడుతున్నారని దుయ్యబట్టారు. జగన్ బస్సు యాత్రకు జనం నుంచి ఆదరణ లేదని, అందుకే అసహనంతో జగన్ ప్లాన్ చేసి జనాల్లో సానుభూతిని పొందేందుకు బూటకపు రాయి డ్రామాకు తెరలేపారని విమర్శించారు. తెలుగుదేశం పార్టీ సానుభూతిపరుడైన దుర్గారావుపై ఎందుకు థర్డ్ డిగ్రీ ప్రయోగించారని ప్రశ్నించారు. సీఈఓకు ఏం రిపోర్టు పంపారో పరిశోధనాధికారులు వెంటనే బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. బోండా ఉమాకు గెలుపు ఖాయమైందని, కాబట్టే వెలంపల్లి పలా యనం చిత్తగిస్తున్నారని తెలుసుకొని జగన్ ఈ డ్రామాకు తెరతీశారని ఆరోపించారు.

---

# జొన్న శివశంకర్, జంగాల అజయ్‌ని గెలిపించాలి

**తాడేపల్లిలో విస్తృత ప్రచారం**

**విశాలాంధ్ర-తాడేపల్లి:** ఇండియా కూటమి బలపరిచిన మంగళగిరి అసెంబ్లీ సీపీఎం అభ్యర్థి జొన్న శివశంకరరావు, గుంటూరు పార్లమెంట్ సీపీఐ అభ్యర్థి జంగాల అజయ్ కుమార్ విజయాన్ని కాంక్షిస్తూ గురువారం తాడేపల్లి సుందరయ్య నగర్‌లో ఎన్నికల ప్రచార కార్యక్రమం ముమ్మరంగా నిర్వహించారు. ముందుగా బైపాస్‌లోని మణిపాల్ ఆసుపత్రి సెంటర్ నుంచి ప్రారంభమైన పాదయాత్ర సుందరయ్య నగర్ కట్ట, మహానాడు ప్రాంతంలో కొనసాగింది. ఈ సందర్భంగా ప్రజలు శివశంకరరావుకు పూలతో పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వి.కృష్ణయ్య మాట్లాడుతూ విభజన హామీల అమలు కోసం, ప్రత్యేక హోదా సాధన కోసం, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరంతరం ఉద్యమిస్తున్న వామపక్ష అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. జొన్న శివశంకరరావుకు సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై, జంగాల అజయ్ కుమార్‌కు కంకి కొడవలి గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. సీపీఐ మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదే పదేళ్ల కాలంలో దేశానికి చేసిందేమీ లేదని విమర్శించారు. నిత్యావసర సరుకుల ధరలు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగాయని విమర్శించారు. ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముసునూరు సుహాస్, తుడిమెల్ల వెంకటయ్య, మానికొండ డాంగే, జాలాది జాన్‌బాబు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు దర్శనపు శామ్యూల్, సీపీఎం నాయకులు యస్.వెంకట్రావు, యం. సూర్యారావు, కె.గడ్డన్న, వై.నేతాజీ, బూరుగ వెంకటేశ్వర్లు, కొట్టె కరుణాకరరావు, దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి, వేముల దుర్గారావు, దొంతిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, పి.గిరిజ, కె.ఉషారాణి, బొబ్బిలి రామారావు, షేక్ బాషా తదితరులు పాల్గొన్నారు.

---

## నాలుగు సభల్లో మోదీ

**విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:** సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో ఎన్డీఏ కూటమి నేతలు తమ ఎన్నికల ప్రచారాన్ని మరింత వేగవంతం చేయాలని నిర్ణయించారు. దీనిలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీతో రాష్ట్రవ్యాప్తంగా కనీసం నాలుగు భారీ బహిరంగసభలు నిర్వహించాలని ఎన్డీఏ నేతలు ప్రణాళిక రూపొందించారు. ఇటీవల చిలకలూరిపేటలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడిగా నిర్వహించిన సభకు ప్రధాని మోదీ హాజరైన విషయం తెల్సిందే. ఈ సభకు ప్రజల నుంచి విశేష స్పందన రావడంతో అదే తరహాలో ఉమ్మడిగా మరిన్ని సభల నిర్వహణపై ఎన్డీఏ కూటమి నేతలు దృష్టి సారించారు. ఇదే విషయాన్ని కూటమి నేతలు ప్రధాని దృష్టికి తీసుకెళ్లగా ఆయన అంగీకరించినట్లు తెల్సింది. ఇందులో భాగంగా మోదీ రాష్ట్రంలో నాలుగు బహిరంగ సభల్లో పాల్గొంటారని కూటమి నేతలు చెబుతున్నారు. అయితే బీజేపీ అభ్యర్థులు పోటీ చేస్తున్న అనకాపల్లి, రాజమహేంద్రవరం, రాజంపేట, కోస్తాలోని మరో నియోజకవర్గంలో ఉమ్మడి సభలు ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ఈ సభలో మోదీతో పాటు టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ పాల్గొననున్నారు.

---

# 21న టీడీపీ అభ్యర్థుల చేతికి బీఫారం

**టీడీపీలోకి భీమిలి, జీడీ నెల్లూరు వైసీపీ నేతలు**

**విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:** తెలుగుదేశం పార్టీ అభ్యర్థులకు ఈనెల 21వ తేదీన ఆ పార్టీ అధినేత చంద్రబాబు బీ ఫారాలు అందజేయనున్నారు. పార్టీ జోనల్ ఇన్‌ఛార్జిలతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. జోనల్ ఇన్‌ఛార్జిల ద్వారా తొలుత బీఫారాలు ఇప్పించాలని భావించినప్పటికీ... అభ్యర్థులు సెంటిమెంట్‌గా భావిస్తారనే సూచన మేరకు నిర్ణయం మార్చుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా జనసేన, బీజేపీలతో ఎన్నికల పొత్తు కారణంగా టీడీపీ 144 అసెంబ్లీ, 17 పార్లమెంట్ స్థానాలకు పోటీ చేస్తుంది. ఆయా స్థానాల్లో పోటీ చేసే టీడీపీ అభ్యర్థులందరికీ చంద్రబాబు స్వయంగా బీ ఫారాలను 21వ తేదీన అందజేయనున్నారు. అధినేతతో గురువారం జరిగిన సమావేశంలో జోనల్ ఇన్చార్జిలు దామచర్ల సత్య, సుజయ కృష్ణ రంగారావు, భూమిరెడ్డి రామ్‌గోపాల్ రెడ్డి, పెళ్లకూరు శ్రీనివాస్ రెడ్డి, మంతెన సత్యనారాయణరాజు, బీదా రవిచంద్ర యాదవ్, బొబ్బిలి చిరంజీవి, యనమదల రవి, దీపక్ రెడ్డి, కోవెలమూడి నాని తదితరులు పాల్గొన్నారు. అభ్యర్థుల్ని గెలిపించే బాధ్యత జోనల్ ఇన్చార్జిలు తీసుకోవాలని, ఇందుకోసం అనుసరించాల్సిన ప్రచార వ్యూహాలపై చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

**భీమిలి, జీడీ నెల్లూరు వైసీపీ నేతలు టీడీపీలో చేరిక**

భీమిలి, జీడీ నెల్లూరు నియోజకవర్గాలకు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు...చంద్రబాబు సమక్షంలో గురువారం తెలుగుదేశం పార్టీలో చేరారు. వీఎంఆర్‌డీఏ మాజీ ఛైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మలతో పాటు దుక్క కృష్ణయాదవ్, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఒమ్మి దేవుడు, పద్మనాభం, మాజీ ఎంపీపీ గోపిరాజు, మాజీ సర్పంచ్‌లు గేదెల చంద్రారావు, నమ్మి వెంకట్రావు, భీమిలి 25వ వార్డు అధ్యక్షుడు జి.సూర్యబాబు తదితరులు టీడీపీలో చేరారు. జీడీ నెల్లూరు నుంచి సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు బాబు నాయుడు, మాజీ సర్పంచి జయచంద్రనాయుడు చేరారు. వీరికి చంద్రబాబు టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

---

## విద్యాబోధనలో మెళకువలు నేర్చుకోండి

**ఉపాధ్యాయులకు ప్రవీణ్ ప్రకాశ్ సూచన**

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** ఈనెల 23వ తేదీతో ఈ విద్యా సంవత్సరం పూర్తవుతుందని, కొత్త విద్యా సంవత్సరం జూన్ 12వ తేదీన ప్రారంభమవుతుందని, ఈ మధ్యకాలంలో ఉండే 47 రోజుల సమయాన్ని విద్యాబోధనలో మెళకువలు నేర్చుకునేందుకు వినియోగించాలని పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాశ్ ఉపాధ్యాయులకు సూచించారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి మరింత మెరుగైన, ప్రభావవంతమైన ఉపాధ్యాయుడిగా పేరు తెచ్చుకునేందుకు రాబోయే వేసవి సెలవులు చాలా కీలకమని తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ ప్రముఖ విద్యా నిపుణుడు డౌగ్ లెమోవ్ రాసిన 'టీచ్ లైక్ ఏ ఛాంపియన్' అనే పుస్తకం ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు చదివితే ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రాచుర్యం పొందిన దాదాపు 49 బోధనా పద్ధతులు నేర్చుకునేందుకు అవకాశం కలుగుతుం దన్నారు. తద్వారా ప్రభావవంతమైన ఉపాధ్యాయుడిగా తమను తాము మార్చుకొని విద్యార్థులకు మరింత గొప్పగా బోధన చేయవచ్చని సూచించారు. ఆ పుస్తకం చదువుతుంటే ప్రతి ఒక్క ఉపాధ్యాయుడికి తాము బీఈడీ చదివే రోజుల్లో వచ్చిన ఆలోచనలు జ్ఞప్తికి వస్తాయన్నారు. పుస్తకంలో పొందుపరిచిన 1-10 స్కేల్ ద్వారా ఇప్పటికే ఉపాధ్యాయులు తాము బోధిస్తున్న పద్ధతులను తనిఖీ చేసుకోవడంతో పాటు సాంకేతికంగా ఎంత ప్రభావవంతంగా బోధిస్తున్నామన్న విషయం నిర్ధారించుకొని స్వీయ విశ్లేషణ చేసుకోవచ్చన్నారు. అంతిమంగా మన విద్యార్థులకు ప్రపంచస్థాయి బోధనతో పాటు బంగారు భవిష్యత్ అందించేందుకు ప్రతిఒక్క ఉపాధ్యా యుడు తమ అత్యుత్తమ బోధన ద్వారా బాటలు వేస్తారని భావిస్తున్నానని తెలిపారు. ఉపాధ్యాయులు తప్పనిసరిగా పుస్తకం చదవాలన్నది తన ఉద్దేశం కాదని, చదివితే అత్యుత్తమ ఉపాధ్యాయులుగా ఎదుగుతారని ఒక స్నేహితుడిగా, సహోద్యోగిగా ఇస్తున్న సలహాగా భావించాలని స్పష్టం చేశారు.

సంపాదకీయం

# ఎన్నికల కమిషన్ అంతర్ధానం!

కష్టాలు వచ్చినప్పుడు దేవుడు గుర్తుకు రావడంలో అసహజం ఏమీ లేదు. దైవ భక్తి ఉన్న వారు తీరని ఆపద వచ్చినప్పుడు భారమంతా దేవుడి మీదే వేసి చేతులు జోడించి కూర్చుంటారు. కానీ మరో సందర్భం వచ్చినప్పుడూ కొన్ని రాజకీయ పార్టీలకు శ్రీరాముడు గుర్తొస్తాడు. అయోధ్యలో కొత్తగా నిర్మించిన బాల రాముడి ఆలయం గుర్తొస్తుంది. ఆ ఆలయాన్ని చూసి బీజేపీకి ఓటు వేయండి అని బీజేపీ నాయకులు బాహాటంగానే అడుగుతుంటారు. ఎన్నికల ప్రచారంలో కులం, మతం లాంటి వాటి ప్రస్తావన తీసుకు రాకూడదన్న నియమం ఉంది. ఎన్నికల నైతిక ప్రమాణాల ప్రకారం కులం, మతం మొదలైన అంశాలను ప్రస్తావించడం నిషేధం. కానీ బీజేపీ ఎన్నికల ప్రచారం మొత్తం మతం ఆధారంగానే సాగుతుంది. అసలు బీజేపీ కేంద్రంలో అధికారంలోకి రావడానికి దోహదం చేసిందే అడ్వాణీ నాయకత్వంలో సాగిన రక్తసిక్తమైన రథ యాత్ర. ఇప్పుడు ఎన్నికల ప్రచారం ఊపందుకున్న దశలో బీజేపీ నాయకులు, అభ్యర్థులు మతాన్ని విచ్చలవిడిగా ఎన్నికల ప్రచారంలో వినియోగించుకుంటున్నారు. హైదరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కొంపెల్ల మాధవీ లత శ్రీ రామ నవమి ఉత్సవం సందర్భంగా జరిగిన ఊరేగింపులో మసీదుపై బాణం ఎక్కు పెట్టడం కనిపిస్తుంది. అదే శ్రీరామనవమి సందర్భంగా అయోధ్యలో ఇటీవల నిర్మించిన ఆలయంలో బాల రాముడి విగ్రహంపై సూర్యకిరణాలు పడడాన్ని విపరీతంగా ప్రచారంలో పెట్టారు. దీన్ని సూర్యాభిషేకం అంటున్నారు. ఇవి సహజంగా పడ్డ సూర్య కిరణాలు కావని అందరికీ తెలుసు. సహజంగానే దేవుళ్ల విగ్రహాలపై ఒకనొక సమయంలో సూర్యకిరణాలు పడే దేవాలయాలు దేశంలో అనేకం ఉన్నాయి. అది ఆ ఆ దేవాలయాలను నిర్మించిన శిల్పుల, వాస్తు శిల్పుల ప్రతిభ. మోదీ హయాంలో నిర్మించిన రామ మందిరాన్ని తలుచుకుని వేయవలసిన చోట ఓటు వేయాలని బీజేపీ పోస్టర్లు విడుదల చేసింది. దీని అంతరార్థం మోదీ రామ మందిరం నిర్మించారు కనక బీజేపీకి ఓటు వేయాలనే. రామానంద్ సాగర్ నిర్మించిన రామాయణం సీరియల్‌లో రాముడి పాత్రలో నటించిన అరుణ్ గోవిల్ ఎన్నికలు వచ్చే సరికి సాక్షాత్తు శ్రీరాముడి అవతారంగా మారిపోతారు. ఆయన రాముడి బొమ్మ పట్టుకుని ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా రామ మందిరం చిత్రపటం పట్టుకుని ఓట్లు అడుగుతారు. హైదరాబాద్ కు చెందిన బీజేపీ "ఫైర్ బ్రాండ్" రాజా సింగ్ ప్రసంగాలకైతే లెక్కే లేదు. ఆయన మీద ఏ చర్యా ఉండదు. మరో బీజేపీ నాయకుడు రాజ్య వర్ధన్ సింగ్ రాథోడ్ నేరుగా రామ మందిరం పేరనే ఓట్లు వేయాలంటున్నారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కూతురు అంజలీ బిర్లాది అదే పద్ధతి.

ఎన్నికల నైతిక ప్రవర్తనా నియమావళి ప్రకారం ఇవన్నీ నిషేధమే కాని ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ కు కానీ, ఎన్నికల కమిషనర్ల నియామకంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి స్థానం లేకుండా చేసిన కొత్త చట్టం ప్రకారం మోదీ నియమించిన ఇద్దరు ఎన్నికల కమిషనర్లు గ్యానేశ్ కుమార్, సుఖ్బీర్ సింఘ్ సంధూకు బీజేపీ చేస్తున్న ఈ ఆగడాలేవీ కనిపించవు, వినిపించవు. వాటి గురించి ఈ త్రిమూర్తులు ఒక్క మాట కూడా మాట్లాడరు. ఏ ఆహారం ఎవరు తీసుకుంటారన్నది వ్యక్తిగత ఇష్టాయిష్టాలకు పరిమితమైంది. కానీ ప్రధానమంత్రి మోదీ ప్రతిపక్ష నాయకులు వసంత కాలంలో మాంసం తింటున్నారు, చేపలు తింటున్నారు అని అభ్యంతరం పెడ్తారు. కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికలో ఆయనకు ముస్లిం లీగ్ సిద్ధాంతం కనిపిస్తుంది. కాంగ్రెస్‌ది మొగల్ మానసికత అని అనునిత్యం తూర్పార పడుతుంటారు. నిశితంగా పరిశీలిస్తే ఈ అప్రస్తుత అంశాలను మోదీ ప్రస్తావించడం ఎన్నికల నైతిక ప్రవర్తనా నియామవళిని ఉల్లంఘించడమే. కానీ ఎన్నికల సంఘం ప్రధానాధికారి రాజీవ్ కుమార్‌కు ఈ మాటలేవీ వినిపించవు. మాట్లాడితే ఆయన కవితా పాదాలు వల్లిస్తూ సమాధానం చెప్పనవసరం లేని దారి వెతుక్కుంటారు. ఇప్పుడూ ఆయన కవిత్వం చదవడంలోనో, రాయడంలోనో, వినిపించడంలోనో తలమునకలై ఉంటారు. అందుకని బీజేపీ నాయకులు అవాకులు, చెవాకులు పేలినా ఆయన పట్టించుకోరు. అలాగని ఎన్నికల కమిషన్ ఎవరి మీదా చర్య తీసుకోదని కాదు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రణదీప్ సూర్జేవాలా పార్లమెంటు సభ్యురాలు, ప్రస్తుతం మథుర నుంచి పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి, ప్రసిద్ధ నటి హేమ మాలిని మీద ఏవో వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణపై రెండు రోజుల పాటు ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొనకూడదని ఆంక్షలు విధించారు. ఎన్నికల కమిషన్ ప్రతిపక్షాల వారి తప్పులెన్నడంగా దిగజారిపోయింది. అధికారపక్షం ఏం చేసినా ఎన్నికల సంఘం పట్టించుకోలేదు. విచిత్రం ఏమిటంటే బీజేపీ లేదా మోదీ అధికారంలో ఉన్న సమయంలో సాధించిన విజయాల ఆధారంగా ఓట్లు అడగడం లేదు. ఎంతసేపూ శ్రీరాముడి నామ జపమే. రామ మందిరం నిర్మించినందుకు తమకు ఓట్లు వేయమని అడగడమే. మోదీ ఆ మాట పదే పదే చెప్తారు కానీ ఓటు బీజేపీకి వేయాలని అడగరు. తనను చూసి ఓటు వేయాలంటారు. ఈ సారి బీజేపీ ఎన్నికల ప్రణాళిక పుస్తక శీర్షికే మోదీ గ్యారంటీలు. ఆ శీర్షికలో బీజేపీ మచ్చుకు కూడా కనిపించదు. అంతా మోదీ మయం. గత జనవరిలో అయోధ్యలో రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠ జరిగినప్పుడు ప్రతిపక్ష "ఇండియా" ఐక్య సంఘటన నాయకులెవరూ హాజరు కానందుకు విరుచుకు పడ్తున్నారు. వారు హిందూ వ్యతిరేకులని ప్రచారం చేస్తున్నారు. భగవంతుడు సర్వాంతర్యామి అని అన్ని మతాల వారూ విశ్వసిస్తారు. అలాంటిది రాముడిని అయోధ్యకు పరిమితంచేసి, ఆలయ నిర్మాణ "కీర్తి"ని కొల్లగొట్టి ఓట్లు సాధించాలని ప్రయత్నిస్తున్న బీజేపీ ఆగడాలు ఎన్నికల కమిషన్ కు కనిపించవు. అయోధ్య రామ మందిర ఆవిష్కరణకు హాజరుకాని పార్టీల వారికి ఓటు వేయకూడదని కూడా మోదీ ఆట్టే దాపరికం లేకుండానే చెప్తారు. ఇదీ ఎన్నికల కమిషనర్ల త్రయానికి వినిపించదు. అన్ని రాజకీయ పార్టీలను సమాన దృష్టితో చూసిన ఎన్నికల కమిషనర్ శేషన్ ఒక్కరే కాదు. అనేక మంది ఉన్నారు. కానీ ఇప్పుడున్న ఎన్నికల కమిషనర్ల ప్రవర్తన తీరుచూస్తే అసలు ఎన్నికల కమిషన్ ఉందా అన్న అనుమానం కలుగుతుంది. సాక్షాత్తు ప్రధానమంత్రిగా ఉన్న ఇందిరా గాంధీనే ఎన్నికలలో పోటీ చేయకుండా చేసిన గత చరిత్రతో ఇప్పటి పరిస్థితికి పోలికే లేదు. ఎన్నికల కమిషన్ అస్తిత్వం రుజువయ్యేదల్లా ప్రతిపక్షాలు గీత దాటాయనుకున్నప్పుడే. మిగతా సమయంలో ఎన్నికల కమిషన్ ఆచూకీయే మాయం అవుతుంది.

# అంతే మరి

రా బావ ఏంటి సణుగుతూ వస్తున్నావు. ఏముంది ఎన్నికల ప్రక్రియ మొదలైంది. నామినేషన్లు వేస్తున్నారు. కాని ఈ వలస అభ్యర్థులేంటో నా కర్థం కావడంలేదు. ఇక్కడ పుట్టలేదు. ఇక్కడ పెరగలేదు. ఇక్కడి ప్రజల ముఖం ఏనాడు చూచి ఎరుగడు కాని ఇక్కడ నామినేషన్‌వేసి గెలిపిస్తే సేవ చేస్తా అండగా ఉంటానంటాడు తెలియని వాడిని ఎన్నుకున్న తరువాత ఇక్కడ వుండడు. అసలు తెలియని చోటుకు మన దగ్గరకువచ్చి నిలబడకపోతే పుట్టిన జిల్లాలో నిలబడవచ్చుగదా, అక్కడి ప్రజలకు సేవచేయవచ్చుగదా. నిజమే అక్కడ చెల్లని వాళ్లే పరాయి చోటుకు వచ్చేది. అయినా టిక్కెట్టు ఇచ్చే పార్టీ ముఖ్యులకు ఉండాలి. మన జిల్లాలో ఎవరూ లేనట్లు ఢిల్లీలో, హైద్రాబాదులో వ్యాపారాలతో అక్కడ ఉన్న పార్టీని తెచ్చి విజయవాడలో నిలిపితే ఇక్కడ ప్రజలు చప్పట్లతో స్వాగతం పలికి అఖండ మెజారిటీతో గెలిపిస్తారని అనుకోవడం వారి అహంకారానికి నిదర్శనం. వేల కోట్లు బ్యాంకులకు ఎగనామం పెట్టి దొడ్డిదారిన కేంద్ర మంత్రిని చేసి విజయవాడలో శాసనసభకు పోటీచేయడంలో ఆంతర్యం

ఏమిటి బావ ఏముంది వీలైతే పార్లమెంటుకు కాకపోతే శాసనసభకు ఏదో ఒక పదవి ఉంటేనే వ్యాపారాలు పెంచుకోవచ్చు. వారికి కావలసిన పనులు చక్కపెట్టుకోవచ్చు. అలాకాక టాటా బిర్లాలాగ ఎన్నికలలో పోటీచేయకుండా పార్టీలకు ఎన్నికల నిధులిచ్చి తమపనులు చక్కపెట్టుకోవచ్చు కదా, అదిసరే ఆ స్థాయికి ఎదిగాక అలానే చేస్తారు. అయినా ఎక్కడ నుండో వచ్చిన వారికి ప్రజలు ఓటు వేస్తారా. పార్టీ గుర్తు చూచి కళ్లు మూసుకుని ఏమీ ఆలోచించకుండా ఓటువేస్తారని పార్టీ అధినాయకుల నమ్మకం. పైగా ధనవర్షం కురిపిస్తారు కదా. కాని కేవలం డబ్బు ఎరచూపి గెలవాలనేది వారి అభిప్రాయం కాని ప్రస్తుతం ఓటర్లు తెలివి మీరారులే. ఇస్తే తీసుకుని ఓటు మాత్రం తెలిసిన ముఖానికే వేస్తారు. అయినా ఈ పార్టీ అధినాయకులు తాము హుకుం జారీ చేస్తే కళ్లు మూసుకుని ఓటు వేస్తారని అనుకుంటున్నారు. కాని ప్రస్తుతం ఓటరు నాకేంటి అని ఆలోచిస్తున్నాడు. ఎవర్ని ఎన్నుకుంటే తమ సమస్యలు పరిష్కారం అవుతాయో కొంచెం ఆలోచిస్తున్నాడు. డబ్బుతో ఓట్లుకొని పదవి చేపడతామని ఈ డబ్బున్న వాళ్ల ఆలోచన. ఒకరికంటే మరొకరు ఎక్కువ ఇవ్వడానికి ముందుకొస్తున్నారు. ఇద్దరి దగ్గర తీసుకుని డబ్బు ఇవ్వని మూడో వ్యక్తికి మంచివాడైతే ఓటు వేయడానికి సిద్ధంగా ఉన్నారు. అది సరే మొన్న మా పక్కింటి ఆయన ఒక చేయి నడుం వెనకాల పెట్టుకొని మరోచేయి ముందుకు చాపి నా దగ్గరకొచ్చాడు. ఏమయింది ఆ చేతికని అడిగా. ఏం కాలేదు. ఒక పార్టీ ఇచ్చినది వెనుక పెట్టుకుని రెండో చెయ్యి మరో పార్టీ ఇచ్చే దానికి ముందుకు జాపాను అన్నాడు. మరి ఇద్దరి దగ్గర తీసుకొని ఎవరికేస్తావని అడిగా. చూడండి ఓటు విలువ నాకు తెలుసు ఇద్దరిలో మంచి వాడికో లేక మూడో వ్యక్తికే వేస్తా ఓటు అమ్ముకోవడం తప్పని కూడ తెలుసు. నేను అమ్ముకోవడంలేదు. వారె ఇంటికొచ్చి రాత్రిళ్లు తలుపుతట్టి ఇస్తున్నారు. ఆ సొమ్మంతా అన్యాయంగా సంపాదించిన పావపు సొమ్మని తెలుసు. నేను తీసుకోకపోతే పంచే కార్యకర్త జేబులో వేసుకుంటాడు. ఇదిపావపు సొమ్మని తెలుసు. అయినా ఏది పావం ఏది పుణ్యమని నిర్ధారించలేము. అన్యాక్రాంతంగా దోచుకున్న సొమ్ము వెదజల్లుతుంటే వద్దనే దాని కన్నా తీసుకొని అన్నదానం చేసే వారికిస్తే తప్పేంటి అన్నాడు బావ. నిజంగా నేను సమాధానం చెప్పలేక తల గోక్కున్నాననుకో ఇప్పుడు చెప్పు ఎవరిది తప్పో. గతంలో కమ్యూనిస్టు అభ్యర్థులకు ప్రజలే విరాళాలు ఇచ్చేవారు.

బడాపారిశ్రామిక వేత్తలు, నల్లధనం ఉన్నవారు ఎన్నికలలో నిలబడ్డాక ఓట్లు కొనడం మొదలైంది. అది నిజమే ఓటరు బాగానే ఆలోచిస్తున్నాడు అభివృద్ధి అంటే సామాన్యప్రజల జీవన ప్రమాణం పెరగడవే తప్ప ఫ్లైఓవర్లు, రోడ్ల నిర్మాణం మాత్రవేకాదు గదా. అయినా మంచిచేసి అధికారంలోకి రావాలిగాని ఎదుటవాణ్ణి హతమార్చి కాదని నాయకులు గుర్తించాలి. ఆ విషయం ప్రజలకు తెలుసని నాయకులు గుర్తెరగాలి. అంతేనంటావా. ఆలోచించు అంతే మరి.

# లౌకిక, ప్రజాస్వామ్య, వామపక్షాలను గెలిపించండి

చలసాని వెంకటరామారావు

18వ లోక్‌సభ ఎన్నికలు భారత దేశ లౌకిక, ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువల పరిరక్షణలో అతి ముఖ్యమైనవి. దేశాన్ని పాలిస్తున్న నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం అన్ని రంగాలలో తీవ్ర వైఫల్యం చెందింది. మన రాజ్యాంగం నిర్దేశించిన సెక్యులరిజం, సోషలిజం, ఫెడరలిజం, సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, న్యాయం అనేవాటికి తిలోదకాలుఇచ్చి ఆర్.ఎస్.ఎస్., హిందు మత భావజాలాన్ని చొప్పించే ప్రయత్నం జరుగుతున్నది. భారత జాతీయతను, చరిత్రను పునః సమీక్ష పేరుతో దేశస్వాతంత్ర్యం కోసం త్యాగం చేసిన త్యాగధనులను విస్మరించి మనువాద సంస్కృతిని ప్రచారంలోకి తెచ్చారు. దళితుల, గిరిజనుల హక్కులను, సంస్కృతిని విచ్ఛిన్నం చేస్తున్నారు. జాతుల మధ్య వైరం సృష్టించి మణిపూర్ వంటి కీలక రాష్ట్రాలలో ఆరని అగ్నిని రగిల్చారు. గత 10 ఏళ్ళుగా మైనారిటీలపై కత్తులు దూస్తున్నారు. రానున్న ఎన్నికల దృష్ట్యా పౌరసత్వ సవరణ చట్టం ద్వారా మత విద్వేషాల ద్వారా ప్రయోజనం పొందాలని బీజేపీ, ఆర్.ఎస్.ఎస్.లు దుష్టపన్నాగాలు చేస్తున్నారు. దేశ సమగ్రత, ఐక్యతలకు విఘాతం కల్పించే చర్యలకు బీజేపీ పాల్పడుతున్నది. రాజ్యాంగ సంస్థలను విచ్ఛిన్నం చేసే చర్యలకు ప్రభుత్వం పాల్పడుతున్నది. ప్రశ్నించిన వారిని జాతి వ్యతిరేకులుగా చిత్రిస్తున్నది. ఇ.డి., సి.బి.ఐ., ఐ.టీ. సంస్థలను రాజకీయ ప్రత్యర్థులపై అణచివేతకు వినియోగిస్తున్నది. అవినీతిని అంతం చేస్తానని అధికారంలోకి వచ్చిన బీజేపీ అవినీతికి అడ్డాగా మారి పోయింది. ఈ నేపథ్యంలో 18వ లోక్‌సభ ఎన్నికల సందర్భంగా సమస్యలపై అనేక అంశాలను ప్రజల ముందు ఉంచటం ద్వారా భారత కమ్యూనిస్టు పార్టీ తన ఎన్నికల ప్రణాళికను ప్రకటించింది. ఆయా అంశాలపై పార్లమెంటు లోపల బయట సమరశీల ఉద్యమాలు నిర్వహించాలని ప్రజలకు పిలుపు ఇచ్చింది.

భారత కమ్యూనిస్టు పార్టీ రాజ్యాంగ విలువలకు కట్టుబడి ఉంటుంది. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే స్వాతంత్రోద్యమ ఆదర్శాలను కొనసాగిస్తుంది. ప్రభుత్వ రంగంలోనే విద్య, ఆరోగ్య రంగాలను కొనసాగించాలని సీపీఐ కోరుతుంది. కార్పొరేట్ ప్రయోజనాలకు భిన్నంగా పేదరిక నిర్మూలన, సమానత్వం ప్రాతిపదికగా సంపద పంపిణీ జరగాలని సీపీఐ కోరుతుంది. సామాజిక న్యాయం లక్ష్యంగా అందరికి సమాన అవకాశాలు కల్పించే విధంగా ప్రభుత్వ రంగాన్ని అభివృద్ధి చేయాలి. చట్ట సభలలో మహిళా ప్రాతినిధ్యం పెంపుదలను నియోజక వర్గాల పునర్విభజనతో నిమిత్తం లేకుండా అమలు చేయాలి. అందరికి ఉపాధి, ఉద్యోగాల కల్పన జరగాలి. కనీస వేతనం రోజుకు 700 తగ్గకుండా సాధించేందుకు సీపీఐ తన పోరాటాన్ని కొనసాగిస్తుంది. పట్టణ ప్రాంతాలలో సైతం ఉపాధి హామీ చట్టం కొరకు కృషి చేస్తుంది. గౌరవ ప్రదమైన జీవితం సీనియర్ సిటిజన్స్‌కు కల్గించటం, రిటైర్డ్ ఉద్యోగులకు పాత పెన్షన్ స్కీం అమలుకు సీపీఐ కృషి చేస్తుంది. రాజ్యం నుండి మతాన్ని వేరు చేయాలి. పాలనలో లౌకిక విధానాన్ని కొనసాగించాలి. సామాజికంగా, విద్యాపరంగా వెనుక బడిన వర్గాల ప్రయోజనాల పరి రక్షణకు కుల గణన చేయాలి. చట్టం ప్రకారం పాలించాలి. రాజ్యాంగ సంస్థల దుర్వినియోగాన్ని సీపీఐ వ్యతిరేకిస్తుంది. ఫెడరలిజం స్ఫూర్తిని కొన సాగించాలి. దుర్వినియోగం అవుతున్న గవర్నర్ వ్యవస్థను రద్దు చేయాలి. పాండిచ్చేరి, ఢిల్లీలకు పూర్తి రాష్ట్ర హోదా కల్పించాలని పార్లమెంటరీ ప్రజాస్వామ్య విధానాన్ని సీపీఐ బలపర్చుతుంది. పార్లమెంటు ప్రజా సమస్యలు చర్చించి పరిష్కార మార్గాలు అన్వేషించేందుకు కనీసం సంవత్సరానికి 120 రోజులు సమావేశం కావాలి. స్వేచ్ఛగా ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంస్కరణలు తీసుకురావాలి. ఎన్నికలు పెట్టాలని తద్వారా నల్లధనం ప్రభావం నుండి ప్రజాస్వామ్యాన్ని రక్షించ వచ్చు. ఎన్నికల కమిషన్ స్వతంత్ర ప్రతిపత్తిని పరిరక్షించేందుకు ఎన్నికల కమిషన్ నియామకంలో ప్రభుత్వ పాత్రను తగ్గించాలి. ప్రభుత్వం పాఠ్య పుస్తకాలలో అలౌకిక భావాలను చొప్పించటం, అశాస్త్రీయ ఆలోచనలకు ప్రాధాన్యం ఇవ్వాటం, మత తత్వ ధోరణులు చొప్పించటాన్ని సీపీఐ తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. డా.ఎం.ఎస్. స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు, గిట్టుబాటు ధర, వికేంద్రీకృత కొనుగోలు ఏర్పాట్లకు చట్టబద్ధత కల్పించాలి. వ్యవసాయ ఉపకరణాల ధరలు తగ్గించాలి. అన్ని పంటలకు, రైతులకు పంట నష్టపరిహార ఉచిత బీమా పథకం అమలు. 60 ఏళ్ళు దాటిన రైతులకు పెన్షన్లతో పాటు సామాజిక భద్రతా పథకాల అమలు చేయాలి. రాష్ట్ర, కేంద్ర స్థాయిలలో వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్ ఉండాలి. లాండ్‌పూలింగ్, ల్యాండ్ ఎక్విజిషన్ కు రైతుల అనుమతి ఉండాలి. నష్ట పరిహారం చెల్లించాలి. 2013 చట్టం ప్రకారమే భూసేకరణ, పునరావాసం ఉండాలి. భూమిలేని పేదలకు భూమి, నివాసం కల్పించాలి. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ తొలగింపు. 15వ ఇండియన్ లేబరు కాన్ఫరెన్సు సిఫారసుల మేరకు దేశ వ్యాపిత కనీస వేతన నిర్ణయం. కనీస పెన్షన్ 9 వేలు చెల్లింపు. 60 ఏళ్ళు దాటిన ప్రతి వారికి ధరల సూచికతో కూడిన పెన్షన్ చెల్లింపు. కాంట్రాక్టు లేబరు విధానం తొలగింపు తదితర అంశాలు ఎన్నికల ప్రణాళిక కోరింది. మహిళా రిజర్వేషన్ చట్టం వెంటనే అమలు. డీ- లిమిటేషన్ క్లాజు తొలగింపు. పంచాయితీ రాజ్ సంస్థలలో 50శాతం మహిళా రిజర్వేషన్ అన్ని స్థాయిలలో అమలు, మహిళా సాధికారత సాధించటం, మహిళలపై నేరాల అదుపు తదితర అనేక అంశాలను సీపీఐ తన ప్రణాళికలో పేర్కొంది. పని హక్కును ప్రాథమిక హక్కుగా గుర్తించాలి. పట్టణ ఉపాధి హామీ పథకం ఏర్పాటుచేసి కనీస రోజులకు నిరుద్యోగ భృతి చెల్లించాలి. ప్రభుత్వ ఉద్యోగాలలోని ఖాళీలను




భర్తీ చేయటం, క్రీడా సౌకర్యాలు పెంపొందించటం, గ్రామీణ, విద్యాసంస్థలలో క్రీడలను ప్రోత్సహించటం. జాతీయ స్థాయిలో యూత్ కమిషన్ ఏర్పాటు చేసి యువకుల సామర్థ్యాన్ని పెంపొందించటం వంటి అంశాలను ప్రణాళికలో ప్రస్థావించారు.

ఎస్.సి., ఎస్.టి., ఇతర బి.సి, కులాలకు ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు కల్పించాలి. భూమి లేని దళిత, షెడ్యూల్ తెగల కుటుంబాలకు సాగు యోగ్యమైన భూమి కేటాయించాలి. అటవీ హక్కుల చట్టం, షెడ్యూల్ ప్రాంతాల విస్తరణ చట్టాలను కచ్చితంగా అమలు పర్చాలి. ఆదివాసీ రైతులను భూముల నుండి అటవీ రక్షణ పేరుతో బేదఖల్ చేయరాదు. ఎస్.సి., ఎస్.టి. సబ్-ప్లాన్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పునరుద్ధరించాలి. జస్టిస్ రాజేంద్ర సచార్ కమిటి, రంగనాథ్ మిశ్రా కమిటి సిఫారసులను అమలు చేయాలి. నేషనల్ కమిషన్ ఆఫ్ మైనారిటీస్ (ఎస్.సి.ఎం.) కు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించాలి. మైనారిటీ విద్యార్థుల మౌలానా అజాద్ ఫెలోషిప్ ను తిరిగి పునరుద్ధరించాలి.

దేశంలో పరిస్థితులు కేంద్రంలోని ప్రభుత్వంలో మార్పును సూచిస్తున్నాయి. భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయోద్యమంలో కీలక భూమిక వహించింది. ప్రజల కోసం అశేష త్యాగాలను చేసింది. మతోన్మాద, ఫాసిస్టు, సెక్టేరియన్, విభజన సౌధ, కార్పొరేట్ అనుకూల, ప్రజావ్యతిరేక, గౌరవ ప్రదమైన జీవితం కోసం పోరాడింది. సమాఖ్యవిధానం, ఆర్థికాభివృద్ధి, సామాజిక న్యాయం లక్ష్యంగా ఉద్యమాలు నిర్వహించింది. భారత కమ్యూనిస్టు పార్టీ ప్రజలను - ఓటర్లను లౌకిక, ప్రజాస్వామిక, ప్రజానుకూల ప్రత్యామ్నాయ పాలనకు అనుకూలంగా తీర్పు ఇవ్వాలని, వామపక్ష, ప్రత్యేకంగా సీపీఐ సభ్యులను గణనీయంగా పార్లమెంటుకు, 18వ లోక్‌సభకు ఎన్నిక చేయాలని కోరింది. మన దేశ ప్రజలు ఐక్యంగా బ్రిటీష్ రాజ్యాన్ని ఓడించారు, ఇప్పుడు అదే స్ఫూర్తితో ఆర్.ఎస్.ఎస్, బీజేపీ రాజ్యాన్ని ఓడించటానికి ఇదే సరైన సమయమని పేర్కొంది. భారత కమ్యూనిస్టు పార్టీకి ఓటు వేయండి!

వామపక్షాలకు ఓటు వేయండి !

లౌకిక, ప్రజాస్వామ్య పార్టీలకు ఓటు వేయండి !

బీజేపీ, ఎన్.డి.ఎ. కూటమిని ఓడించండి !

దేశాన్ని రక్షించండి! రాజ్యాంగాన్ని కాపాడండి! మంచి జీవన విధానాన్ని స్వాగతించండి! అని దేశ ప్రజలకు కమ్యూనిస్టు పార్టీ పిలుపునిచ్చింది.

సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు
సెల్:9490952093

# డోలాయమాన స్థితిలో వలంటీర్లు

మంతిని రమేష్

ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ ఎన్నికల సందర్భంగా వలంటీర్లకు మద్దతునిస్తూ అధికార, ప్రతిపక్ష నాయకులు చేస్తున్న ప్రకటనలు అందరిని ఆశ్చర్యపరుస్తున్నాయి. వారు ఐఏఎస్ అధికారులా లేదా మండల స్థాయి ఉద్యోగులా లేదా సచివాలయ ఉద్యోగులా లేదా గ్రామానికి దిశ-దశను చూపించే వ్యక్తులా అని సర్వత్ర చర్చించుకుంటున్నారు. వారికి అంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉందా అని కొంతమంది విశ్లేషకులు, మేధావులు ప్రశ్నిస్తే, వారుచేసిన సేవలు అమోఘమని, ప్రస్తుత పరిస్థితుల్లో వారి సేవలు అవసరమేనని మరికొంతమంది విశ్లేషకులు, మేధావులు చెబుతున్నారు. గ్రామాల్లోని ప్రతీ 50కుటుంబాలకు ప్రభుత్వం అందించే అన్నిరకాల సేవలు ప్రజలకు సకాలంలో చేరువ కావాలనే ఆలోచనతో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే 2019లో వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టారు. వీరికి నెలకు ఐదువేల రూపాయలు గౌరవవేతనం, ఒకటోతేదీన పింఛన్ దారులతోపాటు సిఎఫ్ఎంఎస్ ద్వారా వారి వారి వ్యక్తిగత ఖాతాల్లో నేరుగా జమ చేస్తున్న విషయం తెలిసిందే.వీరువచ్చాక అన్నిరకాల ప్రభుత్వ కార్యక్రమాలను అమలు చేయడానికి అటు అధికార యంత్రాంగానికి, ఇటు ప్రజలకు మధ్య సంధానకర్తలుగా ఉండి సేవలను అందించారు. కరోనా వంటి విపత్కర పరిస్థితిలో కూడా



వారు అందించిన సేవలు ఎంతో విలువైనవి. ప్రభుత్వం ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించినా, వివిధ పథకాలపై సర్వేలు నిర్వహించినా ఎక్కడాలేని విధంగా తక్షణమే నివేదికలు రావడంలో వీరిపాత్ర కీలకమని చెప్పవచ్చు. మొదటి మూడేళ్ల సక్రమంగా విధులు నిర్వహించిన వలంటీర్లలో నేడు కొంత అసంతృప్తి ఏర్పడింది.

గ్రామాల్లో కీలకమైన వలంటీర్లను నేడు ఎన్నికల విధులలో దూరంచేయాలనీ ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీచేసిన తర్వాత వారిపై అధికార, ప్రతిపక్ష పార్టీలు దృష్టి పెట్టాయి.అధికార పార్టీతో పాటు ప్రతిపక్ష పార్టీలు వారికి మద్దతు పలుకుతూ ఎన్నికలు ముగిసిన తరువాత ప్రభుత్వం వచ్చాక వారికి మరింత ప్రాధాన్యత ఇస్తామని హామీలు ఇస్తున్నారు.ఇటువంటి సమయంలో అధికార పక్షపార్టీ వైఎస్ఆర్సీపీ వారిని స్వచ్ఛందంగా తప్పుకొని ఈ రెండునెలలపాటు పార్టీకి సేవలు అందిస్తే తగు గౌరవవేతనం నేరుగా అందజేస్తామని చెబుతూ కొంత డబ్బులను కూడా అందజేస్తున్నారు.ఇప్పటికే రాష్ట్రస్థాయి నుండి గ్రామస్థాయివరకు దీనిపై మౌఖికంగా ఆదేశాలు ఇస్తూ వారిని రాజీనామా చేసేందుకు కృషి చేస్తున్నారు. దీంతోపాటు వారికి ప్రభుత్వం ఇచ్చే గౌరవవేతనంను నాలుగు నెలల పాటు నేరుగా స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థులే ఇవ్వడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నారు. ప్రతిపక్ష తెలుగుదేశంపార్టీ కూడా వలంటీర్ల వ్యవస్థను తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొనసాగిస్తామని, దీంతోపాటు వారికి ప్రస్తుతం ఇచ్చే గౌరవ వేతనం రెండురెట్లు పెంచు తామని టీడీపీ అధినేత ప్రకటన చేశారు. అధికారపక్షం వలంటీర్లను నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం నాటికే పూర్తిగా తప్పుకుని వైయస్ఆర్సీపీ రాజకీయాల్లో ప్రత్యక్షంగా పాల్గొని క్రియాశీలకపాత్ర పోషించాలని కోరుతున్నారు. వారికి అండదండలుగా ఉండి ప్రభుత్వంవచ్చాక మరల తిరిగి తీసుకుంటామని ఒప్పిస్తున్నారు. వలంటీర్లు స్వచ్ఛందంగా తప్పుకోలేక అధికారపార్టీ నేతల ఒత్తిడి తట్టుకోలేక ఏం చేయాలో తెలియని పరిస్థితిలో ఉన్నారు. గత రెండురోజుల నుండి పార్వతీపురం మన్యం జిల్లాలో వలంటీర్ల రాజీనామాలు పరంపర కొనసాగుతుంది. శాసనసభ్యుల సూచనల మేరకు రాజీనామాలు చేయడమేకాక పార్టీకండువాలు వేసుకొని ప్రత్యక్ష రాజకీయాల వైపు దృష్టిసారిస్తున్నారు. నిరుద్యోగ యువతీ యువకులు వలంటీర్ల వ్యవస్థలోచేరి ఐదువేలు గౌరవ వేతనం పొందుతూ సజావుగా జీవనం సాగిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో వారు అధికారపార్టీకి మద్దతు కోసం రాజీనామా చేయాలా లేదంటే కొనసాగాలా అన్న సందిగ్ధంలో చాలామంది వలంటీర్లు ఉండడం గమనార్హం. వైఎస్ఆర్సీపీ మరల రెండోసారి ప్రభుత్వం ఏర్పాటుచేస్తే రాజీనామాచేసిన వలంటీర్లకు భరోసా ఉంటుందని, ఒకవేళ ఎన్నికల్లో టీడీపీ గెలవకపోతే రాజీనామా చేసిన వలంటీర్లు గాల్లోనే ఉండాల్సిన పరిస్థితి తలెత్తడం ఖాయమనిపిస్తుందని పలువురిలో గుసగుసలు వినిపిస్తున్నాయి. అధికార పార్టీకు మద్దతు పలికే వలంటీర్లు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రాజీనామాలు చేస్తూ వైఎస్ఆర్సీపీ కండువాలు కప్పుకొంటున్నారు.తటస్థంగా ఉండే వలంటీర్లు నిర్ణయం తీసుకోలేక కొనసాగుతున్నారు. దీనిపై అధికార పార్టీ ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి. గ్రామాల్లో నేడు వలంటీర్లు రాజీనామాలు చేసి రాజకీయాలలో క్రియాశీలకపాత్ర గురించి రక రకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి.గ్రామంలో ఇప్పటికే ఏళ్ల తరబడి పాతుకుపోయిన నాయకులను కాదని వీళ్ళు రాజకీయాలు చేయడం సాధ్యమేనా అని నాయకులు చర్చించుకుంటున్నారు. ఏది ఏమైనా ఆంధ్రప్రదేశ్‌లో 2024 మే నెలలో జరగనున్న ఎన్నికలు చాలా కీలకమని అధికార, ప్రతిపక్షపార్టీలు చర్చించుకుంటున్నాయి. వైఎస్ఆర్సీపీ, టీడీపీ ఈ ఎన్నికలను చాలెంజ్‌గా తీసుకొని ఎత్తుకు పైఎత్తు వేస్తూ ముందుకు సాగుతున్నాయి. ఈ ఎన్నికల్లో పెద్దఎత్తున ఖర్చు పెట్టడానికి సిద్ధపడుతున్నట్లు స్పష్టంగా తెలుస్తుంది. ఒక్కొక్క అసెంబ్లీ స్థానంనుంచి ఎన్నికల కమిషన్ నిర్ణయించిన దానికంటే పెద్ద ఎత్తున ఖర్చు పెట్టడానికి అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిసింది.

# ఇవి రాజ్యాంగాన్ని రక్షించే ఎన్నికలు

## బీజేపీ విధ్వంసంపై ప్రజలకు వివరించండి

## కాంగ్రెస్ కార్యకర్తలకు రాహుల్ పిలుపు

**న్యూఢిల్లీ:** దేశంలో ప్రస్తుతం జరుగుతున్న సార్వత్రికలు ఎన్నికలు సాధారణ ఎన్నికలు కాదని... రాజ్యాంగాన్ని రక్షించే ఎన్నికలని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని బీజేపీ ధ్వంసం చేస్తోందని దేశ ప్రజలకు తెలియజెప్పాలని ఆయన కాంగ్రెస్ కార్యకర్తలకు ఉద్బోధించారు. ఈ దిశగా కాంగ్రెస్ కార్యకర్తలకు చాలా పెద్ద బాధ్యత ఉందని రాహుల్ చెప్పారు. ఈ మేరకు సార్వత్రిక ఎన్నికల మొదటి దశ ఎన్నికల పోలింగ్‌కు ఒక రోజు ముందు గురువారం ఆయన ఓ వీడియో సందేశం విడుదల చేశారు. 'మన పార్టీకి మీరు వెన్నెముక. ఇది ఎన్నికల సమయం కాబట్టి నేరుగా మీతో మాట్లాడాలని అనుకున్నాను. ఇవి మామూలు ఎన్నికలు కాదు... రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడే ఎన్నిక. ఇందులో మీలాంటి కార్యకర్తలపై చాలా పెద్ద బాధ్యత ఉంది' అని రాహుల్ తన సందేశంలో చెప్పారు. బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్‌లు భారత్ ఆలోచనకు వ్యతిరేకమని గాంధీ అన్నారు. 'వారు మన రాజ్యాంగంపై, దేశ ప్రజాస్వామ్య నిర్మాణంపై, ఎన్నికల కమిషన్‌తో సహా మన రాజ్యాంగ సంస్థలపై అలాగే దేశ చట్టపరమైన చట్రంపై దాడి చేస్తున్నారు. మీరు వీధుల్లో, గ్రామాల్లో, ప్రతిచోటా ఆర్‌ఎస్‌ఎస్ భావజాలానికి వ్యతిరేకంగా పోరాడండి... మీరే రక్షకులు'అని రాహుల్ కార్యకర్తలతో అన్నారు. బీజేపీని, దాని సిద్ధాంతాలను కాంగ్రెస్ ఓడించబోతోందని రాహుల్ స్పష్టం చేశారు. భారత్‌పై బీజేపీ దాడి చేస్తోందని, రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తోందని, భారత దేశాన్ని నాశనం చేస్తోందని కాంగ్రెస్ కార్యకర్తలు ప్రజలకు చెప్పాలని కోరారు. లోక్‌సభ ఎన్నికల కోసం కాంగ్రెస్ తీసుకొచ్చిన మేనిఫెస్టోను అద్భుతమని పేర్కొంటూ... ప్రతి పేద కుటుంబం నుండి ఒక మహిళకు సంవత్సరానికి రూ. 1 లక్ష ఇవ్వడం, శిక్షణపొందే హక్కు, రైతులకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)కు చట్టబద్ధ హామీ, 30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను అందించడం, అగ్నివీర్ పథకాన్ని రద్దు చేయడం, వస్తు సేవల పన్ను (జీఎస్టీ) వ్యవస్థను సక్రమంగా అమలు చేయడం వంటి హామీల గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు. ప్రజాభిప్రాయం మేరకే మేనిఫెస్టో సిద్ధం చేశామని... దీని గురించి దేశ ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు.

'2024 లోక్‌సభ ఎన్నికల కోసం దేశ ప్రజల నుండి కీలక సూచనలు తెలుసుకుని మన మేనిఫెస్టోలోకి తీసుకురావడానికి మీరు సహాయం చేశారు. నేను మీకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను' అని ఆయన అన్నారు. లోక్‌సభ ఎన్నికల కోసం కాంగ్రెస్ పారీ 45 పేజీల మేనిఫెస్టోను 'న్యాయ్ పాత్ర' పేరుతో ఏప్రిల్ 5న విడుదల చేసిన సంగతి విదితమే. 'ఎక్స్'లో కార్యకర్తలకు రాహుల్‌గాంధీ వీడియో సందేశాన్ని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ట్యాగ్ చేశారు. 'లోక్‌సభ ఎన్నికల మొదటి దశకు ఒక రోజు ముందు రాహుల్ గాంధీ నుండి వచ్చిన ఈ వీడియో సందేశాన్ని చూడండి. అట్టడుగు స్థాయి నుండి వస్తున్న స్పందన చూస్తుంటే దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ కార్యకర్తలు ఈ ఎన్నికలపై ఎంత ఆసక్తిగా ఉన్నదీ అర్థమవుతుంది' అన్నారు. 'మోదీ ప్రభుత్వం నిష్క్రమణ ఖాయం. ఇప్పుడు మనం జూన్ 4 వరకు వేచి చూడాలి' అని ఆయన అన్నారు. ఏప్రిల్ 19 నుంచి జూన్ 1 వరకు ఏడు దశల్లో జరగనున్న లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు జూన్ 4న చేపట్టనున్నారు.

## మాక్‌పోల్స్ ఈవీఎంలు తనిఖీ చేయండి: సుప్రీం

**న్యూఢిల్లీ:** కేరళ మాక్‌పోల్స్‌లో బీజేపీకి 'అదనపు ఓట్లు' నమోదైన ఈవీఎంలను తనిఖీ చేయాలని సుప్రీంకోర్టు గురువారం ఎన్నికల కమిషన్(ఈసీ)ని ఆదేశించింది. న్యాయవాది ప్రశాంత్ భూషణ్ సమర్పించిన నివేదికలపై జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం పరిశీలించింది. ఈవీఎం ఓట్లతో పాటు వీవీప్యాట్‌లలోని స్లిప్‌లను క్రాస్ వెరిఫికేషన్ జరపాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌లపై సుప్రీంకోర్టు నేడు విచారణ చేపట్టింది. కేరళలోని కాసర్‌గడ్‌లో ఈ నెల 17న నిర్వహించిన మాక్ పోల్స్‌లో నాలుగు వీవీఎంలలో బీజేపీకి అదనపు ఓట్లు వచ్చాయని, ఈవీఎంలు తప్పుగా పనిచేశాయని ప్రశాంత్ భూషణ్ పేర్కొన్నారు. దీంతో వాటిని పరిశీలించాలని ఈసీ తరపున హాజరైన సీనియర్ న్యాయవాది మనీందర్‌సింగ్‌ను ఆదేశించారు. ఈవీఎంలపై కేరళలోని అధికారిక ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్ ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశాయని స్థానిక మీడియా తెలిపింది. ఈవీఎం యంత్రాలు మార్చాలని కోరినట్లు తెలిపింది.

## శిల్పాశెట్టి దంపతుల రూ.98 కోట్ల ఆస్తులు అటాచ్

**న్యూఢిల్లీ:** బిట్‌కాయిన్లతో మోసాలకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) దర్యాప్తు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగానే ప్రముఖ నటి శిల్పాశెట్టి దంపతులపై ఈడీ చర్యలు చేపట్టింది. ఆమె భర్త రాజ్‌కుంద్రాకు చెందిన రూ.97.79 కోట్ల స్థిర, చరాస్తులను అటాచ్ చేసింది. ఇందులో జుహూలోని ఓ నివాస ఫ్లాట్ శిల్పాశెట్టి పేరు మీద ఉన్నట్లు తెలిపింది. దీంతో పాటు పుణెలోని ఓ నివాస బంగ్లా, రాజ్‌కుంద్రా పేరు మీదున్న ఈక్విటీ షేర్లను అటాచ్ చేసినట్లు వెల్లడించింది. ముంబైకి చెందిన 'వేరియబుల్ ప్రైవేట్ లిమిటెడ్' అనే సంస్థ 2017లో 'గెయిన్ బిట్‌కాయిన్ పోంజీ స్కీమ్'ను నిర్వహించింది. ఇందులో భాగంగా బిట్‌కాయిన్లలో పెట్టుబడులు పెడితే నెలకు 10 శాతం లాభాలు వస్తాయని ఆశ చూపి మల్టీ-లెవల్ మార్కెటింగ్ పద్ధతిలో ఏజెంట్ల ద్వారా ముంబై, ఢిల్లీ నగరాల్లో అమాయకుల నుంచి రూ.6,600 కోట్లు వసూలు చేశారు. ఈ మోసం బయటపడటంతో సంస్థ, దాని ప్రమోటర్లపై ఈడీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. ఈ కుంభకోణం సూత్రధారి అమిత్ భరద్వాజ్ నుంచి రాజ్‌కుంద్రా 285 బిట్‌కాయిన్లు తీసుకున్నట్లు ఈడీ పేర్కొంది. వీటితో ఉక్రెయిన్‌లో బిట్‌కాయిన్ మైనింగ్ ఫామ్‌ను ఏర్పాటు చేయాలని రాజ్‌కుంద్రా ప్రణాళికలు వేసినట్లు తెలిపింది. ఈ కాయిన్లు ఇప్పటికీ అతడి వద్ద ఉన్నాయని, ప్రస్తుత మార్కెట్ ప్రకారం వాటి విలువ రూ.150 కోట్లకు పైనే ఉంటుందని వెల్లడించింది. ఈ క్రమంలోనే కేసు దర్యాప్తులో భాగంగా రాజ్‌కుంద్రా ఆస్తులు అటాచ్ చేసింది.

## అమేథీలో పోటీ రాహుల్‌కు భయం: రాజ్‌నాథ్



**తిరువనంతపురం:** కాంగ్రెస్ కంచుకోట అమేథీలో పోటీ చేయడానికి కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీకి ధైర్యం లేదని రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఎద్దేవా చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కేరళలోని పతనంతిట్టలో బీజేపీ ఏర్పాటుచేసిన బహిరంగ సభలో పాల్గొన్న రాజ్‌నాథ్ సింగ్ ఈ వ్యాఖ్యలు చేశారు. '2019లో జరిగిన ఎన్నికల్లో అమేథీ నుంచి పోటీ చేసిన రాహుల్ పరాజయం పాలయ్యారు. అందుకే ఈసారి అక్కడి నుంచి బరిలోకి దిగేందుకు ధైర్యం చేయలేకపోతున్నారు. ఈ ప్రభావంతో ఉత్తరప్రదేశ్ నుంచి కేరళకు ఆయన వలస వచ్చారు. వయనాడ్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న రాహుల్‌ను మరోసారి తమ ఎంపీగా ఎన్నుకోవద్దని అక్కడి ప్రజలు భావిస్తున్నట్లు విన్నాను' అని రాజ్‌నాథ్ సింగ్ ఎద్దేవా చేశారు.

భారత్‌లో ఎన్నో కొత్త అంతరిక్ష ప్రయోగాలు, ఇతర ప్రాజెక్టులను ఎప్పటికప్పుడు ప్రయోగిస్తున్నా... హస్తం పార్టీ తమ యువనేత 'రాహుల్‌యాన్'ను గత 20 ఏళ్లుగా లాంచ్ చేయలేకపోతోందని రాజ్‌నాథ్ సింగ్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. మరోవైపు అమేథీ నుంచి రాహుల్ గాంధీ పోటీపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్పందించారు. ఆ స్థానం నుంచి రాహుల్ పోటీ చేయాలని తాను ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. అమేథీ నుంచి ఆయన ఎందుకు పోటీ చేయలేకపోతున్నారో ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. కాగా, ఆ స్థానం నుంచి ఎవరు పోటీ చేయాలనే అంశంపై కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటానని రాహుల్ ఇప్పటికే స్పష్టంచేశారు.

# నిందితులను పట్టించిన తప్పుడు ఐడీ

**బెంగళూరు:** బెంగళూరులోని రామేశ్వరం కెఫే పేలుడు కేసులో నిందితుల కీలక వివరాలు బయటపడుతున్నాయి. వారు ఈ దాడి కుట్రకు వాడేసిన పాత ఫోన్లనే వినియోగించినట్లు తేలింది. కొత్తఫోన్లు కొనుగోలు చేస్తే గుర్తింపు కార్డుల ఆధారంగా పట్టుకోవడం చాలా తేలిక. అదే సెకెండ్ హ్యాండ్, థర్డ్ హ్యాండ్ ఫోన్లు అయితే గుర్తించడం కష్టం. ఇక వాడేసిన సిమ్‌లు వినియోగిస్తే గుర్తించేదెవరు? ఇది రామేశ్వరం కెఫే కేసులో ఉగ్రవాదుల ఆలోచన. కానీ, చివరికి వారు సమర్పించిన తప్పుడు ఐడీనే పోలీసులకు బలమైన క్లూ ఇచ్చింది. తొలుత రామేశ్వరం కెఫే కేసు దర్యాప్తులో బాంబర్ వాడిన లిమిటెడ్ ఎడిషన్ బేస్‌బాల్ క్యాప్ దర్యాప్తు సంస్థల చేతికి చిక్కింది. వారు దాని ఆధారంగా చెన్నైలోని ఓ లాడ్జిలో తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో కర్నాటకలో అనేకచోట్ల ఎన్‌ఐఏ సోదాలు చేసింది. ఈ క్రమంలో ఓ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ మేనేజర్ ముజమ్మిల్ షరీఫ్‌ను అరెస్టు చేసింది. వాస్తవానికి నిందితులు చెన్నై లాడ్జిలో ఉండేందుకు ఓ గుర్తింపు పత్రంతోపాటు... షరీఫ్‌కు సంబంధించిన ఫోన్ నెంబర్ ఇచ్చారు. ఆ నెంబర్‌గల సిమ్‌ను అప్పటికే షరీఫ్ దాదాపు ఐదు నెలల క్రితం వరకు తన ఫోన్‌లో వాడాడు. ఇది దర్యాప్తులో కీలక మలుపుగా మారింది. ఈ దాడికి లాజిస్టిక్స్ సాయం చేసిన షరీఫ్‌ను అధికారులకు పట్టించింది. అతడిని అరెస్టు చేసిన రోజే ప్రధాన నిందితులైన షాజిబ్, తాహ పేర్లను దర్యాప్తు సంస్థ ప్రకటించింది. వీరిద్దరూ విఘ్నేష్, సుమిత్, మహమ్మద్ జునైద్ సయీద్ పేర్లతో ఫిబ్రవరిలో చెన్నైలోనే మకాం వేసినట్లు మార్చి 29న ఎన్‌ఐఏ గుర్తించింది. నిందితులు దర్యాప్తు బృందాలను గందరగోళానికి గురిచేయడానికి ముందే ప్లాన్ చేసుకొన్నారు. వీరు కొత్తగా ఒక్క ఫోన్ లేదా సిమ్‌ను కొనుగోలు చేయలేదు. వీలైనన్ని ఎక్కువ చేతులు మారిన కార్డులు, ఫోన్లు మాత్రమే తీసుకొన్నారు. నిందితులు వాడిన ఒక ఫోన్‌లో ఏకంగా 150 సిమ్ కార్డులు వినియోగించారంటే అర్థం చేసుకోవచ్చు. పశ్చిమబెంగాల్‌లో ఫేక్ ఐడీలు ఇచ్చి ఇటువంటివి 35 సిమ్ కార్డులు కొనుగోలు చేశారు.

**నాలుగేళ్లుగా ఎక్కడ...**

షాజిబ్, తాహ 2020 నుంచి పూర్తిగా అండర్‌గ్రౌండ్‌లో ఉన్నారు. వీరు ఆ సమయంలో కర్నాటక, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, కేరళ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో తలదాచుకొన్నారు. ఎక్కడా అత్యధికంగా ఆరు నెలలకు మించి లేరు. చౌకబారు లాడ్జిల్లో ఉంటూ రోడ్డు, రైలు మార్గాల్లోనే ప్రయాణించేవారు. కానీ ఖరీదైన దుస్తులు వాడేవారు. వారిద్దరూ నిరుద్యోగులే కావడంతో డబ్బు ఎక్కడిదనే అంశంపై దర్యాప్తు సంస్థలు దృష్టిపెట్టాయి. తాహకు క్రిప్టో కరెన్సీ మార్గంలో నిధులు అందితే... వాటిని మిత్రులు, తెలిసిన వారికి పంపి భారత కరెన్సీలోకి మార్పించేవాడు. వాటినే రోజువారీ ఖర్చులకు వాడుకొనేవారని దర్యాప్తు బృందాలు అంచనా వేశాయి. ఈ క్రమంలో దొంగ ఐడీలు, ఐసిస్‌లో చేరేందుకు వచ్చిన వ్యక్తుల గుర్తింపు కార్డులను తాహ వాడుకొన్నాడు. ఈ రకంగా ముజమ్మిల్ షరీఫ్‌కు రూ.లక్ష పంపించి పేలుడుకు అవసరమైన సామగ్రి, సిమ్‌లు, ఫోన్ల కొనుగోళ్లు వంటి ఏర్పాట్లు చేయించాడు. క్రిప్టోల బదిలీపై తాహ చిన్ననాటి మిత్రుడిని కూడా ఇప్పుడు ఎన్‌ఐఏ ప్రశ్నిస్తోంది. శివమొగ్గ ఐఎస్ మాడ్యూల్ కేసులో జైల్లో ఉన్న మాజ్ మునీర్‌కు రామేశ్వర్ కెఫే పేల్చివేత కుట్రపై ముందే అవగాహన ఉన్నట్లు తెలుసుకొన్నారు. అతడి పేరును కూడా ఈ కేసులో నాలుగో నిందితుడిగా చేర్చారు.

## సురక్షిత స్థానాల వైపు రాహుల్ చూపు: ఆజాద్



**జమ్ము:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ధైర్యంగా బీజేపీకి వ్యతిరేకంగా పోరాడుతున్నారన్న వ్యాఖ్యలను ఆ పార్టీ మాజీ నేత గులాం నబీ ఆజాద్ తోసిపుచ్చారు. ఆయన చర్యలు అలా అనిపించడం లేదని, బీజేపీ పాలిత రాష్ట్రాల నుంచి పోటీ చేసేందుకు సంకోచిస్తున్నారని అభిప్రాయపడ్డారు. అంతేగాకుండా మైనార్టీలు అధికంగా ఉన్న రాష్ట్రాల్లో ఆశ్రయం పొందుతున్నారని విమర్శించారు. సురక్షిత స్థానాలు ఎంచుకోవడాన్ని సైతం ప్రశ్నించారు. రాహుల్, నేషనల్ కాన్ఫరెన్స్ ఉపాధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా 'స్పూన్ ఫీడింగ్ కిడ్స్' అని ఎద్దేవా చేశారు. వారిద్దరు వ్యక్తిగతంగా ఎలాంటి త్యాగాలు చేయలేదని, రాజకీయ వారసత్వాన్ని ఆస్వాదిస్తున్నారని, సొంతంగా చేసిందేమీ లేదని విమర్శించారు. ఐదు దశాబ్దాల పాటు కాంగ్రెస్‌లో కొనసాగిన గులాంనబీ ఆజాద్ ... రెండేళ్ల క్రితం ఆ పార్టీ నుంచి బయటకు వచ్చారు. ఆ సందర్భంగా పార్టీ బలోపేతానికి సంస్థాగతంగా ఎలాంటి నిర్ణయాలు తీసుకోవడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. రాహుల్ రాకతోనే కాంగ్రెస్ నాశనం మొదలైందని నాడు మండిపడ్డారు. పరిణతి లేని ఆయన నాయకత్వం కారణంగానే తాను వైదొలుగుతున్నట్లు స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆయన డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ అజాద్ పార్టీకి అధ్యక్షుడిగా ఉన్నారు.

# అంతరిక్షమూ యుద్ధ క్షేత్రమే

## త్రివిధ దళాధిపతి చౌహాన్

**న్యూఢిల్లీ:** అంతరిక్షం కూడా యుద్ధాలకు వేదికగా మారిందని తాను విశ్వసిస్తున్నట్లు భారత త్రివిధ దళాల అధిపతి జనరల్ అనిల్ చౌహాన్ పేర్కొన్నారు. గగనతల, సముద్ర, భూ భాగాలపై దీని ప్రభావం తప్పక ఉంటుందన్నారు. ఢిల్లీలో మూడు రోజుల పాటు జరగనున్న ఇండియన్ డిఫెన్స్ స్పేస్ సింపోజియమ్-24 కార్యక్రమంలో వీడియో ద్వారా ప్రసంగం చేసిన ఆయన.. 'అంతరిక్ష దౌత్యం' అనేది త్వరలోనే వాస్తవరూపం దాలుస్తుందన్నారు. భవిష్యత్ యుద్ధాల్లో రోదసి పాత్ర గురించి సీడీఎస్ ప్రముఖంగా ప్రస్తావించారు. "అంతరిక్షం అనేది చివరి సరిహద్దు. దాని విస్తీర్ణం అనంతం. అది పెరుగుతూనే ఉంది. ఇతర సరిహద్దుల మాదిరిగా దాని ఎల్లలను స్పష్టంగా నిర్వచించడం కష్టం. రోదసి రహస్యాలను ఛేదించేందుకు మానవుడు ఎంతో దూరం వెళ్లాల్సి ఉంది. ఆ ప్రయాణంలో భారత్ కూడా భాగం కావాలని కోరుకుంటోంది. భవిష్యత్ యుద్ధాలకు అంతరిక్షాన్ని ఓ వేదికగా పరిగణిస్తుంటారు. ఇప్పటికే అది స్థాపించబడిందని విశ్వసిస్తున్నా. గగనతలం, సముద్ర, భూభాగంపైనా దీని ప్రభావం ఉంటుంది' అని సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ అభిప్రాయపడ్డారు. స్పేస్ అనేది 'గ్లోబల్ కామన్స్'గా పేర్కొన్న చౌహాన్.. అక్కడ సార్వభౌమాధికారం అనే భావన ఉండదన్నారు. మిత్ర దేశాలకు సహకారం అందించాలనుకుంటే ఓ పొరుగు దేశంగా ఉండాల్సిన అవసరం లేదన్నారు. అంతరిక్ష రంగంలో ఇప్పటివరకు ఇతర దేశాల నుంచి సేవలు పొందుతోన్న భారత్.. ప్రపంచదేశాలకు సేవలందించే రోజు ఎంతో దూరంలో లేదన్నారు. మరోవైపు, భారత్ చేపట్టనున్న 'గగన్‌యాన్' కార్యక్రమానికి సంబంధించి నలుగురు వ్యోమగాములకు శిక్షణ కొనసాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో నేవీ చీఫ్ అడ్మిరల్ ఆర్.హరికుమార్, డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీవో) ఛైర్మన్ పీవీ కామత్, సాయుధ దళాలకు చెందిన ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# ఎన్నికలకు హెలికాప్టర్లు సిద్ధం

**డెహ్రాడూన్:** లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఉత్తరాఖండ్‌లో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర అదనపు ముఖ్య ఎన్నికల అధికారి విజయ్ కుమార్ జోగ్దండే ఎన్నికలకు సన్నద్ధత గురించిన సమాచారాన్ని అందించారు. ఉత్తరాఖండ్‌లోని మొత్తం ఐదు లోక్‌సభ స్థానాలకు ఏప్రిల్ 19న ఒకే దశలో ఎన్నికలు జరగనున్నాయి. అత్యవసర సేవ కోసం రెండు హెలికాప్టర్లను ఏర్పాటు చేశామని, ఈసారి ఓటింగ్ ప్రమాద రహితంగా ఉంటుందని, ఎటువంటి అత్యవసర పరిస్థితి తలెత్తదని జోగ్దండే తెలిపారు. 'అన్ని పోలింగ్ బృందాలు బయలుదేరుతున్నాయి. వారి అత్యవసర సేవ కోసం రెండు హెలికాప్టర్లను ఏర్పాటు చేశాం. ఒక హెలికాప్టర్ గర్వాల్‌లో, మరొకటి కుమావోన్‌లో మోహరిస్తాం. వీటిని అత్యవసర అవసరాలకు మాత్రమే ఉపయోగిస్తాం. బూత్ స్థాయిలో సహాయ నిర్వహణలో భాగంగా కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, అంబులెన్స్‌ల నంబర్లు అందుబాటులో ఉంచాం' అని ఆయన పేర్కొన్నారు. కొండ ప్రాంతంలో ఓటింగ్ శాతం పెంచేందుకు రాష్ట్రవ్యాప్తంగా 11 వేలకు పైగా పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశామన్నారు.

# ఓట్ల కోసం పాట్లు

## మూటలు మోసిన అపర కుబేరుడు

**కురుక్షేత్ర:** ఎన్నికల ప్రచార వేడి పతాకస్థాయికి చేరుకుంది. కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్‌డీఏ, ప్రతిపక్షాల ఉమ్మడి కూటమి ఇండియా ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. హర్యానాలోని కురుక్షేత్ర లోక్‌సభ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా అపర కుబేరుడు, జిందాల్ స్టీల్స్ ఛైర్మన్ నవీన్ జిందాల్ పోటీ చేస్తున్నారు. ఇటీవల వరకు ఆయన కాంగ్రెస్‌లో కొనసాగారు. 2004, 2009 ఎన్నికల్లో కురుక్షేత్ర నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించారు. కొద్దిరోజుల కిందటే కాషాయ కండువా కప్పుకొన్న నవీన్ జిందాల్ అదే కురుక్షేత్ర నుంచి బీజేపీ టికెట్‌తో రంగంలో దిగారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నవీన్ జిందాల్... స్థానిక మార్కెట్ యార్డులో మూటలు మోయడం ప్రాధాన్యత సంతరించుకుంది. 50 కేజీల గోదుమ మూట ఎత్తుకుని లారీలోకి లోడ్ చేశారు. దీనికి సంబంధించిన వీడియోను ఆయనే స్వయంగా తన 'ఎక్స్' ఖాతాలో షేర్ చేశారు. హర్యానాలో మొత్తం 10 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. అన్ని లోక్‌సభ నియోజకవర్గాలకు ఆరో విడతలో అంటే మే 25వ తేదీన పోలింగ్ జరగనుంది. 4వ తేదీన ఓట్లు లెక్కిస్తారు.

# టీమ్ సహకారం చాలా కీలకం

## ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్ లక్ష్మణ్

**రాయ్‌పూర్:** మావోయిస్టుల నుంచి ముప్పు ఉన్నా వారిపై పోరాడే దృఢ సంకల్పం కలిగిన పోలీస్ అతడు. ఇప్పటివరకు వంద ఎన్‌కౌంటర్లలో 42 మంది మావోయిస్టులను అంతమొందించారు. ఆయనే మోహ్లా-మన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్ కేవత్. ఆయన్ను 'ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్' అని పిలుస్తుంటారు. లక్ష్మణ్ కేవత్ ఛత్తీస్‌గఢ్‌లోని సూరజ్‌పూర్ జిల్లాలో 2007లో కానిస్టేబుల్‌గా విధుల్లో చేరారు. 2012లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా బీజాపూర్‌లో తొలిసారిగా పనిచేశారు. పదేళ్లుగా లక్ష్మణ్ మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్నారు. మావోయిస్టు ప్రాబల్యం ఉన్న ప్రాంతాలకు రోడ్లు, విద్యుత్, వైద్యం, మందులు, విద్య సరిగ్గా అందవు. ఆయా ప్రాంతాల్లో సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం, అధికారులు నిరంతరం శ్రమిస్తున్నారని లక్ష్మణ్ చెప్పారు. రోడ్లు, విద్యుత్ స్తంభాలు ధ్వంసం చేస్తారని, కాబట్టి ఆయా ప్రాంతాల్లో భద్రత చాలా ముఖ్యమని ఆయన అభిప్రాయపడ్డారు. 'మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్లలో 15 మంది మావోయిస్టులను అంతమొందించాను. అప్పటి నుంచి మావోయిస్టులు నన్ను టార్గెట్ చేశారు. ఈ విషయం సీనియర్ అధికారులకు తెలియడంతో భద్రత దృష్ట్యా నన్ను అక్కడి నుంచి బదిలీ చేశారు. నేను బీజాపూర్‌లో 2016 నుంచి 2018 వరకు విధులు నిర్వహించాను. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో 10 ఏళ్లుగా ఉంటూ 100కి పైగా ఎన్‌కౌంటర్లలో పాల్గొనడం నాకు గర్వంగా ఉంది. ఇంతమంది మరణించినా నా టీమ్‌లోని ఒక్క పోలీసు కూడా ఏ ఎన్‌కౌంటర్‌లోనూ మరణించలేదు. వారికి కేవలం గాయాలు మాత్రమే అయ్యాయి. వారి ధైర్యాన్ని చూసి నేను ప్రేరణ పొందాను. పక్కా పథకం ప్రకారమే ఎన్‌కౌంటర్లు చేస్తాం' అని లక్ష్మణ్ తెలిపారు. హెలికాప్టర్‌ను సైతం ఎక్కడ ల్యాండ్ చేయాలో కూడా ముందే చూసుకుంటామన్నారు. దట్టమైన అడవిలో రాత్రి సమయంలో బస చేయాల్సి వస్తే అందుబాటులో ఉన్న ఆహారపదార్థాలు, వైద్య సదుపాయాలపై ముందుగానే ఓ అంచనాకు వస్తామని వెల్లడించారు. కొన్నిసార్లు ప్రాణాలు పణంగా పెట్టి నదులు, వాగులు దాటుకుంటూ ఆపరేషన్ నిర్వహించాలని చెప్పారు. ఆ సమయంలో టీమ్ సహకారం చాలా అవసరమని పేర్కొన్నారు. వేసవిలో తీవ్ర ఇబ్బందులు ఉంటాయని, మావోయిస్టులు నీటి కోసం వచ్చే సమయంలో మాటు వేసి అవసరమైతే వారిపై దాడులు చేస్తామని వివరించారు.

# జేఎన్‌యూ నుంచి రాజకీయాల్లోకి...

## ఆ ముగ్గురూ ఎంపీలు కాగలరా?

**న్యూఢిల్లీ:** దేశ రాజకీయాల్లో ప్రమేయం గల విశ్వవిద్యాలయాల జాబితాలో జేఎన్‌యూ అగ్రస్థానంలో ఉంది. గత 50 ఏళ్లలో చాలామంది విద్యార్థి నేతలకు జేఎన్‌యూ రాజకీయాల్లో ప్రవేశం కల్పించింది. అయితే వారిలో ఏ ఒక్కరు లోక్‌సభకు చేరుకోలేకపోయారు. ఇప్పుడు తొలిసారిగా ముగ్గురు జేఎన్‌యూ విద్యార్థి సంఘం మాజీ నేతలు లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. ఈశాన్య ఢిల్లీ నుంచి కన్హయ కుమార్, నలంద నుంచి సందీప్ సౌరభ్, సెరంపూర్ నుంచి దీప్సితా ధర్ ఈ జాబితాలో ఉన్నారు. ఈ ముగ్గురూ ఇండియా కూటమి అభ్యర్థులే కావడం విశేషం. జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ మాజీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు కన్హయ కుమార్ హస్తం గుర్తుపై ఈశాన్య ఢిల్లీ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. కన్హయ్య 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీహార్‌లోని బెగుసరాయ్ నుంచి సీపీఐ టికెట్‌పై పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. కన్హయ ప్రస్తుతం కాంగ్రెస్ విద్యార్థి విభాగం ఎన్ఎస్‌యూఐకి ఇన్‌ఛార్జ్‌గా ఉన్నారు. బీహార్‌లోని బెగుసరాయ్ నివాసి కన్హయపై 2016లో దేశద్రోహం ఆరోపణలు రావడంతో అతను పత్రికల్లో పతాకశీర్షికన నిలిచారు. ప్రస్తుతం ఈ కేసులో కన్హయ బెయిల్‌పై ఉన్నారు. 2015-16లో జేఎన్‌యూ విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా పనిచేసిన కన్హయ కుమార్ ప్రస్తుతం బీజేపీ అభ్యర్థి మనోజ్ తివారీపై పోటీ చేస్తున్నారు. తివారీ 2014 నుంచి ఇక్కడ ఎంపీగా కొనసాగుతున్నారు. 2019 ఎన్నికల్లో ఈ స్థానంలో కాంగ్రెస్‌కు కేవలం 28 శాతం ఓట్లు రాగా, మనోజ్ తివారీకి దాదాపు 54 శాతం ఓట్లు వచ్చాయి.

జేఎన్‌యూఎస్‌యూ మాజీ ప్రధాన కార్యదర్శి సందీప్ సౌరభ్ బీహార్‌లోని నలంద సీటు నుంచి ఇండియా కూటమి అభ్యర్థిగా బరిలోకి దిగారు. బీహార్‌లో నలంద జేడీయూకి కంచుకోటగా ఉంది. ప్రస్తుతం ఇక్కడి నుంచి జేడీయూ నేత కౌశలేంద్ర కుమార్ ఎంపీగా ఉన్నారు. పార్టీ ఈసారి కూడా ఆయననే బరిలోకి దింపింది. సందీప్ తొలిసారిగా లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. సందీప్ 2020 అసెంబ్లీ ఎన్నికల్లో పాలిగంజ్ స్థానం నుండి పోటీ చేసి, విజయం సాధించారు. జేఎన్‌యూలో పీహెచ్‌డీ చేసిన సందీప్ 2013లో విద్యార్థిసంఘం ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 1996 నుంచి ఈ సీటు సమతా పార్టీ-జేడీయూ గుప్పిట్లో ఉంది. 2019లో జేడీయూ ఈ స్థానాన్ని రెండు లక్షల 56 వేల ఓట్లతో గెలుచుకుంది. జేఎన్‌యూ ఎస్ఎఫ్ఐ మాజీ అధ్యక్షురాలు దీప్సితా ధర్ పశ్చిమ బెంగాల్‌లోని సెరంపూర్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు.

ఈ సీటు తృణమూల్ కాంగ్రెస్‌కు కంచుకోటగా పేరొందింది. కల్యాణ్ బెనర్జీ ఇక్కడ ఎంపీగా ఉన్నారు. 2021లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ దీప్సిత పోటీ చేశారు. సీపీఎం ఆమెను బాలి స్థానం నుంచి అభ్యర్థిగా నిలబెట్టింది. అయితే ఆమె అక్కడ మూడో స్థానంలో నిలిచారు. ఇలా లోక్‌సభ ఎన్నికల బరిలో దిగిన ఈ ముగ్గురు పూర్వ విద్యార్థి నేతలు ఎంపీ స్థాయికి చేరుకుంటారో లేదో వేచిచూడాల్సిందే.

## అభ్యర్థుల ఖర్చుపై నిఘా!

- అసెంబ్లీకి రూ.40 లక్షలు
- లోక్‌సభకు రూ.95 లక్షలు

**విశాలాంధ్ర బ్యూరో–అమరావతి:** అభ్యర్థుల ఖర్చుపై నిఘా పెట్టారు. ఆంధ్రప్రదేశ్‌లో లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలకు నామినేషన్లు దాఖలు చేస్తున్న అభ్యర్థుల ఖర్చును తొలి రోజైన గురువారం నుంచే లెక్కింపు ప్రారంభించారు. అసెంబ్లీ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థి రూ.40 లక్షలు, ఎంపీ అభ్యర్థి రూ.95 లక్షల వరకు ఖర్చు చేయవచ్చు. వాటిని ఆయా అభ్యర్థుల ఖాతాలో నమోదు చేస్తారు. దినపత్రికల్లో వచ్చే పెయిడ్ న్యూస్, ప్రకటనలు, వార్తలను అభ్యర్థి ఖాతా కింద లెక్కిస్తారు. అభ్యర్థుల ఎన్నికల వ్యయానికిగాను ప్రత్యేకంగా బ్యాంకు ఖాతాను ప్రారంభించారు. ఈ ఖర్చును ఎప్పటికప్పుడు కేంద్ర ఎన్నికల సంఘం నియమించిన నోడల్ అధికారులు పర్యవేక్షిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా 175 అసెంబ్లీలు, 25 లోక్‌సభ స్థానాలకు నామినేషన్ల స్వీకరణకు అధికారులు శ్రీకారం చుట్టారు. ఎన్నికల సంఘం నిర్ధారించిన ఖర్చుల కంటే అసెంబ్లీ, లోక్‌సభ సభ్యులకు భారీగా పెరుగుతోంది. ఒక్కో అసెంబ్లీ అభ్యర్థికి జనరల్ స్థానాల్లో దాదాపు రూ.30 కోట్లకు పైగా, లోక్‌సభ అభ్యర్థికి రూ.200 కోట్ల వరకు ఖర్చు అంచనా ఉంది. దాని ఆధారంగా ప్రధాన రాజకీయ పార్టీలు అధిక శాతం కోటీశ్వర్లకే టికెట్లు కేటాయించాయి. దీంతో ఎన్నికల సంఘాలు నిర్ధారించిన ఖర్చుల కంటే అధికంగా పెరిగిపోనున్నాయి. వాటిని లెక్కల్లోకి రాకుండా అభ్యర్థులు జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. అసెంబ్లీ అభ్యర్థిగా నామినేషన్ వేసిన నాటి నుంచి ఎన్నికల వరకు డబ్బు, మద్యంతోనే ఎన్నికలు జరిగే పరిస్థితులున్నాయి. ఇప్పటి వరకు రాష్ట్రంలో రూ.100 కోట్లకుపైగా డబ్బు, మద్యం, ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ ఈ సంఖ్య మరింతగా పెరగనుంది.

### సీపీఐ ఎంపీ అభ్యర్థి 'జంగాల'

# రోడ్‌షోకు విశేష స్పందన

### మోదీ కుట్రలను ప్రతిఘటిస్తాం
### అజయ్‌కుమార్

**విశాలాంధ్ర–పెదకాకాని:** ఎన్నికల ప్రచారంలో భాగంగా గుంటూరు జిల్లా పెదకాకానిలో గురువారం ఇండియా కూటమి సీపీఐ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్ చేపట్టిన రోడ్ షోకు విశేష స్పందన లభించింది. అడుగడుగునా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ప్రచారంలో దూసుకుపోతున్నారు. మా మద్దతు మీకేనంటూ ప్రజలు హామీ ఇస్తున్నారు. జన సందోహాన్ని చూసి గెలుపుపై ధీమా ఏర్పడడంతో ఉత్సాహంగా ప్రజలను కలిసి ఓట్లను అభ్యర్థిస్తున్నారు. ఈ సందర్భంగా సీపీఐ పొన్నూరు నియోజకవర్గ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ మాట్లాడుతూ ఇండియా కూటమి (కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, ఆమ్ ఆద్మీ) బలపరిచిన గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్ ఎన్నికల గుర్తు కంకి కొడవలి, కాంగ్రెస్ పొన్నూరు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి జక్కా రవీంద్రనాథ్ హస్తం గుర్తులపై ఓట్లు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. అభ్యర్థి జంగాల మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ రెండోదఫా అధికారంలోకి వచ్చిన తరువాత కుల, మతాల మధ్య ఘర్షణలను ప్రోత్సహించిందని దుయ్యబట్టారు. దీంతో ముస్లిం, క్రైస్తవులకు రక్షణ కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. సీఏఏ, ఎన్ఆర్‌సీ లను మరోసారి తెరపైకి తెచ్చి దారుణానికి ఒడిగడుతోందని అన్నారు. దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో గర్వించదగిన పాత్ర పోషించిన ముస్లింలను లేకుండా చేయాలనే కుట్ర కేంద్రంలో మోదీ ప్రభుత్వం చేస్తుందని మండిపడ్డారు. దీనిని ప్రతిఘటించి తీరుతామని స్పష్టం చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీగా ముస్లిం మైనారిటీలు, క్రైస్తవులు, పేదల పక్షాన పోరాడుతామని అన్నారు. బీజేపీ మూడోసారి అధికారంలోకి వస్తే అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని కూడా మార్చివేసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసీపీ, ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న టీడీపీలు మోదీ అడుగులకు మడుగులు ఒత్తుతున్నాయని విమర్శించారు. ఆయా పార్టీలతో పాటు జనసేనకు ఓటు వేస్తే బీజేపీకి వేసినట్టేనన్నారు. ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని కోరారు. ముస్లిం మైనార్టీ వర్గాలకు అండగా ఉండే సీపీఐ కంకి కొడవలి గుర్తుకు ఓటు వేసి పార్లమెంట్‌కు పంపాలని, కాంగ్రెస్ అసెంబ్లీ అభ్యర్థి జక్కా రవీంద్రనాథ్‌కు హస్తం గుర్తుపై ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. అగ్రిగోల్డ్ బాధితుల గుంటూరు జిల్లా కార్యదర్శి కేతినేని అగస్టీన్, మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి రెంటాల కుమారి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేడా హనుమంతరావు, అధ్యక్షుడు ఆకిటి అరుణ్ కుమార్, ఏఐవైఎఫ్ రాష్ట్ర నేత సుభాని, జిల్లా కార్యదర్శి వలి, అధ్యక్షుడు జంగాల చైతన్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బందెల నాసర్ జీ, దర్శి లింగారావు, గోపి, సుబ్బారావు, ఆర్.శ్రీనివాసరావు, గంగా, సిహెచ్.విజయలక్ష్మి, ప్రియాంక పాల్గొన్నారు.

## జి.కోటేశ్వరరావు నామినేషన్ నేడు

- కేఎల్ రావు పార్క్ నుంచి కూటమి ర్యాలీ
- ప్రజలు స్వచ్ఛందంగా హాజరు కావాలని దోనేపూడి పిలుపు

**విశాలాంధ్ర–విజయవాడ(వన్‌టౌన్):** ఇండియా కూటమి బలపరిచిన విజయవాడ పశ్చిమ నియోజకవర్గ సీపీఐ అభ్యర్థి జి.కోటేశ్వరరావు శుక్రవారం ఉదయం నామినేషన్ దాఖలు చేయనున్నారు. స్థానిక లెనిన్ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ ఈ విషయం వెల్లడించారు. కాంగ్రెస్, సీపీఎం బలపరిచిన సీపీఐ అభ్యర్థి జి.కోటేశ్వరరావు నామినేషన్ కార్యక్రమానికి ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి ఆశీర్వదించాలని దోనేపూడి శంకర్ కోరారు. పేదలు, కార్మికులు, కర్షకులు, ఉద్యోగుల పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని, అన్ని వర్గాల ప్రజల కోసం పోరాటం సాగించే సీపీఐ అభ్యర్థి గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కోటేశ్వరరావు మాట్లాడుతూ నామినేషన్ సందర్భంగా శుక్రవారం ఉదయం 9 గంటలకు కేఎల్ రావు పార్క్ నుంచి ప్రదర్శన ప్రారంభమవుతుందని, కలరా హాస్పిటల్, చిట్టినగర్, తమ్మిన పోతరాజు రోడ్డు(టీపీ రోడ్డు), నెహ్రూ బొమ్మ సెంటర్, బ్రాహ్మణవీధి, రథం సెంటర్ వరకు ప్రదర్శన కొనసాగుతుందని వివరించారు. అక్కడి నుంచి పశ్చిమ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వెళ్లి నామినేషన్ దాఖలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణతో పాటు సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ పార్టీల రాష్ట్ర నాయకులు పాల్గొంటారని చెప్పారు. గతంలో పశ్చిమ నియోజకవర్గం నుంచి సీపీఐ, కాంగ్రెస్ అభ్యర్థులు తమ్మిన పోతరాజు, మరుపిళ్ల చిట్టి, పోతిన చిన్నా, ఉప్పలపాటి రామచంద్రరాజు, కె.సుబ్బరాజు, షేక్ నాసర్‌వలి తదితరులు 11 సార్లు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారని, రాష్ట్రంలోని ఈ నియోజకవర్గానికి ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చారని తెలిపారు. కాంగ్రెస్, సీపీఐకి కంచుకోటగా ఉన్న పశ్చిమ నియోజకవర్గంలో మరోసారి సీపీఐ తరపున పోటీచేస్తున్న తనకు కంకి–కొడవలి గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు, కార్యదర్శివర్గ సభ్యులు పంచదార్ల దుర్గాంబ, మూలి సాంబశివరావు, తాడి పైడియ్య, కొట్టు రమణారావు తదితరులు పాల్గొన్నారు.

### సీపీఐ అనంతపురం అర్బన్ అభ్యర్థి

# జాఫర్‌కు బ్రహ్మరథం

### వాడవాడలా మద్దతు తెలుపుతున్న ప్రజానీకం

**విశాలాంధ్ర–అనంతపురం వైద్యం:** ఇండియా కూటమి బలపరిచిన సీపీఐ అనంతపురం అర్బన్ అసెంబ్లీ అభ్యర్థి సి.జాఫర్ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. పెద్ద ఎత్తున ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. ఏ మూలకెళ్లినా తమ మద్దతు జాఫర్‌కే అంటున్నారు. ఎన్నికల గుర్తు కంకి కొడవలికి అమూల్యమైన ఓట్లు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని గురువారం స్థానిక రెండో డివిజన్లో సీపీఐ అభ్యర్థి జాఫర్ ప్రచారం నిర్వహించారు. ప్రతి ఒక్కరిని కలిసి కాంగ్రెస్ పార్టీలో పొందుపరిచిన మేనిఫెస్టో వివరాలను తెలియజేస్తూ ఓట్లు అభ్యర్థించారు. చట్టసభలకు పంపి అసెంబ్లీలో ప్రజాసమస్యలపై గళమెత్తి పరిష్కరించే అవకాశం కల్పించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు దాదా గాంధీ, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి, సీపీఐ నగర కార్యదర్శి శ్రీరాములు, సహాయ కార్యదర్శి రమణయ్య, అలిపిర, లింగమయ్య, సంతోశ్ కుమార్, రాజేశ్, కె.కృష్ణుడు, రజాక్, చాంద్ బాష, వెల్లుట్ల నారాయణస్వామి, గాది లింగప్ప, బిందెల నారాయణస్వామి, జానకి, ఖాజా, శ్రీనివాసులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కుల్లాయిస్వామి, కల్పనా జోషి–సీపీఐ, కాలనీ కార్యదర్శి ప్రసాద్, సీపీఐ జిల్లా సమితి సభ్యురాలు జయలక్ష్మి, ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి ఉమా మహేశ్, జిల్లా ఉపాధ్యక్షులు వంశీ, హరి, సమీర్, విశ్వ, వెంకటేశ్, సీపీఐ, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు ప్రచారంలో భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# మౌలిక వసతులకు ప్రాధాన్యం

### సీపీఐ తిరుపతి అభ్యర్థి మురళి

**విశాలాంధ్ర–తిరుపతి:** నియోజకవర్గంలో మౌలిక సౌకర్యాలకల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తానని ఇండియా కూటమి బలపరిచిన సీపీఐ తిరుపతి అసెంబ్లీ అభ్యర్థి పి.మురళి అన్నారు. ఓట్లు అభ్యర్థిస్తూ ప్రగతినగర్, లెనిన్‌నగర్, గరుడాద్రినగర్, కైకాల చెరువు ప్రాంతంలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీపీఐ కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. తనకు ఓట్లు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని మురళి కోరారు. స్థానిక ప్రజలు, ఆయా కాలనీల కమిటీ నాయకులు పెద్దఎత్తున ఆయన వెంట నడిచారు. ప్రజల ఆదరణ అభిమానం ఆశీర్వాదం ఎన్నటికీ మరచిపోలేని మధురానుభూతి ఇస్తుందని అన్నారు. మా తోటి కార్మికుడు నేడు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయడం శుభ పరిణామం అని, బూర్జువా పార్టీలకు, కమ్యూనిస్టు పార్టీకి ఉన్న తేడా అదే అని ఆటో సంఘాల నేతలు అన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామానాయుడు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాధాకృష్ణ సీపీఐ నగర కార్యదర్శి విశ్వనాథం మాట్లాడుతూ తిరుపతి ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తుందని, ప్రజల దీవెనలు ఆశీస్సులు మురళికి మెండుగా ఉన్నాయని పేర్కొన్నారు. తిరుపతిలో రౌడీలు, గుండాలు లంచగొండులకు వ్యతిరేకంగా పోరాటాలు సాగిస్తున్నది, టీటీడీ ఉద్యోగులకు కనీస వేతనాల కోసం ఉద్యమిస్తున్నదీ కమ్యూనిస్టులే అన్నారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు జనార్ధన్, జిల్లా కార్యవర్గ సభ్యుడు పెంచలయ్య, బండి చలపతి, ప్రజా సంఘాల నాయకుడు ఎన్.డి. రవి, సిహెచ్ .శివకుమార్, ఎన్.శివ, కేవై రాజా శ్రీరాములు, శ్రీనివాసులు, అల్లా బక్ష్, వెంకటేశ్, ప్రమీల, సత్య, వెంకటేశ్, పద్మనాభ రెడ్డి, గోవిందస్వామి, రామకృష్ణ, రామచంద్రయ్య రజినీకాంత్, దాము కార్తీక్, కాలయ్య, ప్రవీణ్, ఓం రాజ్ బాబు, నాగరాజు, మంజుల, విజయమ్మ, హారిక, జయరాం పాల్గొన్నారు.

## గెలుపుపై రామచంద్రయ్య దీమా

### అన్ని వర్గాల ప్రజామద్దతుతో ప్రచారంలో దూకుడు

**విశాలాంధ్ర–పత్తికొండ:** ఇండియా కూటమి బలపరిచిన సీపీఐ పత్తికొండ అసెంబ్లీ అభ్యర్థి పి.రామచంద్రయ్య ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజలతో మమేకమౌతున్నారు. నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో మద్దతు తెలుపుతుండడంతో గెలుపుపై దీమా వ్యక్తం చేస్తున్నారు. రెండోరోజు గురువారం ఉపాధి హామీ కూలీలను కలుసుకుని ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా రామచంద్రయ్య మాట్లాడుతూ, బీజేపీకి తొత్తుగా మారిన టీడీపీ, వైసీపీలకు ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. పత్తికొండ నియోజకవర్గాన్ని ఏమాత్రం అభివృద్ధి చేయలేదన్నారు. గత 40 సంవత్సరా లుగా నియోజకవర్గ అభివృద్ధికి సీపీఐ ఆధ్వర్యంలో అనేక ప్రజా ఉద్యమాలు చేసినట్టు గుర్తు చేశారు. ఉద్యమాల ఫలితంగానే నేడు పత్తికొండకు హంద్రీనీవా ప్రాజెక్టు రావడం జరిగిందన్నారు. రాయలసీమకు కృష్ణా జలాలు మళ్లించాలని, ఈ ప్రాంత పంట పొలాలకు సాగునీరు అందించాలని, 106 చెరువులకు నీళ్లు నింపాలని డిమాండ్ చేశారు. కంకి కొడవలి గుర్తుపై ఓటేసి తనకు విజయం చేకూర్చాలని కోరారు. కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి రాం పుల్లయ్య యాదవ్ హస్తం గుర్తుకు తమ అమూల్యమైన ఓటు వేసి నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పాటు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సీపీఐ మండల కార్యదర్శి డి.రాజా సాహెబ్, పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, రవికుమార్, హనుమంతు, అబ్బాస్, సుధాకర్ పాల్గొన్నారు.

## ఓటుకు నోటు కేసు విచారణ వాయిదా

**న్యూఢిల్లీ:** మళ్లీ వాయిదాలు ఇవ్వం.. ఇదే చివరి అవకాశం అని ఓటుకు నోటు కేసు విచారణలో టీడీపీ అధినేత చంద్రబాబుకు, తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కేసు ప్రారంభం కాగానే విచారణ వాయిదా వేయాలని చంద్రబాబు, తెలంగాణ ప్రభుత్వ న్యాయవాదులు కోరడంతో కేసు విచారణ జులై 24కి కోర్టు వాయిదా వేసింది. ఈ కేసులో వాదనలు వినిపించేందుకు తగిన సమయం కావాలని తెలంగాణ తరఫు న్యాయవాది కోరగా... సెలవుల తర్వాత విచారణ జరపాలని చంద్రబాబు తరఫు న్యాయవాది కోరారు. ఈ కేసులో చంద్రబాబును నిందితుడిగా చేర్చాలని, దర్యాప్తు సీబీఐకి అప్పగించాలని పిటిషన్ దాఖలైంది. చార్జిషీట్‌లో చంద్రబాబు పేరును 22 సార్లు ఏసీబీ ప్రస్తావించింది. అయినా చంద్రబాబు పేరు నిందితుడిగా తెలంగాణ ఏసీబీ చేర్చకపోవడాన్ని ప్రశ్నిస్తూ వైసీపీ ఎమ్మెల్యే ఆళ్ల రామ కృష్ణారెడ్డి వేసిన పిటిషన్‌పై జస్టిస్ సుందరేశ్, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి ధర్మాసనం విచారణ జరిపింది. 2015లో తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల్లో డబ్బు ఎర చూపి ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు చంద్రబాబు ప్రయత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారాన్ని తెలంగాణ ఏసీబీ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంది. ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్‌ను టీడీపీ అభ్యర్థికి ఓటు వేయాలని చంద్రబాబు ప్రలోభ పెట్టినట్లు ఫోన్లో మాట్లాడిన ఆడియోను ఏసీబీ బయటపెట్టింది.

**చంద్రబాబుకు శిక్ష తప్పదు: ఎమ్మెల్యే ఆర్కే**

కేసు విచారణ అనంతరం ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు, రేవంత్‌రెడ్డి మరోసారి కుమ్మక్కయ్యారని మండిపడ్డారు. కేసు వాయిదా వేయాలని తెలంగాణ ప్రభుత్వం కోరిందని, ఇదే చివరి అవకాశమని, మళ్లీ వాయిదాలు ఇచ్చేదిలేదంటూ సుప్రీంకోర్టు జులై 24కు కేసు వాయిదా వేసిందని వివరించారు. ఒక ఓటుకు ఐదు కోట్లు బేరం పెట్టుకున్న చంద్రబాబు ఆడియో బయటపడిందన్నారు. స్టీఫెన్‌సన్‌కు రూ.50 లక్షలు ఇస్తూ రేవంత్‌రెడ్డి పట్టుబడ్డారు. ప్రపంచమంతా చూస్తుండగానే డబ్బు ఇచ్చారు. అన్ని సాక్ష్యాలు ఉన్నా ఈ కేసు ముందుకు సాగకపోవడానికి కారణం వ్యవస్థలను మేనేజ్ చేయడమేనని ఆర్కే ఆరోపించారు. ఏడేళ్ల నుంచి కేసు ముందుకు నడవకుండా రకరకాల కారణాలతో సాగదీస్తున్నారని, సుప్రీంకోర్టు ఇదే చివరి అవకాశమని స్పష్టం చేసిందని తెలిపారు. రాబోయే రోజుల్లో చంద్రబాబుకు ఈ కేసులో శిక్ష తప్పదని ఆర్కే చెప్పారు.

# సర్వం సిద్ధం

**న్యూఢిల్లీ:** సార్వత్రిక ఎన్నికల తొలిదశ పోలింగ్ శుక్రవారం ప్రారంభం కానుంది. అందుకు కేంద్ర ఎన్నికల సంఘం సర్వం సిద్ధం చేసినట్లు ప్రకటించింది. ఈ తొలి దశ పోలింగ్‌లో 16.63 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారని తెలిపింది. అందులో 8.4 కోట్ల మంది పురుషులు కాగా, 8.23 కోట్ల మంది స్త్రీలు ఉన్నారని వివరించింది. అయితే 35.67 లక్షల మంది తొలిసారి తమ ఓటు హక్కు వినియోగించనున్నారని పేర్కొంది. ఈ దశలో మొత్తం 1.87 లక్షల పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది. తొలిదశలో పోలింగ్ ప్రక్రియ కోసం 18 లక్షల మంది సిబ్బంది సేవలు వినియోగించుకొంటు న్నట్లు తెలిపింది. ఈ దశలో మొత్తం 102 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరుగుతుందని పేర్కొంది. 1,625 మంది అభ్యర్థులు బరిలో నిలిచినట్లు స్పష్టం చేసింది. వారిలో 1,491 మంది పురుషులు కాగా 134 మంది మహిళలు ఉన్నట్లు వివరించింది. ఎన్నికల పోలింగ్ నిర్వహణ కోసం 41 హెలికాప్టర్లు, 8 ప్రత్యేక రైళ్లు, సుమారు లక్ష వాహనాలు వినియోగిస్తున్నట్లు తెలిపింది. తొలి దశ ఎన్నికలు శాంతియుతంగా, సజావుగా నిర్వహించేం దుకు షటిష్టమైన భద్రత చర్యలు చేపట్టినట్లు వివరించింది. అందుకోసం కేంద్ర బలగాలను మోహరిస్తున్నట్లు స్పష్టం చేసింది. 50 శాతం కంటే అధికంగా పోలింగ్ స్టేషన్లలో వెబ్‌కాస్టింగ్ చేయడంతోపాటు అన్ని పోలింగ్ కేంద్రాలలో మైక్రో అబ్జర్వర్లను నియామించినట్లు తెలిపింది. ఈ దశ పోలింగ్ కోసం మొత్తం 361 పరిశీలకులను నియమించామని చెప్పింది. 127 మంది సాధారణ పరిశీలకులు, 67 మంది పోలీసు పరిశీలకులు, 167 మంది వ్యయ పరిశీలకులను నియమించినట్లు ఈసీ ప్రకటిం చింది. 4,627 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 5,208 స్టాటిస్టిక్స్ సర్వైలెన్స్ టీమ్‌లు, 2,028 వీడియో సర్వైలెన్స్ టీమ్‌లు, 1,255 వీడియో వ్యూయింగ్ టీమ్‌లు ఏర్పాటు చేసినట్లు ఈసీ వివరించింది. ఓటర్లను ప్రభావితం చేసే చర్యలను కఠినంగా నియంత్రిస్తున్నట్లు ప్రకటించింది. ఆ క్రమంలో వేగంగా స్పందించేందుకు 24 గంటలూ ఈ బృందాలు నిఘా ఉంచుతాయని తెలిపింది. 1,374 అంతర్ రాష్ట్ర, 162 అంతర్జాతీయ సరిహద్దు చెక్‌పోస్ట్‌ల వద్ద తనిఖీల కోసం ప్రత్యేక బృందాలను నియమించామని వివరించింది. మద్యం, మాదకద్రవ్యాలు, నగదు, ఉచితాల అక్రమ ప్రవాహ నివారణ కోసమే ఈ భద్రత చర్యలు చేపట్టినట్లు ఈసీ వివరించింది. సముద్ర, వాయు మార్గాలపైనా గట్టి నిఘా ఉంచామని తెలిపింది. 85 ఏళ్లు దాటిన 14.14 లక్షల మంది వృద్ధులు, 13.89 లక్షల మంది వికలాంగులు... వారికి సౌకర్యం ఉన్న చోట ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఎన్నికల సంఘం తెలిపింది. 102 లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో అయిదువేలకుపైగా పోలింగ్ కేంద్రాల్లో పూర్తిగా మహిళా అధికారులే విధులు నిర్వహిస్తున్నట్లు చెప్పింది. సుమారు వెయ్యి పోలింగ్ కేంద్రాలను వికలాంగులు నిర్వహించనున్నట్లు వెల్లడించింది. తొలి దశలో 102 లోక్‌సభా నియోజకవర్గాలతో పాటు అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం రాష్ట్రాల్లోని 92 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయని తెలిపింది. 102 లోక్‌సభ స్థానాల్లో 73 జనరల్, 11 ఎస్టీ, 18 ఎస్సీ నియోజకవర్గాలు ఉన్నాయని ఎన్నికల సంఘం వివరించింది.

## నాలుగో దశ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల

**న్యూఢిల్లీ:** నాలుగో దశ సార్వత్రిక ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడింది. ఏపీ, ఒడిశా, అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం అసెంబ్లీలు సహా 10 రాష్ట్రాల్లో లోక్‌సభ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం గురువారం నోటిఫికేషన్ జారీ చేసింది. నాలుగో విడతలో లోక్‌సభ ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, బీహార్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, జమ్మూకశ్మీర్ ఉన్నాయి. వీటిలో మొత్తం 96 లోక్‌సభ స్థానాల్లో నాలుగో దశలో ఎన్నికలు జరగనున్నాయి. నోటిఫికేషన్ విడుదల కావడంతో ఏపీ, తెలంగాణ సహా ఆయా రాష్ట్రాల్లో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. దీనికి సంబంధించి అన్ని ఏర్పాట్లు ఇప్పటికే పూర్తయ్యాయి. ఈనెల 25 వరకు నామినేషన్ల స్వీకరణ చేపట్టి... 26న పరిశీలించనున్నారు. 29 వరకు ఉపసంహరణకు గడువు విధించారు. మే 13న ఎన్నికల పోలింగ్ జరగనుంది. జూన్ 4న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడించనున్నారు. లోక్‌సభ స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులు కలెక్టరేట్లలో, అసెంబ్లీ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులు ఆయా నియోజకవర్గాల ప్రధాన కేంద్రాల్లో నామినేషన్ పత్రాలు సమర్పించాలి. లోక్‌సభ అభ్యర్థి రూ.25 వేలు, శాసనసభ అభ్యర్థి రూ.10 వేలు ధరావతు చెల్లించాల్సి ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఇందులో 50 శాతం చెల్లిస్తే సరిపోతుంది.

నామినేషన్ల దాఖలుకు అభ్యరుఎథలు తీసుకోవలసిన జాగ్రత్తలు, పాటించాల్సిన నిబంధనలు ఏమిటంటే...నామినేషన్ల దాఖలుకు 13 రకాల డాక్యుమెంట్లు తీసుకురావాలి. అన్ని డాక్యుమెంట్లు సక్రమంగా ఉన్న నామినేషన్లనే అనుమతిస్తారు. పార్లమెంటరీ నియోజకవర్గం కోసం ఫారం–2ఏ, అసెంబ్లీ నియోజకవర్గం కోసం ఫారం–2బి సమర్పించాలి. నోటిఫైడ్ తేదీలలో ఉదయం 11.00 నుండి మధ్యాహ్నం 3.00 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. ప్రభుత్వ సెలవు దినాలలో నామినేషన్ల స్వీకరణ ఉండదు. ఒక అభ్యర్థి గరిష్టంగా 4 సెట్ల నామినేషన్లు దాఖలు చేయవచ్చు. 2 కంటే ఎక్కువ నియోజకవర్గాల నుండి అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయడం కుదరదు. అభ్యర్థి నామినేషన్ వేసేటప్పుడు దరఖాస్తును పూర్తిగా పూరించారా లేదా సరి చూసుకోవాలి. అఫిడవిట్ ప్రతి పేజీపైన అభ్యర్థి విధిగా సంతకం చేయాలి. పార్లమెంట్ నియోజకవర్గ పోటీకి జనరల్ అభ్యర్థి సెక్యూరిటీ డిపాజిట్‌గా 25 వేల రూపాయలు, అదే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు అయితే కుల ధృవీకరణ పత్రం సమర్పిస్తూ 12,500 సెక్యూరిటీ డిపాజిట్ చెల్లిస్తే సరిపోతుంది. అసెంబ్లీ నియోజకవర్గ పోటీకి జనరల్ అభ్యర్థి రూ.10 వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.5 వేలు డిపాజిట్ చేయాలి. మూడు నెలల లోపల తీసుకున్న 2.5 సెంమీ సైజుతో గల మూడు కలర్ ఫొటోలు సమర్పించాలి. ఇతర నియోజకవర్గాలకు సంబంధించిన అభ్యర్థులు అయితే ఎన్నికల జాబితా సర్టిఫైడ్ కాపీ సమర్పించాలి. ఇంక్‌తో సంతకం చేసిన ఫారం ఏ, బీని రిటర్నింగ్ అధికారికి సమర్పించాలి. జిరాక్స్ కాపీలు అనుమతించరు.

అభ్యర్థి ఎన్నికల వ్యయ పరిశీలన కోసం నూతనంగా ఏదేని బ్యాంకు/కోఆపరేటీవ్ బ్యాంకు/పోస్టాఫీసులో తాను తెరిచిన ప్రత్యేక బ్యాంక్ ఖాతా వివరాలు సమర్పించాలి. బ్యాలెట్ పేపర్‌లో తన పేరు తెలుగు, ఇంగ్లీషు భాషల్లో ఏ విధంగా ప్రచురించాలో తెలియజేయాలి.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.

# సమరాంగణం 2024

## బీహార్‌లో ఏక కులాధిపత్యం

### 2009 నుంచి 17 లోక్‌సభ స్థానాలు వారివే

బీహార్‌లో ఏక కులాధిపత్యం కొనసాగుతోంది. 2009 నుంచి మొత్తం 40కుగాను 17 లోక్‌సభ స్థానాలు ఈ కులం పరిధిలోనే ఉన్నాయి. వీటిలో ఎనిమిది స్థానాల్లో రాజ్‌పుట్‌లు, భూమిహార్లు, బ్రాహ్మణులు, కయాస్థ కులస్తులు సత్తా చాటుతున్నారు. జనాభాలో 14శాతంగా ఉన్న ఓబీసీ యాదవ్‌లు మూడు స్థానాల్లో వరుసగా మూడుసార్లు గెలిచారు. మహారాజ్‌గంజ్, వైశాలీ, ఔరంగాబాద్, అర్రా స్థానాల్లో రాజ్‌పుట్‌లు ఎన్నికయ్యారు. మహారాజ్‌గంజ్‌లో ఆర్జేడీ నేత ఉమా శంకర్ సింగ్ 2009లో విజయం సాధించగా బీజేపీ నేత జనార్థన్ సింగ్ సిరిగ్వాల్ 2014, 2019లో గెలిచారు. తాజా ఎన్నికల్లోనూ ఆయన పోటీ చేస్తున్నారు. మూడోసారి విజయానికి సిద్ధమయ్యారు.

వైశాలీ స్థానంలో ఆర్జేడీకి చెందిన రఘువంశ్ ప్రసాద్ సింగ్ 2009లో గెలిచారు. బీజేపీ మిత్రపక్షం ఎల్‌జేపీకి చెందిన రామకిశోర్ సింగ్, వీణా దేవి 2014, 2019 ఎన్నికల్లో ఎన్నికయ్యారు. దేవి... ఎన్డీయే అభ్యర్థిగానే మరోమారు బరిలో నిలిచారు.

అర్రా స్థానాన్ని జేడీయూ నేత మీనా సింగ్ 2009లో గెలుచుకున్నారు. 2014లో బీజేపీ తరఫున పోటీ చేసిన ఆర్కే సింగ్ గెలిచారు. మూడోసారి పోటీకి సిద్ధమయ్యారు.

ఔరంగాబాద్ స్థానం...బీహార్-చిత్తోర్ఘర్ (పూర్వం రాజస్థాన్‌లోని రాజ్‌పుట్)గా ప్రాచుర్యం పొందినది. ప్రముఖ రాజ్‌పుట్ నేత, బీహార్ మాజీ సీఎం సత్యేంద్ర నారాయణ్ సిన్హా ఈ స్థానంలో గెలుస్తూ వచ్చారు. 1952, 1971, 1977, 1980, 1984 ఎన్నికల్లో సిన్హా విజయం సాధించారు. ఆయన కోడలు శ్యామా సిన్హా 1999లో గెలిస్తే, కుమారుడు, ఢిల్లీ పోలీసు మాజీ కమిషనర్ నిఖిల్ కుమార్ 2004లో ఎన్నికయ్యారు. 2009 నుంచి ఔరంగాబాద్‌కు సుశీల్ సింగ్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

నవాడా, ముంగేర్ స్థానాలను భూమిహార్ కులస్తులు మూడుసార్లు గెలుచుకున్నారు. 2009లో నవాడా నుంచి బీజేపీ నేత భోలా సింగ్ ఎన్నిక కాగా 2014లో బీజేపీ నేత గిరిరాజ్ సింగ్, 2019లో ఎల్‌జేపీ నేత చందన్ సింగ్ ఎన్నికయ్యారు. తాజా ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థిగా బీజేపీకి చెందిన భూమిహార్ నాయకుడు వివేక్ ఠాకూర్ పోటీ చేస్తున్నారు. ముంగేర్ స్థానం నుంచి జేడీయూ నేత లల్లన్ సింగ్ 2009లో గెలవగా 2014లో వీణా దేవి (ఎల్‌జీపీ), 2019లో లల్లన్ సింగ్ (జేడీయూ) గెలిచారు. సింగ్ ఈసారి ఎన్డీయే అభ్యర్థిగా మరోమారు బరిలో నిలిచారు.

దర్భంగా స్థానంలో బీజేపీకి చెందిన బ్రాహ్మణ అభ్యర్థులు గత మూడు ఎన్నికల్లో గెలిచారు. 2009, 2014లో కీర్తి ఆజాద్, 2019లో గోపాల్‌జీ ఠాకూర్ ఎన్నికయ్యారు. ఇదే స్థానం నుంచి ఠాకూర్ మళ్లీ పోటీ చేస్తున్నారు. పాట్నా సాహెబ్‌లో అగ్రవర్ణమైన కయాస్థ వర్గ ఆధిపత్యముంది. గతంలో బీజేపీ తరఫున పోటీ చేసిన శత్రుఘ్న సిన్హా 2009, 2014లో గెలిచారు. కేంద్ర మాజీ మంత్రి, ప్రస్తుత అభ్యర్థి రవి శంకర్ ప్రసాద్ 2019లో గెలిచారు. కులానికి ఉన్న బలాన్నిబట్టి నియోజకవర్గాల ఎంపిక సహజమేనని జేడీయూ సీనియర్ నేత అన్నారు. రాష్ట్ర జనాభాలో 11శాతంగా ఉన్నప్పటికీ ఎనిమిది స్థానాల్లో అగ్రవర్ణాల ఆధిపత్యం కొనసాగుతున్నట్లు తెలిపారు.

17కుగాను తొమ్మిది స్థానాల్లో 2009 నుంచి ఒకటే కులం 'ఓబీసీ యాదవ్'లు గెలుస్తున్నారు. రాష్ట్రంలోని ఏకైక అతిపెద్ద కులంగా ఓబీసీ యాదవ్‌లు ఉన్నారని తాజా కులగణనతో తేలింది. రాష్ట్ర జనాభాలో 14శాతంగా ఓబీసీ యాదవ్ కులస్తులు ఉన్నారని తేలింది. 2009లో మాధేపురాలో జేడీయూ నేత శరద్ యాదవ్, 2014లో ఆర్జేడీ నేత పప్పూ యాదవ్ గెలిచారు. పప్పూ యాదవ్ ఆ తర్వాత జేడీయూలో చేరారు. 2019లో జేడీయూ తరఫున దినేశ్ చంద్ర యాదవ్ పోటీ చేసి గెలిచారు. మాధేపురాలో ఎన్నికల ప్రచారం వేళ 'రోమ్ పోప్‌ది... మాధేపురా యాదవులది' అన్న నినాదం విరివిగా వినిపిస్తుంది. గతంలో ఈ స్థానం నుంచి యాదవ్‌లు ఎన్నికయ్యారు. మాజీ సీఎంలు బీపీ మండల్, లాలూ ప్రసాద్ ప్రాతినిధ్యం వహించారు.

మధుబని స్థానం నుంచి 2009లో, 2014లో బీజేపీ నేత హుకుమ్‌దేవ్ నారాయణ యాదవ్ గెలిచారు. ఆయన కుమారుడు అశోక్ 2019లో ఎన్నికయ్యారు. అశోక్ బీజేపీ తరఫున మళ్లీ పోటీ చేస్తున్నారు. పాటలీపుత్ర స్థానం నుంచి 2009లో జేడీయూ నేత రంజన్ యాదవ్ గెలిచారు. ఆయన లాలూ యాదవ్‌ను ఓడించారు. 2014, 2019లో లాలూ పెద్ద కుమార్తె మిసా భారతిపై బీజేపీ నేత రామ్ క్రిపాల్ యాదవ్ పోటీ చేసి గెలిచారు.

నలందా స్థానంలో కుర్మీ వర్గానికి ఆధిపత్యం ఉంటుంది. 2004లో జేడీ(యూ) అధినేత, బీహార్ సీఎం నితీశ్ కుమార్ ఈ స్థానం నుంచి గెలిచారు. అప్పటి నుంచి పార్టీకి చెందిన కౌశలకుమార్ వరుసగా మూడుసార్లు ఎన్నికయ్యారు. ఇప్పుడు కూడా ఆయన బరిలో ఉన్నారు.

కరాకత్ స్థానంలో ఓబీసీ కొయిరిస్ లేదా కుశ్వాహా కులస్తులు 2009 నుంచి గెలుస్తున్నారు. 2009, 2019లో జేడీయూ నేత మహాబలి సింగ్ గెలవగా రాష్ట్రీయ లోక్ మోర్చా అధినేత ఉపేంద్ర కుష్వాహా 2014లో గెలిచారు. అప్పట్లో ఆయన రాష్ట్రీయ లోక్ సమతా పార్టీ తరఫున నాడు పోటీ చేశారు. తాజా ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థిగా పోటీలో ఉన్నారు.

వెస్ట్ చంపారన్‌లో 2009 నుంచి ఓబీసీ జైశ్వాల్ ఉప కులం బనియా లేక వైశ్యాల ఆధిపత్యం ఉంది. బీజేపీకి చెందిన సంజయ్ జైసింగ్ వరుసగా నాల్గోసారి పోటీకి సిద్ధమయ్యారు.

ముజఫర్‌పూర్‌లో ఈబీసీ మొహల్లాలుగా పిలిచే నిషాద్‌లదే ఆధితప్యం. 2009లో జేడీయూ కెప్టెన్ జై నారాయణ్ నిషాద్ గెలిచారు. 2014, 2019లో ఆయన తనయుడు, బీజేపీ అభ్యర్థి అజయ్ నిషాద్ ఎన్నికయ్యారు. బీజేపీ టికెట్ ఇవ్వకపోవడంతో అజయ్ నిషాద్ కాంగ్రెస్‌లో చేరారు. బీజేపీ తరఫున రాజ్ భూషణ్ నిషాద్ పోటీ చేస్తున్నారు. దీంతో ముజఫర్‌పూర్‌లో ప్రస్తుతం నిషాద్ వర్సెస్ నిషాద్ పరిస్థితి నెలకొంది.

ఇక ఎస్సీ అభ్యర్థుల విషయానికొస్తే 2009 నుంచి సమస్తిపూర్ రిజర్వుడ్ స్థానాన్ని పాశ్వాన్‌లు గెలుస్తూ వచ్చారు. జేడీయూ నేత మహేశ్వర్ హజారీ 2009లో గెలవగా ఎల్‌జేపీకి చెందిన రామచంద్ర పాశ్వాన్ (రాం విలాస్ పాశ్వాన్ చిన్న కుమారుడు) 2014, 2019లో గెలిచారు. రామచంద్ర మరణానంతరం ఆయన తనయుడు ప్రిన్స్ రాజ్ ఈ స్థానాన్ని గెలుచుకున్నారు. తాజా ఎన్నికల్లో ఎల్‌జేపీ అభ్యర్థిగా ఎస్సీ పాసీ.. శాంభవీ చౌదరి బరిలో నిలిచారు. ఈమె జేడీయూ మంత్రి అశోక్ కుమార్ చౌదరి తనయ కాగా రాష్ట్ర మంత్రి మహేశ్వర్ హజారీ తనయుడు, కాంగ్రెస్ నేత సన్నీ హజారీపై పోటీ చేయనున్నారు.

గయాలోని ఎస్సీ రిజర్వుడ్ స్థానంలో 2009 నుంచి 'మాంఝీ'లే విజేతలు. బీజేపీ నేత హరీ మాంఝీ 2009లో, 2014లో గెలిచారు. 2019లో జేడీయూ నేత విజయ్ కుమార్ మాంఝీ ఎన్నికయ్యారు. ఈసారి ఎన్డీయే తరఫున జితన్ రాం మాంఝీ బరిలో ఉన్నారు. ఈయన రాష్ట్ర మాజీ సీఎం, హిందుస్థానీ అవామ్ మోర్చా (సెక్యులర్) అధ్యక్షుడు.

కాగా, చాలా స్థానాల్లో ముస్లిం-యాదవ్ రాజకీయాలు లేవని, పరిస్థితి మారిందని ఆర్జేడీ అధికార ప్రతినిధి మృత్యుంజయ్ తివారీ అన్నారు. కొన్ని స్థానాల్లో పార్టీ అభ్యర్థి ఎంపిక వ్యూహాన్ని కులం ప్రభావితం చేస్తున్నదని బీజేపీ సీనియర్ నాయకుడు ఒకరు వెల్లడించారు.

## బస్తర్‌లో త్రిముఖ పోటీ

### సీపీఐ, కాంగ్రెస్, బీజేపీ హోరాహోరీ - పోలింగ్ నేడు

పూల్‌సింగ్ కంచ్లమ్

ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ పోలింగ్‌కు సిద్ధమైంది. ఈ స్థానంలో త్రిముఖ పోటీ నెలకొంది. సీపీఐ, కాంగ్రెస్, బీజేపీ మధ్య హోరాహోరీ పోరు సాగబోతోంది. తొలి దశలో భాగంగా ఈనెల 19న బస్తర్‌లో ఎన్నికలు జరగనుండటాన్ని బట్టి ఈ స్థానానికి ఉన్న వ్యూహాత్మ ప్రాధాన్యతను అర్థం చేసుకోవచ్చు. ఇది ఆదివాసీ ప్రాంతం. దీనికి సాంస్కృతిక చరిత్ర ఉన్నది. గిరిజనుల జీవనశైలి మిగతా వారి కంటే భిన్నంగా ఉంటుంది. భౌగోళికంగా, జనాభాపరంగా బస్తర్ వైవిధ్యంగా ఉంటుంది. జగదల్పూర్ నగరం, చిన్న మైనింగ్ టౌన్‌షిప్, తక్కువ జనాభాగల మారుమూల గ్రామాలు, మావోయిస్టు నియంత్రణ ప్రాంతాలతో బస్తర్‌కు తనదైన గుర్తింపు లభించింది. కాగా, బస్తర్ ఆస్థానాన్ని చివరిగా రాజు ప్రవీర్‌చంద్ర భంజోడియో పాలించారు. 1966లో ఆదివాసీలను పోలీసులపైకి రెచ్చగొట్టిన ఆరోపణలను ఎదుర్కొన్నారు. రాజకీయపరమైన కాల్పుల్లో చనిపోయారు. బస్తర్ బరిలో సీపీఐ తరఫున పూల్ సింగ్ కంచ్లమ్, కాంగ్రెస్ తరఫున కవాసీ లక్మా, బీజేపీ తరఫున మహేశ్ కశ్యప్ నిలిచారు. ఎవరికివారు ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. గెలుపుపై దీమాగా ఉన్నారు.

#### సీపీఐ అభ్యర్థికి జనాదరణ

బస్తర్ నుంచి భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) తరఫున పూల్‌సింగ్ కంచ్లమ్ పోటీ చేస్తున్నారు. ఆయన తనదైన శైలిలో ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. దంతెవాడ జిల్లా, ధుర్లి గ్రామంలో బుధవారం ప్రచార సభ జరిగింది. ఆయనకు జనాదరణ భారీగా లభించింది. కులం, మతం పేరిట రాజకీయ చేసే పార్టీకి బుద్ధి చెప్పాలని, తనను ఆదరించాలని ప్రజలను కోరుతున్నారు. స్థానిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకెళతానని హామీనిచ్చారు. ఐదవ షెడ్యూల్ పూర్తి స్థాయి అమలు, నీరు, అడవి, భూమి పరిరక్షణకు బస్తర్‌లో పీఈఎస్ఏ చట్టానికి వాగ్దానం చేశారు. సీపీఐ అభ్యర్థికి తన మద్దతు ఉంటుందని గిరిజన మహాసభ అధ్యక్షుడు, కోంటా మాజీ ఎమ్మెల్యే మనీశ్ కుంజమ్ ప్రకటించారు. పదేళ్లుగా గిరిజనులను కేంద్రప్రభుత్వం దోచుకుంటోందని విమర్శించారు. గిరిజనుల సంక్షేమానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఈసారి బస్తర్ ప్రజలు కచ్చితంగా సీపీఐ అభ్యర్థిని గెలిపిస్తారన్న నమ్మకం తనకున్నదని చెప్పారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బస్తర్ నియోజకవర్గాల్లో సీపీఐ అభ్యర్థులకు 10వేలకుపైగా ఓట్ల మెజారిటీ వచ్చిందని గుర్తుచేశారు. బ్రిటీష్ వారిపై జరిగిన భూంకల్ ఉద్యమంతో వామపక్షానికి ఇక్కడ ఆదరణ పెరిగింది.

#### రాజకీయ పండితుడు వర్సెస్ పామరుడు

బస్తర్‌లో కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. వీరి మధ్య పోటీ రాజకీయ పండితుడికి, పామరుడికి మధ్య పోరుగా మారింది. కాంగ్రెస్ తరఫున బస్తర్ లోక్‌సభ స్థానానికి 70ఏళ్ల కవాసీ లక్మా పోటీ చేస్తున్నారు. ఈయన కోంటా అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. తాజా ఎన్నికల్లోనూ ఘన విజయం సాధిస్తానని దీమా వ్యక్తంచేస్తున్నారు. ప్రాణాలున్నంత వరకు ఎమ్మెల్యేగా ఉంటా... మీరు నన్ను ఎంపీ చేస్తారా లేదా అని బస్తర్ ప్రజలను ఆయన జగ్‌దల్పూర్ సభలో ప్రశ్నించారు. బస్తార్ గళాన్ని దిల్లీలో వినిపిస్తానని ఉద్ఘాటించారు. గత నవంబరులో కాంగ్రెస్ మంత్రులు తొమ్మిది మంది ఓటమి పాలు కాగా లక్మా మాత్రం 1,981 ఓట్లతో గెలిచారు. బస్తర్ ఎన్నికలను నరేంద్ర మోదీకి కవాసీ లక్మాకు మధ్య జరిగే పోటీగా ఆయన చెబుతున్నారు. ప్రచారంలో భాగంగా అడవుల నరికివేత నుంచి రైల్వే సేవలు వరకు, రిజర్వేషన్ల నుంచి ఎన్నికల బాండ్ల వరకు అన్ని అంశాలను ప్రస్తావిస్తున్నారు. బీజాపూర్ వంటి ప్రాంతాల్లో ఆయన ప్రసంగాలు, విధానాలకు ఆదరణ ఉన్నది. రాజకీయాల్లో పండిపోయిన కవాసీ లక్మాపై పోటీకి రాజకీయ అనుభవంలేని మహేశ్ కశ్యప్‌ను బీజేపీ నిలబెట్టింది. కశ్యప్(49) మాజీ సర్పంచ్. విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్‌లో పనిచేశారు. మత మార్పిడికి వ్యతిరేకంగా చేసిన ప్రచారానికిగాను ఆయనను బీజేపీ అభ్యర్థిత్వం వరించినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

## పొత్తు ఉన్నా ఎవరి దారి వారిదే!

పశ్చిమ యూపీలో ఎన్నికల కోసం సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్ పొత్తు కుదుర్చుకున్నప్పటికీ, ప్రచారం చేపట్టే విషయంలో ఉభయ పార్టీల మధ్య సయోధ్య కనిపించడం లేదు. తొలి విడత లోక్‌సభ ఎన్నికల ప్రచారం బుధవారం సాయంత్రంతో ముగిసింది. అయితే ప్రచారం చివరి రోజున రెండు పార్టీలు ఉమ్మడి ర్యాలీకి హాజరుకాకపోవడం చర్చనీయాంశంగా మారింది. పశ్చిమ యూపీలో రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్‌ల తీరుకు భిన్నంగా బీజేపీ-ఆర్ఎల్‌డీల దోస్తీ పటిష్టంగా కొనసాగుతోంది. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, హోంమంత్రితో ఆర్ఎల్‌డీ చీఫ్ జయంత్ చౌదరి అనేక సార్లు సమావేశమయ్యారు. ఇదే సమయంలో ఎస్పీ, కాంగ్రెస్ అధిష్ఠానం విడివిడిగా తమ గొంతు వినిపించడం విచిత్రంగా మారింది. ఎస్పీతో పొత్తు ఉన్నప్పటికీ కాంగ్రెస్ మహిళా నేత ప్రియాంక గాంధీ విడిగా ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో రెండు పార్టీల మధ్య దూరానికి కారణమేమిటనే దానిపై అనేక విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లోని ఎనిమిది లోక్‌సభ స్థానాలకు ఏప్రిల్ 19న తొలి దశలో పోలింగ్ జరగనుంది. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ వివిధ లోక్‌సభ స్థానాలకు వెళ్లి తమ కూటమి అభ్యర్థిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అఖిలేశ్ యాదవ్ పిలిభిత్ నుంచి ముజఫర్ నగర్ వరకు బహిరంగ సభలు నిర్వహించారు. అయితే ముజఫర్‌నగర్‌కు సమీపంలో జరిగిన ప్రియాంక గాంధీ రోడ్ షోలో అఖిలేశ్ కనిపించలేదు. సహరాన్‌పూర్ లోక్‌సభ అభ్యర్థి ఇమ్రాన్ మసూద్‌కు మద్దతుగా ప్రియాంక గాంధీ రోడ్ షో నిర్వహించారు. ప్రచారం చివరి రోజున ఎస్పీ, కాంగ్రెస్ ఉమ్మడి ర్యాలీ నిర్వహించకపోవడానికి ప్రధాన కారణం ముస్లిం ఓటు బ్యాంకు అని రాజకీయ విశ్లేషకులు జ్ఞాన్ ప్రకాశ్ తెలిపారు. 2019 నాటి ఎస్పీ, బీఎస్పీ పొత్తును ఉదహరిస్తూ, అప్పట్లో ఆ రెండు పార్టీల అధినేతలు ఉమ్మడి ర్యాలీ నిర్వహించారన్నారు. అయితే నాడు కూటమి వల్ల బహుజన సమాజ్ పార్టీ ప్రయోజనం పొందిందని, ఎస్పీ ఎటువంటి ప్రత్యేక ప్రయోజనం పొందలేకపోయిందన్నారు. ఈ సారి ఎస్పీ-కాంగ్రెస్ కూటమి ఉమ్మడి ర్యాలీ నిర్వహించకపోవడానికి ఇదే కారణం కావచ్చన్నారు.

## ఎవరేమన్నారు?

ఎన్డీయే ఈసారి అధికారంలోకి వస్తే దేశ రాజధానిని నాగపూర్‌కు మార్చేస్తుంది. త్రివర్ణ పతాకాన్ని కూడా కాషాయ జెండాగా మర్చాలని చూస్తున్నారు. గుజరాత్ మోడల్ కంటే ద్రవిడ మోడల్ చాలా గొప్పది. మేం దాన్నే అనుసరిస్తాం.

\- కమల్ హాసన్

అవినీతి వర్సిటీకి చాన్సలర్ మోదీ. దేశంలో అత్యంత అవినీతిమయమైన పార్టీ బీజేపీయే. అవినీతి పేరుతో యూనివర్సిటీ పెడితే దానికి మోదీయే చాన్సలర్ అవుతారు. ఆ అర్హతలన్నీ ఆయనకే ఉన్నాయి.

\- తమిళనాడు సీఎం స్టాలిన్

## ఈసారీ ఓటేస్తా...

### 111ఏళ్ల కేరళ అవ్వ ఉత్సాహం

కాసర్‌గాడ్: ఎన్నికల పండుగ కోసం 111 ఏళ్ల కేరళ అవ్వ 'కుప్పూచీ' సిద్ధమయ్యారు. మరోసారి తన ఓటు హక్కును వినియోగించుకోవాలని ఉత్సాహంగా ఉన్నారు. కాసర్‌గాడ్‌లోని అత్యంత వృద్ధ ఓటరుగా కుప్పచ్చియమ్మ ఉన్నారు. అందరూ ప్రేమగా కుప్పూచీ అని పిలుస్తారు. 1957లో రాష్ట్ర అసెంబ్లీకి తొలిసారి జరిగిన ఎన్నికల్లోనూ ఆమె పాల్గొన్నారు. ఉదయాన్నే పోలింగ్ బూత్‌కు వెళ్లి ఓటు వేసే సంప్రదాయాన్ని అనేక సంవత్సరాలపాటు కుప్పూచీ కొనసాగించారు. అయితే వయస్సు మీద పడటంతో గత ఎన్నికలప్పుడు ఇంటి నుంచే ఓటు హక్కును వినియోగించుకున్నారు. తాజా ఎన్నికల్లోనూ ఆమె ఇంటి నుంచే ఓటు వేయనున్నారు. 'నేను మొదటిసారి ఓటు వేసేందుకు మా నాన్నతో కలిసి వెళ్లా' అని కప్పూచీ అన్నారు. పాత స్మృతులను నెమరవేసుకున్నారు. కేరళ తొలి ముఖ్యమంత్రి ఈఎంఎస్ నంబూద్రిపాద్‌ను అభిమానిస్తానని, కమ్యూనిస్టు సిద్ధాంతాలను ఆదరిస్తానని ఆమె చెప్పారు. తన పింఛన్ నుంచి సీపీఎం శాఖ కార్యాలయానికి విరాళం కూడా అందజేశారు. భూస్వాములపై 'హార్వెస్ట్ సత్యాగ్రహం' జరిగినప్పుడు కుప్పూచీ కుటుంబ సభ్యులు అందులో క్రియాశీల పాత్ర పోషించారు. ఆమె కుటుంబానికి పోరాట చరిత్ర ఉన్నది. ప్రజాస్వామ్య సిద్ధాంతాలను కుప్పూచీ బలంగా నమ్ముతారు. కుప్పూచీని 2022లో కేంద్ర ఎన్నికల సంఘం సన్మానించింది. 'కుప్పచ్చియమ్మ ఇప్పటివరకు జరిగిన ప్రతి లోక్‌సభ, అసెంబ్లీ, ఎల్ఎస్‌జీ ఎన్నికలలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఏ రోజు పోలింగ్‌కు గైర్హాజరు కాలేదు. ప్రస్తుతం వయస్సు మీద పడినప్పటికీ తన పనిని ఆమె చేసుకుంటారు. పక్కవారి నుంచి పెద్దగా సాయాన్ని తీసుకోరు. ఓటు హక్కును వినియోగాన్ని ప్రబోధిస్తారు' అని కప్పూచీ ఇంటి పక్కనుండే సురేంద్ర కొల్లుతువలప్ తెలిపారు.

సమరాంగణం 2024

# సిక్కోలులో ద్విముఖ పోరు

▸▸ వైసీపీ, టీడీపీ మధ్య హోరాహోరీ ▸▸ గెలుపుపై అభ్యర్థుల దీమా

పేరాడ తిలక్ (వైసీపీ)

కింజరాపు రామ్మోహన్ నాయుడు (టీడీపీ)

శ్రీకాకుళం జిల్లా పోరాటాల పురిటిగడ్డ. సువిశాల సముద్ర తీరం, అనంతమైన ప్రకృతి సంపద ఉన్నప్పటికీ వలస జిల్లాగా పేరు. శ్రీకాకుళం నుంచి ఎన్నికై కేంద్రమంత్రులు అయినవారున్నాగానీ ఈ జిల్లా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నదనే చెప్పాలి. నాయకులు రాజకీయంగా, ఆర్థికంగా ఎదిగారే తప్ప సిక్కోలు ప్రజల తలరాత మారలేదు. సిక్కోలు అభివృద్ధి కోసం గళం వినిపించేందుకు జిల్లా కేంద్రం పేరుతో 1952లో ఏర్పడ్డ శ్రీకాకుళం పార్లమెంటు స్థానానికి 18వసారి ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ఎన్నికల్లో ప్రధానంగా టీడీపీ, వైసీపీ మధ్య హోరాహోరీ పోరు సాగబోతోంది. టీడీపీ నుంచి సిట్టింగ్ ఎంపీ రామ్మోహన్ నాయుడు బరిలో ఉండగా, వైసీపీ నుంచి పేరాడ తిలక్ పోటీ చేస్తున్నారు. ఇద్దరు గెలుపుపై దీమాగా ఉన్నారు. హ్యాట్రిక్ విజయంపై నమ్మకంతో నాయుడు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. రెండుసార్లు ఎంపీగా గెలిచిన ఆయన జిల్లాకు చేసిందేమీ లేదు. వైసీపీ అమలు చేసిన సంక్షేమ పథకాలు తన గెలుపుకు సోపానాలు అవుతాయనే దీమాతో ఆ పార్టీ అభ్యర్థి పేరాడ తిలక్ ఉన్నారు.

**చరిత్ర...**

పార్లమెంటు చరిత్ర చూస్తే మొదటి సభ్యునిగా బొడ్డేపల్లి రాజగోపాలరావు ఎన్నికయ్యారు. ఈయన ఆరు సార్లు ఎన్నికయ్యారు. ఎన్జీ రంగ 1967- 71లో ప్రాతినిధ్యం వహించారు. హనుమంతు అప్పయ్య దొర ఒకసారి, కణితి విశ్వనాథం రెండు సార్లు, కింజరాపు ఎర్రన్నాయుడు నాలుగు సార్లు, కిల్లి కృపారాణి ఒకసారి, కింజరాపు రామ్మోహన్ నాయుడు గత రెండు సార్లుగా ప్రాతినిధ్యం వహించారు. ఇక్కడ కింజరాపు కుటుంబానికి వారసత్వంగా ఎంపీ స్థానంలో గెలుపొందిన చరిత్ర ఉంది. 1952 నుంచి మధ్యలో 1967- 71లో తప్ప 1996 వరకూ కళింగ సామాజిక వర్గం వారు ఎంపీలుగా రాణించారు. కింజరాపు ఎర్రన్నాయుడు 1996లో ఎంపీ అయ్యారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు జరిగిన ఏడు ఎన్నికల్లో ఒకసారి మాత్రమే కళింగ వర్గ అభ్యర్థి గెలిచారు. కళింగ సామాజిక వర్గం అభివృద్ధికి ఘనత బొడ్డేపల్లి రాజగోపాలరావుకు దక్కింది. మరెవరూ జిల్లాకుగానీ, తమ వర్గానికిగానీ పెద్దగా చేసినదేమీలేదు. 2014 ఎన్నికల్లో వైసీపీ, టీడీపీ మధ్య పోటీ ఉంది. ఎర్రన్నాయుడు మృతి తర్వాత రాజకీయాలలోకి వచ్చిన ఆయన తనయుడు కింజరాపు రామ్మోహన్ నాయుడు టీడీపీ నుంచి పోటీ చేయగా, వైసీపీ నుంచి రెడ్డి శాంతి పోటీ చేశారు. లక్షా 25 వేలకు పైగా ఓట్ల మెజార్టీతో టీడీపీ అభ్యర్థి గెలిచారు. 2019 ఎన్నికలలో టీడీపీ నుంచి సిట్టింగ్ ఎంపీ రామ్మోహన్ నాయుడు, వైసీపీ నుంచి దువ్వాడ శ్రీనివాసరావు మధ్య హోరాహోరీ సాగింది. శ్రీకాకుళం పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో నుంచి ఐదు స్థానాలలో వైసీపీ, రెండు చోట్ల టీడీపీ గెలిచాయి. అయితే ఎంపీగా టీడీపీ అభ్యర్థి గెలిచారు. వైసీపీ అభ్యర్థి దువ్వాడ మీద టీడీపీ అభ్యర్థి రామ్మోహన్ నాయుడు 6,653 ఓట్ల మెజారిటీతో గెలిచారు. వరుసగా రెండోసారి ఎంపీ అయ్యారు. భారీఎత్తున క్రాస్ ఓటింగ్ జరగడం ఒకెత్తయితే, కళింగ సామాజిక వర్గానికి చెందిన మెట్ట రామారావు జనసేన అభ్యర్థికి 25 వేలకు పైగా ఓట్లు పడటంతో అదే సామాజిక వర్గానికి చెందిన వైసీపీ అభ్యర్థి దువ్వాడకు నష్టం జరిగింది. కళింగ సామాజిక వర్గం ఓట్లు చీలిక టీడీపీ విజయానికి దోహదమయ్యాయన్నది రాజకీయ విశ్లేకుల అభిప్రాయం. కింజరాపు రామ్మోహన్ నాయుడు సామాజిక వర్గానికి చెందిన వైసీపీ నాయకులు క్రాస్ ఓటింగ్‌ను ప్రోత్సహించి టీడీపీ గెలుపుకు కారణమయ్యారనే వాదన కూడా ఉంది. రాజకీయాల్లో గెలుపోటములు సహజమే అయినా ఈసారి గెలుపు ఎవరన్నది ఆసక్తికరంగా మారింది.

**పార్టీల బలాబలాలు**

శ్రీకాకుళం పార్లమెంటు పరిధిలోని ఏడుకుగాను ఐదు అసెంబ్లీ ఐదు స్థానాలను గత ఎన్నికలప్పుడు వైసీపీ కైవసం చేసుకుంది. టీడీపీ రెండు స్థానాలతో సరిపెట్టుకుంది. వైసీపీ అంతర్గతంగా, నియోజకవర్గాలవారీగా నిర్వహించిన సర్వేలో పలాస, పాతపట్నం, శ్రీకాకుళం స్థానాల్లో బలంగా ఉందని, ఇచ్ఛాపురం, నరసన్నపేటలో రసవత్తర పోర సాగనున్నందని విశ్లేషణలు చెబుతున్నాయి. టెక్కలి, ఆమదాలవలసలలో తాము వెనుకపడినట్లు వైసీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఉత్తరాంధ్ర ప్రాంతీయ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి తమ పార్టీ అభ్యర్థులకు తెలిపినట్లు సమాచారం. ఈ విధంగా చూస్తే అసెంబ్లీ స్థానాల్లో టీడీపీ కంటే వైసీపీ కనీసం ఒక స్థానం ఎక్కువగా గెలిచే అవకాశాలున్నాయి. టీడీపీ విషయానికి వస్తే... పాతపట్నం, శ్రీకాకుళం అభ్యర్థుల ప్రకటన తర్వాత ఈ రెండు నియోజక వర్గాల్లో అసమ్మతి భగ్గుమన్నది. పాతపట్నం టికెట్ ఆశించి భంగపడ్డ కలమట వెంకట రమణ... నా బలం ఏమిటో టీడీపీకి చూపిస్తా అని బహిరంగంగానే సవాల్ విసిరారు. శ్రీకాకుళం నియోజకవర్గం టికెట్ ఆశించి భంగపడ్డ గుండ దంపతులు రాజకీయాలకు స్వస్తి పలుకుతున్నట్లు ప్రకటించారు. గుండ కుటుంబానికి టికెట్ రాకుండా అడ్డు పడింది కింజరాపు కుటుంబమే అని గుండ వర్గం ఆరోపించింది. దీంతో టీడీపీ ఓట్ల తగ్గే అవకాశం లేకపోలేదు. పాతపట్నం, శ్రీకాకుళం నియోజక వర్గాల్లో అసమ్మతి టీడీపీకి ఎంతో కొంత దెబ్బతీస్తుందనేది విశ్లేషకుల మాట. వైసీపీ మీద అసమ్మతితో ఆ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరిన కిల్లి కృపారాణి... టెక్కలి నుంచి పోటీకి దిగడం వైసీపీకి నష్టం కలిగిస్తుందని రాజకీయ విశ్లేకులు అంటున్నారు. గత ఎన్నికలప్పుడు క్రాస్ ఓటింగ్‌తో వైసీపీకి నష్టం జరిగిందని... దానిని కట్టడి చేయడంపైనే వైసీపీ విజయం ఆధారపడి ఉందన్నారు. టీడీపీలో అసమ్మతిని అధిష్టానం ఏ మేరకు నియంత్రిస్తుందనేదానిపై ఆ పార్టీ గెలుపు అవకాశాలు ఆధారపడి ఉంటాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.

- విశాలాంధ్ర బ్యూరో-శ్రీకాకుళం

# ఎమ్మిగనూరులో వైసీపీ, టీడీపీ ఢీ

బుట్టా రేణుక

బీవీ జయనాగేశ్వరరెడ్డి

కర్నూలు జిల్లా, ఎమ్మిగనూరు స్థానంలో రసవత్తర పోరు సాగబోతోంది. వైసీపీ-టీడీపీ అభ్యర్థుల మధ్య ప్రత్యక్షంగా పోటీ నెలకొంది. తమదే విజయమని ఇద్దరు అభ్యర్థులు దీమాగా ఉన్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి మద్దతుతో బుట్టా రేణుక గెలుపుకు ఢోకా ఉండదని వైసీపీ భావిస్తోంది. ఈసారి ఎన్నికల కోసం చెన్నకేశవరెడ్డిని కాదని బీసీ నేత, మాజీ ఎంపీ బుట్టారేణుకకు వైసీపీ టికెట్ ఇచ్చింది. ఎమ్మిగనూరులో చేనేతలు అధికంగా ఉండటం వల్ల బుట్టా రేణుకకు ఈ స్థానం ఇచ్చేలా ఆయనను పార్టీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి ఒప్పించారు. బుట్టా రేణుక ఎంపీగా ఉన్నప్పుడు స్థానికంగా చేనేతల కోసం జరిగే అన్ని కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేవారు. జగన్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు తనను గెలిపిస్తాయని ఆమె నమ్ముతున్నారు. మరోవైపు తెలుగుదేశం పార్టీ (టీడీపీ) అధినేత చంద్రబాబు నాయుడు ఈ స్థానం నుంచి మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరెడ్డిని పోటీలో నిలబెట్టారు. జయనాగేశ్వరరెడ్డి చురుకుగా ప్రచారం చేస్తూ సూపర్ సిక్స్ అంటూ ప్రజల్లోకి వెళుతున్నారు. వైసీపీ అధినేత ఇప్పటికే మేమంతా సిద్ధం పేరిట బస్సుయాత్రను సాగిస్తుండగా టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ప్రజాగళం పేరిట సభలు, ర్యాలీలతో హోరెత్తిస్తున్నారు. టీడీపీ సీనియర్ నేత, సినీనటుడు బాలకృష్ణ ఎమ్మిగనూరులో స్వర్ణాంధ్ర సాకారయాత్ర నిర్వహించారు. కాగా, ఎమ్మిగనూరు 1955లో నియోజకవర్గంగా ఏర్పడింది. అప్పటి నుంచి 16సార్లు ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్ ఎనిమిది సార్లు, టీడీపీ ఐదు సార్లు, వైసీపీ రెండుసార్లు చొప్పున గెలిచాయి. ఒకసారి మాత్రం స్వతంత్ర అభ్యర్థి విజయం సాధించారు. 1962లో మినహా టీడీపీ ఆవిర్భావం వరకు ఇక్కడ కాంగ్రెస్ హవా సాగింది. ఆ తరువాత ఎన్టీ రామారావుకు మిత్రుడు బీవీ మోహన్‌రెడ్డి టీడీపీ తరపున సత్తా చాటారు. 1983 ఉపఎన్నికలలో గెలిచారు. 1999 వరకు వరుస విజయాలు నమోదుచేశారు. రామారావు మంత్రివర్గంలో సుదీర్ఘకాలం మంత్రిగా పనిచేశారు. ఆపై 2004-09లో కాంగ్రెస్.... 2012 ఉప ఎన్నికలు, 2019 ఎన్నికల్లో వైసీపీ గాలి వీచింది. వైసీపీ తరపున ఎర్రకోట చెన్నకేశవరెడ్డి గెలిచారు. బీవీ మోహన్‌రెడ్డి తనయుడు బీవీ జయనాగేశ్వరరెడ్డి 2014 ఎన్నికల్లో పోటీ చేసి చెన్నకేశవరెడ్డిని ఓడించారు. 2019 ఎన్నికలలో చెన్నకేశరెడ్డి చేతితో ఆయన చిత్తు అయ్యారు. కాగా, ఎమ్మిగనూరు నుంచి గతంలో పోటీ చేసిన కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి, దామోదరం సంజీవయ్య ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రులుగా పనిచేశారు.

-విశాలాంధ్ర బ్యూరో- కర్నూలు

## ఎర్రజెండా పిలుస్తోంది

- బాబ్జీ

పల్లవి:

రండి కదలిరండి
ఎర్రజెండ పిలిచె రండి
రండి కదలి రండి
ఎర్ర దండులాగ రండి
తూరుపు పొత్తిళ్ల నుండి వేకువై రండి
చూపుడు వేలికి తొడిగిన ఆయుధమై రండి
ఆకసాన్ని డప్పు చేసి దరువులేస్తు రండి
తారల్ని గుదిగుచ్చి గజ్జెకట్టి రండి
జజ్జనక నక జజ్జనక...
జజ్జనక నక జజ్జనక...
॥రండి॥

చరణం: 1

భూమ్మీద శ్మశానాల్ని ప్రేమించే రాజ్యం
అక్షరాల తోటలపై అగ్గిజల్లె రాజ్యం
కవులు కళాకారులపై కత్తి దూసె రాజ్యం
పావురాళ్ల రెక్కలను విరిచేసే రాజ్యం
కోబలారే గువ్వా గువ్వా
కోబలారే గువ్వా గువ్వా
ఉరితాటికి పాట నేర్పె ఉద్యమమై రండి
ఊరూరా వసంతాలు చల్లుకుంటు రండి
॥రండి॥

చరణం: 2

అవినీతికి అంటుకడితే పుట్టినట్టి దొంగలు
గల్లి నుండి ఢిల్లీదాక వీళ్లేగా నేతలు
గుడిసెల గుమ్మాల ముందు నిబంధనల కంచెలు
గనులు గ్రానైట్లు దోచె ద్రోహులకే పదవులు
కోబలారే గువ్వా గువ్వా
కోబలారే గువ్వా గువ్వా
పగిలిన గుండెల్లోంచి పలుగులెత్తి రండి
ఎగిసిపడే దుఃఖాన్ని ఎగజిమ్ముతు రండి ॥రండి॥

చరణం: 3

దేశమంటె మతమంటు నినదించే నేతలు
మనిషి నుదుట మౌఢ్యంతో గీసే సరిహద్దులు
కాషాయీకరణ కొరకు నయవంచక దాడులు
దేశపు రహదారులపై రక్తపు కళ్లాపులు
కోబలారే గువ్వా గువ్వా
కోబలారే గువ్వా గువ్వా
నిప్పలతో తోరణాలు కట్టుకుంటు రండి
రాజందుల రాజ్యాన్ని తగలెడదాం రండి
॥రండి॥

చరణం: 4

కోడి కూత కూయగానే నాగలెత్తె మీరు
సాలు పట్టి దుక్కిదున్ని విత్తునాటె తీరు
పాలకుల పాపాలె శాపమైన వేళ
పొలం గట్లపైన పడి శవాలైన తీరు
కోబలారే గువ్వా గువ్వా
కోబలారే గువ్వా గువ్వా
విప్లవాల విత్తనాలు చల్లుకుంటు రండి
ఉద్యమాల జెండాలను నాటుకుంటు రండి
॥రండి॥

చరణం: 5

ఓటు హక్కు తప్ప మరే హక్కులేని మీరు
రంకు రాజకీయానికి బలౌతున్న తీరు
పేదవాడి పేగు భాష చదవలేని వాళ్లు
ఊళ్లు వల్లకాళ్లు చేసి ఊరేగే తీరు
కోబలారే గువ్వా గువ్వా
కోబలారే గువ్వా గువ్వా
లెవర లెవర లెవరహో అంటు కదిలిరండి
లెఫ్ట్ భావ తరంగమై సైరనూది రండి ॥రండి॥

CPI సీపీఐ అభ్యర్థులు

ఏలూరు అసెంబ్లీ బరిలో

## బండి వెంకటేశ్వరరావు

కార్మిక చైతన్యానికి, వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాట స్ఫూర్తికి నిదర్శనంగా నిలిచిన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు అసెంబ్లీ స్థానంనుంచి సీపీఐ పోరాట సారథి బండి వెంకటేశ్వరరావ పోటీ చేస్తున్నారు. ఆయన సుదీర్ఘ ఉద్యమానుబంధం కలిగినవారు. ప్రజా సంఘాలకు నేతృత్వం వహించినవారు. ఎర్రజెండాను చేతబూని కార్మిక, కర్షకులకు, వ్యవసాయ కార్మికులకు విజయాలు సాధించి పెట్టారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజల మద్దతును కూడగట్టేందుకు జరిగిన బైక్ యాత్రలో పాల్గొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకై పోరాటం సాగించారు. విభజన హామీలు, ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, ప్రాజెక్టు నిర్వాసితుల నష్టపరిహారం చెల్లింపు, పునరావాస కాలనీల నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పన కోసం సీపీఐ, ప్రజా సంఘాలు చేసిన అనేక పోరాటాలలో భాగస్వాములయ్యారు. ప్రజా పోరాటాల సందర్భంగా ప్రభుత్వాల నుంచి తీవ్ర గృహ నిర్బంధం, అక్రమ కేసులు ఎదురైనా వెరవలేదు. బండి వెంకటేశ్వరరావు సాధారణ వ్యవసాయ కుటుంబంలో 1967 ఏప్రిల్ 1న ఏలూరు జిల్లా నిడమర్రు మండలం భువనపల్లిలో జన్మించారు. న్యాయ శాస్త్రంలో పట్టా పొందారు. 1979లో 8వ తరగతి చదువుతుండగానే ఏఐఎస్ఎఫ్‌లో సభ్యులుగా చేరి పట్టణ కార్యదర్శిగా, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా 1992 వరకు విద్యార్థి సంఘంలో పని చేశారు. 1998 వరకు అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కొనసాగారు. సీపీఐ ఉద్యమ అవసరాలు రీత్యా 1993లో తణుకు నుంచి ఏలూరుకు వచ్చారు. 1998 లో సీపీఐ ఏలూరు ఏరియా కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఒక పక్క పార్టీ కార్యక్రమాలలో క్రియాశీలకంగా పని చేస్తూ మరోపక్క 1986 నుంచి 2007 వరకు విశాలాంధ్ర విలేకరిగా పనిచేశారు. జర్నలిస్టుగా పనిచేస్తున్న సమయంలో ఏలూరు ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగా, ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షులుగా పనిచేస్తూ జర్నలిస్టు సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. 2006లో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికై, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జాతీయ కార్యవర్గ సభ్యులుగా పనిచేశారు. ప్రస్తుతం సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి, జిల్లా కార్యవర్గ సభ్యులు, వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ సమితి సభ్యులు, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పని చేస్తున్నారు. దీంతోపాటుగా ఏఐటీయూసీ ఏలూరు జిల్లా ఉపాధ్యక్షులుగా, ఏలూరు నగరం, ఏలూరు జిల్లాలో ఉద్యోగ, కార్మిక సంఘాలకు గౌరవ సలహాదారులుగా, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ జిల్లా బాధ్యులుగా ఉన్నారు.

ప్రధాన పార్టీలకే

# తిరుపతి ఓటర్ల పట్టం

▸ పట్టు సాధించేందుకు కాంగ్రెస్ పోరాటం ▸ పాత వైభవం కోసం ఎన్డీయే ఆరాటం

▸ నాలుగోసారి విజయంపై వైసీపీ దృష్టి

చింతామోహన్ (కాంగ్రెస్ )

గురుమూర్తి (వైసీపీ)

వరప్రసాద రావు (బీజేపీ )

కేవలం ఆధ్యాత్మిక కేంద్రమే కాక... రాజకీయాలకు కేంద్ర బిందువుగా పేరొందిన తిరుపతి లోక్‌సభ నియోజకవర్గం ఓటర్లు ఇప్పటివరకు ప్రధాన పార్టీల అభ్యర్థులను గెలిపిస్తున్నారు. జాతీయ, ప్రాంతీయ పార్టీల అభ్యర్థులు విజయం సాధించిన చరిత్ర నియోజక వర్గానికి ఉంది. నియోజకవర్గ ఏర్పాటు అయినప్పటి నుంచి అత్యధిక సార్లు కాంగ్రెస్ ప్రస్తుత అభ్యర్థి చింతా మోహన్ గెలిచారు. తిరుపతి లోక్ సభ నియోజవర్గం 1952లో ఏర్పాటు కాగా ఇప్పటి వరకు ఉప ఎన్నికలతో సహా 17 సార్లు ఎన్నికలు జరిగాయి. చింతామోహన్ ఆరుసార్లు గెలుపొందారు. పార్టీల పరంగా చూస్తే కాంగ్రెస్ 10 సార్లు విజయం సాధించింది. తొలి లోక్‌సభకు స్పీకర్‌గా పనిచేసిన మాడభూషి అనంతశయనం అయ్యంగార్ తిరుపతి నుంచి గెలుపొందిన వారే. కాంగ్రెస్, బీజేపీతో పాటు తెలుగుదేశం, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను తిరుపతి ఓటర్లు ఆదరించారు. మరో పార్టీకిగానీ, స్వతంత్ర అభ్యర్థులకుగానీ అవకాశం ఇవ్వలేదు. మూడు దశాబ్దాల పాటు కాంగ్రెస్ విజయం సాధిస్తూ వచ్చింది. టీడీపీ ఆవిర్భావం తర్వాత పరిస్థితి మారింది. తిరుపతి లోక్‌సభ నియోజకవర్గం ఏర్పాటైన తర్వాత 1952లో జరిగిన ఎన్నికలకు మాత్రమే జనరల్ స్థానంగా ఉండేది. ఆ తర్వాత ఎస్సీ రిజర్వుడ్ స్థానమైంది. నాడు కాంగ్రెస్ తరపున పోటీ చేసిన గెలిచిన అనంతశయనం తర్వాత సి దాస్ రెండుసార్లు, తంబూరు బాలకృష్ణయ్య మూడుసార్లు విజయం సాధించారు. ప్రతి ఎన్నికలలో కాంగ్రెస్‌ను ఆదరించిన ఓటర్లు 1984లో తొలిసారి టీడీపీ వైపు మొగ్గు చూపారు. తొలిసారి రాజకీయ రంగ ప్రవేశం చేసిన డాక్టర్ చింతామోహన్ తెలుగుదేశం పార్టీ నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత 1989, 1991లో జరిగిన ఎన్నికలలో వరుసగా గెలిచారు. నెలవల సుబ్రహ్మణ్యం 1996లో కాంగ్రెస్ తరపున గెలుపొందారు. ఆ ఎన్నికల్లో చింతామోహన్‌కు అభ్యర్థిత్వం దక్కలేదు. 1998లో కాంగ్రెస్ తన అభ్యర్థిగా చింతామోహన్‌ను బరిలోకి దించింది. ఈ ఎన్నికలలో గెలుపొంది తిరుపతి నుంచి ఎంపీగా నాలుగోసారి ఎన్నికైన వ్యక్తిగా రికార్డు నెలకొల్పారు. ఆ ఎన్నికలు జరిగిన ఏడాదికి లోక్‌సభ కు సాధారణ ఎన్నికలు వచ్చాయి. ఆ ఎన్నికలలో టీడీపీ, బీజేపీ కలిసి పోటీ చేశాయి. కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ చింతా మోహన్‌పై స్వల్ప ఆధిక్యతతో బీజేపీ అభ్యర్థి, విశ్రాంత ఐఏఎస్ ఎన్. వెంకటస్వామి గెలుపొందారు. 2004, 2009లో జరిగిన ఎన్నికలలో చింతా మోహన్ కాంగ్రెస్ తరపున పోటీ చేసి వరుసగా రెండుసార్లు విజయం సాధించారు. దీంతో తిరుపతి నుంచి లోక్‌సభకు ఆరు సార్లు ప్రాతినిధ్యం వహించిన రికార్డును సొంతం చేసుకున్నారు. తిరుపతి నుంచి ప్రాతినిధ్యం వహించిన ఎంపీలలో కేంద్ర మంత్రిగా కొంతకాలం పనిచేసిన ఘనత సైతం చింతా మోహన్‌కే దక్కింది. ఆ తర్వాత రాష్ట్రంలో చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలతో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించింది. దీంతో తిరుపతి ఓటర్లు ఆ పార్టీని ఆదరిస్తున్నారు. వైసీపీ అభ్యర్థులు వరుసగా మూడుసార్లు ఎన్నికయ్యారు. 2014 ఎన్నికల్లో కాంగ్రెస్, టీడీపీ మద్దతుతో బరిలోకి దిగిన బీజేపీ అభ్యర్థులను ఓడించి వరప్రసాదరావు వైసీపీ తరపున గెలుపొందారు. 2019లో వైసీపీ అభ్యర్థి దుర్గాప్రసాదరావు విజయం సాధించారు. 2021లో జరిగిన ఉప ఎన్నికలలో మద్దెల గురుమూర్తి భారీ ఓట్ల తేడాతో విజయం సాధించారు. ప్రస్తుత ఎన్నికలలో ప్రధాన పార్టీల అభ్యర్థులందరూ గతంలో తిరుపతి పార్లమెంటుకు ప్రాతినిధ్యం వహించినవారే కావడం విశేషం. కాంగ్రెస్ అభ్యర్థిగా డాక్టర్ చింతామోహన్, వైసీపీ అభ్యర్థిగా మద్దెల గురుమూర్తి, బీజేపీ అభ్యర్థిగా వరప్రసాద రావు ఎన్నికల బరిలో ఉన్నారు. తాజా ఎన్నికలలో వైసీపీ ఒంటరిగా పోటీ చేస్తుండగా, చింత మోహన్ ఇండియా కూటమి మద్దతుతో పోటీ చేస్తున్నారు. బీజేపీ అభ్యర్థికి టీడీపీ, జనసేన మద్దతిస్తున్నాయి.

- విశాలాంధ్ర బ్యూరో-తిరుపతి